వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 276 | శనివారం | 05-09-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ఇద్దరు మృత్యుంజయులు

9 రోజుల తర్వాత సొరంగం నుంచి బయటకు...

1,295కు పెరిగిన మృతులు 08





నేడు ఉపాధ్యాయ దినం

### టీచర్లకు శుభాకాంక్షలు

నేడు ఉత్తమ ఉపాధ్యాయుడు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. ఆయన జన్మదినాన్ని దేశం ఉపాధ్యాయ దినంగా జరుపుకుంటూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించుతున్నది. జాతిని తీర్చిదిద్దే గురువులందరికీ మా శుభాకాంక్షలు

– ఎడిటర్



## నేరస్థులు బయట తిరుగుతున్నా

# చర్యలేవి?

నిందితుడు స్వతంత్ర భరద్వాజ్‌పై కఠినంగా వ్యవహరించాలి

పార్లమెంటు స్ట్రీట్ పిఎస్ వద్ద సిజెపి నిరసన

**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో దాడికి సంబంధించి 'ఇన్‌ఫ్లుయెన్సర్'గా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) శుక్రవారం పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించింది. నిరసన సమయంలో తమ మద్దతుదారులలో ఒకరికి గాయాలైన ఘటనకు సంబంధించి సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్, సహకన్వీనర్ అశుతోష్ రాంకా, ఇతరులు పటేల్ చౌక్ నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ సౌరవ్ దాస్ విలేకరులతో మాట్లాడుతూ 'మా నిరసనలో మొదటి రోజు నుంచే ఒక మైనర్ బాలిక పాల్గొంటోంది. ఆమె తండ్రి సంజయ్ జీ కూడా ఆమెతో పాటు వస్తుంటారు. మేము శాంతియుతంగా నిరసన చేస్తున్నప్పుడు నేరపూరిత ముఠా సభ్యులు అక్కడికి వచ్చి హింసకు పాల్పడ్డారు' అని తెలిపారు. 'ఎఫ్ఐఆర్ నమోదయిన తర్వాత, తరువాయి 12లో

### భరద్వాజ్ అరెస్టు

కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సమయంలో.. నిషా ఆజాద్ అనే కార్యకర్త తండ్రిని స్వతంత్ర భరద్వాజ్ చితకబాదాడు. అయితే ఆ కేసులో శుక్రవారం నిందితుడు స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 72 గంటల్లోగా భరద్వాజ్‌ను అరెస్టు చేస్తామని సిజెపికి ఢిల్లీ పోలీసులు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ అరెస్టు చోటుచేసుకున్నది. బులంద్‌షెహర్‌లో పోలీసులు బృందాలు అతన్ని పట్టుకున్నాయి. గతంలోనూ అతను పోలీసులు నుంచి తప్పించుకున్నాడు.

జంతర్ మంతర్

### నిరసనలో ఖైదీలా?

వారెలా వచ్చారు... ఎవరు తీసుకొచ్చారు? 12

అమిత్‌షా సమాధానమేమిటి: డి.రాజా

బద్లావ్ జరూరీ హై ఆగదు...

డిసెంబర్ 1,2,3లో దేశవ్యాప్తంగా

# 5 లక్షల మందితో జైల్ భరో

### సిపిఐ జాతీయ సమితి పిలుపు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 'బద్లావ్ జరూరీ హై' (మార్పు అవసరం) నినాదంతో రాజకీయ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని సిపిఐ నిర్ణయించింది. ప్రజల సమస్యలపై పోరాడే అన్ని శక్తులు ఏకం కావాలని... మోదీ ప్రభుత్వ విధానాలకు ప్రత్యామ్నాయ రాజకీయ దిశగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించింది. 'బద్లావ్ జరూరీ హై' అనేది ప్రజా పోరాటాల నినాదం కావాలన్నదే లక్ష్యమని తెలిపింది. మోదీ ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతప్తిని విస్తత ప్రజా ఉద్యమంగా మలిచేందుకు వరుస ఆందోళనలకు సిపిఐ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించాలని, కనీసం ఐదు లక్షల మంది అరెస్టులకు సిద్ధం కావాలని పేర్కొంది. అలాగే అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని 'మత సామరస్య దినోత్సవం', నవంబరు 7న 'విప్లవ దినోత్సవం' పాటించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలోని అజయ్ భవన్‌లో బుధ, గురువారాలలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ గిరీశ్ శర్మ అధ్యక్షతన జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గం, సమితి సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు తరువాయి 8లో



పరిహారంతో పాటు

## పునరావాసం కల్పించాల్సిందే

మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూములపై హైకోర్టు స్పష్టీకరణ





ప్రజాపక్షం/హైదరాబాద్

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం జీవో 123 కింద అంగీకారంతో భూములు ఇచ్చిన రైతులకు భూ పరిహారంతో పాటు పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు కల్పించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. పరిహారం తీసుకుని అంగీకార పత్రాలపై సంతకాలు చేశారనే కారణంతో పునరావాస ప్రయోజనాలను నిరాకరించరాదని తేల్చింది. సిద్ధిపేట జిల్లా తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్, తరువాయి 12లో

## తాగునీటికే ప్రాధాన్యం

- కృష్ణా జలాల పంపకాలపై మరోసారి ప్రతిష్టంభన
- 50:50 వాటా కోరిన తెలంగాణ – 66:34కు ఏపి పట్టు
- ఈ నెల 4వ వారంలో కెఆర్‌ఎంబి పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబి) కీలక సూచనలు చేసింది. ఎల్‌నినో ప్రభావం, ఉమ్మడి జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయిలో ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కోసం మాత్రమే ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు విడుదల చేయవద్దని కెఆర్‌ఎంబి స్పష్టం చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలను నియంత్రించాలని సూచిస్తూ, రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కెఆర్‌ఎంబి తరువాయి 8లో

జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17

## రాకెట్ ప్రయోగం సక్సెస్

- తొలిసారిగా కక్ష్యలోకి అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం ఇఒఎస్ –05
- వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో కీలకం
- దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ ప్రశంస

**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియోఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం ఇఒఎస్ –05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువజామున 2.55 గంటలకు జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్ –05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్–జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8 నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది తరువాయి 8లో





## కొండా బర్తరఫ్ బాధాకరం

పలుమార్లు పార్టీ లైన్ దాటినందునే చర్యలు : పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రమంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌పై టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ బర్తరఫ్ బాధకరమని అన్నారు. ఆమె పలుమార్లు పార్టీ లైన్ దాటి మాట్లాడారని.. గతంలో కూడా ఆమెపై ఫిర్యాదులు వస్తే సిఎంతో చర్చించి పరిష్కరించానని తెలిపారు. ఈ సారి నా చేతుల్లో ఏమి లేదని స్పష్టం చేశారు. కూతురు చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ తరువాయి 8లో



ప్రజాపక్షం / వికారాబాద్

## నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దు

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- కొడంగల్ నియోజకవర్గంలో పర్యటన
- మద్దూరు, హకీంపేట, దౌల్తాబాద్‌లలో అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని తరువాయి 8లో

స్వయంకృతాపరాధంతో

## చేజారిన పదవి

- తొలిసారి ఏడాది.. రెండోసారి రెండున్నరేళ్లు
- ముంచిన కొండా కుటుంబ దూకుడు తత్వం

ప్రజాపక్షం/హనుమకొండ



స్వయంకృతాపరాధంతో కొండా సరేఖ చేజేతులా మంత్రి పదవి నుంచి బర్తరఫ్‌కు గురయ్యేలా చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు దూకుడు తత్వం కలిగిన కొండా కుటుంబానికి అన్ని వేళలా అది కలిసిరాదని తేలింది. ఓరుగల్లు రాజకీయాల్లో సంచలనాలకు కేంద్రంగా ఉండే కొండా దంపతుల తాజా ఎపిసోడ్ కూడా బర్తరఫ్ తో మరో సంచలనంగా మారింది. రాజకీయాల్లో ప్రవేశించినప్పటి నుంచి కొండా దంపతులు దూకుడు తనమే ఆయుధంగా మలుచుకున్నారు. దాంతోనే వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బలమైన కేడర్ ను నిర్మించుకున్నారు. పరకాల నియోజకవర్గంలోని గీసుకొండ మండలం వంచినగిరికి చెందిన కొండా దంపతులు తొలుత స్థానిక సంస్థల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.వంచనగరి నుంచి ఎంపిటిసిగా గెలిచి గీసుకొండ ఎంపిపిగా కొండా సరేఖ గెలిచారు. తర్వాత 1999లో శాయంపేట నుంచి అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2004లో సైతం మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో పునర్విభజనలో భాగంగా జనరల్ గా ఏర్పడిన పరకాల నుంచి పోటీచేసి మూడోసారి విజయం సాధించారు.నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ కేబినెట్ లో మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు చేపట్టారు. వైఎస్ మృతితో కొణిజేటి రోశయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కోసం ప్రయత్నించడంతో సురేఖ జగన్‌కు అండగా నిలిచారు. సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా విప్ ధిక్కరించి ఓటెయ్యడంతో ఎమ్మెల్యే పదవి కోల్పోయారు. దీంతో 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో పరకాల నుంచి పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తరువాయి 8లో

## 6న ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ మహాధర్నా

కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఉన్న కెసిఆర్ తన తరువాయి 12లో

గత ప్రభుత్వ వైఫల్యంతోనే

## పోలవరం ముప్పు

నిర్ణీత గడువులోగా రామాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



ప్రజాపక్షం/భద్రాచలం

గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్య వైఖరితోనే తెలంగాణకు పోలవరం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవస్థాన అభివృద్ధి పనులపై సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలతోపాటు భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పెద్దగా వరదలు లేకపోయినా భవిష్యత్తులో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణ స్థాయి కంటే 2025 అడుగుల మేర బ్యాక్‌వాటర్ ఉధృతి పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలు గతంలో సిడబ్ల్యుసి, ఇతర కేంద్ర సంస్థల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా తగిన స్పందన తరువాయి 12లో

# అంటరానితనం ఇంకానా?

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు సమీపిస్తున్నా, వికసిత్ భారత్ అంటూ శతవార్షికోత్సవానికి (2047) పరుగులు తీస్తున్నా అంటరానితనం, వరకట్నం, బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలు కొనసాగుతూ ఉండటం భారతదేశం వికాసంపై మాయనిమచ్చ. ఈ దురాచారాలు ఒక నాడున్నంత తీవ్రంగా ఈనాడు కనిపించకపోవచ్చు. కాని మనం చూస్తున్న, వింటున్న తత్సంబంధిత అనేక దురాగతాలకు వివక్షాపూర్వక మానసిక స్థితి మారకపోవటమే కారణం. ఎన్ని ప్రగతిశీల చట్టాలు చేసినా వాటి అమలు అంతంతమాత్రంగా ఉండటానికి ఆ మనోగతమే కారణం. కులాధిపత్యం, మహిళల అణచివేత, వివక్ష ఇవి పితృస్వామిక వ్యవస్థ లక్షణాలు, ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు. ఈ దురాచారాలకు వ్యతిరేకంగా ఎందరో సంస్కర్తలు తమ జీవితాలు అర్పించారు. జాతీయోద్యమం సానుకూలంగా స్పందించింది. స్వాతంత్ర్యానంతరం సంఘసంస్కరణోద్యమ ప్రభావంతో సానుకూల చట్టాలు వచ్చాయి. ఫ్యూడల్ వ్యవస్థ బద్దలై, పెట్టుబడిదారీ విధానం వృద్ధితో సాంఘిక సంబంధాల్లో వచ్చిన మార్పులు కూడా ఇందుకు దోహదం చేశాయి. అయితే అదే సమయంలో స్వాములు, బాబాలు సనాతన ధర్మ ప్రచారం పేరుతో మూఢాచారాలను సజీవంగా ఉంచుతున్నారు. వారికి కొన్ని రాజకీయ పక్షాల అండదండలున్నాయి. సనాతన ధర్మ పరిరక్షణ, మనుస్మృతి కట్టుబాట్లను సమర్థించే శక్తులు అధికార అందలాలు అధిరోహించాక కులతత్వం, మత తత్వం మళ్లీ పుంజుకున్నాయి. దళితులపై దాడులు పెరుగుతున్నాయి. కులాంతర వివాహాలను ప్రోత్సహించే రోజులుపోయి పరువు పేరుతో అట్టి వధూవరులను హత్యచేసే కాలమొచ్చింది. దీనికి ప్రధాన కారణం దేశంలో పురోగామి భావజాల ప్రచారం, వామపక్ష భావజాల ప్రభావం బలహీనపడి, తిరోగమన లేదా సనాతన భావజాలం పెచ్చరిల్లటం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లో ఒక సభలో ప్రసంగించి వచ్చాక, దళితుడు కూర్చున్న ప్రదేశం అపవిత్రం అయిందని భావించి హిందూ అగ్రకులజులు కొందరు ఆ ప్రదేశాన్ని శుద్ధిచేసినా వారిపై పోలీసులు అంటరానితనం నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదంటే బిజెపి ప్రభుత్వం అండచూసుకునే కదా? ఇలాంటి అవమానకర సంఘటనలు ప్రతిరోజూ దేశంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి.

మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లా ఉకావల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026, జులై 28న ఒక ఉపాధ్యాయుడు నాల్గవ తరగతి దళిత విద్యార్థిని కులం పేరుతో తిట్టి, కొట్టినట్లు మీడియాలో వచ్చిన వార్తను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సి) తనకు తానుగా పరిగణలోకి తీసుకుంది. ఆ బాలుడు చేసిన తప్పేమిటి? దప్పిక తీర్చుకునేందుకు టీచర్ బాటిల్‌లోని నీళ్లు త్రాగాడు. అది ఆ టీచర్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ సమాచారాన్ని భారత ప్రభుత్వ ప్రెస్ ఏజన్సీ – పిఐబి – ఆగస్టు 6న పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసింది. ఈ సమాచారం యదార్థమైతే టీచర్ చర్య మానవ హక్కుల తీవ్రమైన ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్న ఎన్‌హెచ్‌ఆర్‌సి, మధ్యప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి, జిల్లా ఎస్‌పికి నోటీసులు జారీ చేసి సవివరమైన నివేదిక కోరింది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచారాల నిరోధక)చట్టం, 1989 ఆమోదించి 37 ఏళ్లు గడిచిపోయినా దళితులు, ఆదివాసీలు ఎందుకు వివక్షకు, దాడులకు, అత్యాచారాలకు గురవుతున్నారు? అగ్రవర్ణాల్లో మానసిక మార్పు రాకపోవటం, ఆ విధమైన ప్రచారం లేకపోవటం, నమోదైన అత్యాచారాల కేసులు సత్వరం పరిష్కారమై నిందితులకు కఠిన శిక్షలు పడకపోవటం కారణాలు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెల్హాట్, ఐదుగురు దళితులు సహా మొత్తం ఆర్గురి హత్య కేసులో 11ఏళ్ల తర్వాత వచ్చిన తీర్పులో నిందితులు 40 మంది నిర్దోషులుగా బయటకు వచ్చిన ఒక ఉదంతాన్ని సోషల్ మీడియా అక్కౌంట్‌లో పోస్టు చేశారు. 40మంది నిందితులూ నిర్దోషులైతే ఆ ఆరుగుర్ని చంపిందెవరు అని వారి కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవస్థలో అది జవాబుకు నోచని ప్రశ్న!

సామాజిక న్యాయం శాఖ మంత్రి రాందాస్ అథవాలె జులై 30న రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం (ఎన్‌హెచ్‌ఆర్‌సి గణాంకాలు) ఎస్‌సి/ఎస్‌టి చట్టం కింద కేసుల నమోదుకు, వాటి పరిష్కారం, శిక్షల విధింపు మధ్య పెద్ద అగాథం ఉంది. 2020లో దాదాపు 45995కేసులు నమోదుకాగా 17113 ఇంకనూ దర్యాప్తులో ఉన్నాయి; 2613 మందికి శిక్షలు పడ్డాయి. 2021లో 46100; 2022లో 52886; 2023లో 53372; 2024 లో 48669కేసులు రిజిస్టర్ అయినాయి. కాగా అదే సంవత్సరాల్లో శిక్షలు పడిన కేసులు వరుసగా 2613; 2848; 4876; 4691; 5192. విచారణ పెండింగ్ ఉన్న కేసులు 2020లోని 1,77,379 నుంచి 2024 చివరకు 2,87,694 పెరిగాయి. దాఖలైన కేసుల్లో శిక్షలుపడినవి 2020లో 6.45శాతం, 2021లో 6.94 శాతం, 2022లో 10.79శాతం, 2023లో 8.67శాతం, 2024లో 12.87శాతం. పెండింగ్ కేసులు ఎప్పటికి పరిష్కారమయ్యేను? అందువల్ల ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలు గ్రహించి దళితులకు సత్వరన్యాయం కలుగజేసే మార్గం అన్వేషించాలి. సనాతన వాదులు దళితులూ హిందువులే అంటారు. కాని వారికి దేవాలయ ప్రవేశాన్ని, ఉమ్మడి వసతుల్లో నీరు తీసుకోవటాన్ని, వర్ణాంతర వివాహాలను సమర్థించరు. అంటరానితనం పాటించేవారు అగ్రవర్ణాలే కదా! ఎందుకీ వివక్ష. శూద్రులు, వారిలోని దళితులు శ్రీ మహావిష్ణువు పాదాల లోనుంచి జన్మించారని, అగ్రవర్ణాలకు సేవచేయటమే వారి ధర్మం అనే పురాణాల ప్రచారం వారి మానసిక ఎదుగుదలను అరికడుతున్నది. అందువల్ల సాంఘిక సంస్కరణకు యువతరం నడుంకట్టాలి.



### విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

**ఉపాధ్యాయులు వారి మార్గదర్శకత్వం, సలహాల ద్వారా విద్యార్థులలో ప్రతిభను పెంపొందించడంలోనూ, వ్యక్తిత్వాన్ని బలోపేతం చేయడంలోనూ కీలకపాత్ర పోషిస్తారు. వారు అనునిత్యం జ్ఞానాన్ని సమీకరించుకోవాలి. వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలి. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒకగొప్పరచయితగా, తాత్వికవేత్తగా, అసాధారణ ఉపాధ్యాయుడిగా పేరొందిన ఆయనకు నా నివాళులు.**

– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



## సాహస ఉద్యమకారిణి, జర్నలిస్టు గౌరీ లంకేశ్

ఇటీవల కాలంలో భారతదేశంలో ప్రసిద్ధి చెందిన బహు కొద్దిమంది మహిళా జర్నలిస్టుల్లో గౌరీ లంకేశ్ ఒకరు.. ఈమె మరణించి నేటికి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అవుతున్నా, దేశంలో ఏదో ఒకచోట గౌరీ లంకేశ్ మాట ఉచ్చరించకుండా ఏ రోజూ గడవదు అంటే అతిశయోక్తి కాదేమో.!? దీనికి ప్రధాన కారణం గౌరీ లంకేశ్ ప్రతీ రోజూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడమే, చిన్నప్పుడు నుంచీ జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉండుటచే తన తండ్రి మరణానంతరం తానే పత్రిక స్థాపించి, మత మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు పై తన కలం, గళం ద్వారా అందరికీ అవగాహన కల్పించేందుకు పాటు పడ్డారు.. ముక్కుసూటి మనస్తత్వం కలిగి, ధైర్యంగా సమాజంలో జరుగుతున్న వివిధ అసమానతలపై పోరుబాట పట్టారు.. 'ఎంగిలాకులపై పొర్లు దండాలు పెట్టించే దుష్ట ఆచారాలపై' అలుపెరుగని పోరాటం చేసారు. బాబా బుడాన్ గిరి దత్త పీఠంలో జరుగుతున్న వివిధ అకృత్యాలపై తన కలం, గళం ద్వారా ఉద్యమ ప్రపంచాన్ని నిర్మించారు.. సంఘ్ పరివార్ దూకుడుకు చెక్ పెట్టారు.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.. ప్రజా ఉద్యమాల్లో మమేకం అయ్యారు.. అణగారిన వర్గాల కోసం శ్రమించే వారికి అండగా నిలిచారు..

ముఖ్యంగా దేవాలయాల్లో జరిగే మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాల పట్ల ఎన్నో కథనాలు రాసారు.. దీంతో ఒక వర్గానికి వ్యతిరేకంగా ముద్రపడ్డారు. హిందూత్వ అతివాదం పై ధిక్కార స్వరం వినిపించారు. మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే మతవాదంపై పోరుబాట చేసారు... రామచంద్రపుర మఠానికి చెందిన రాగవేశ్వర భారతి, మహిళలపై జరిపిన అనేక అకృత్యాలపై తన కలం, గళం ద్వారా కదం తొక్కారు.. అప్పటి కర్ణాటకలో పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మావోయిస్టులను ప్రజాజీవితంలో కలిపే కార్యక్రమంలో గౌరీ లంకేశ్ ను భాగస్వామ్యం చేసారు.. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతున్న వారికి మద్దతు ప్రకటించారు..ఈ విధంగా లెఫ్ట్ ఓరియంటేషన్ భావాలతో పౌర సమాజంలో హేతువాద దృక్పథం పెంచడంలో సఫలీకృతం అయ్యారు.. ఈమె చేసే వివిధ ప్రజా ఉద్యమాలను ఓర్వలేక కొంతమంది దుండగులు 2017 సెప్టెంబర్ 5వ తేదీన కాల్పులు జరిపి హతమార్చారు.. దీంతో దేశం దిగ్భ్రాంతికి లోనైంది.. జర్నలిస్టుగానే కాకుండా ఉద్యమకారిణిగా ప్రజల హక్కులను కాపాడటం కోసం, సమ సమాజ స్థాపన కోసం, మహిళల హక్కుల కోసం,అసమానతలపై పోరుబాట పట్టిన వీరనారి గౌరీ లంకేశ్ ..భారత జర్నలిజం చరిత్రలో ఒక చిరస్మరణీయమైన పాత్ర పోషించారు... ఈమెలోని భావాలు నేటి పాత్రికేయులు, మహిళలు, అభ్యుదయ భావాలు కలిగిన వారు అందిపుచ్చుకుని, సంకుచిత, అవకాశవాద రాజకీయాలపై, మత ఛాందస భావాలపై ప్రశ్నిస్తూ ముందుకు సాగడమే ఈమెకు మనం అందరం ఇచ్చే ఘన నివాళి.

**(నేడు గౌరీ లంకేశ్ వర్ధంతి)**

ఐ.పి.రావు

## నిరుద్యోగ యువతకు ఏదీ భవిష్యత్తు?



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9705309583

చదువుకో... మంచి ఉద్యోగం వస్తుంది – మన దేశంలో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు చెప్పే మాట. చిన్నతనం నుంచి పాఠశాల, కళాశాల, కోచింగ్ సెంటర్, పోటీ పరీక్షలు అంటూ ఎన్నో సంవత్సరాలు చదివిన తర్వాత ఒక మంచి ఉద్యోగం వస్తే కుటుంబ భవిష్యత్తు మారుతుందని యువత ఆశపడుతుంది. కానీ నేటి వాస్తవ పరిస్థితి ఆ ఆశలకు భిన్నంగా ఉంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఒక ఉద్యోగ ప్రకటన వెలువడితే లక్షలాది మంది పోటీ పడాల్సిన పరిస్థితి. పరీక్ష రాస్తే ఫలితాల కోసం నెలలు, సంవత్సరాలు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఉద్యోగం వచ్చినా అది శాశ్వతమా? సరైన వేతనం ఉంటుందా? సామాజిక భద్రత ఉంటుందా? అనే ప్రశ్నలు యువతను వెంటాడుతున్నాయి.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఈ యువశక్తి దేశానికి గొప్ప సంపద. యువతలో ఉన్న శక్తి, ప్రతిభ, సృజనాత్మకత, శ్రమ దేశ ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడితే భారతదేశం అపారమైన పురోగతిని సాధించగలదు. కానీ యువతకు విద్య, నైపుణ్యం, ఉపాధి, సామాజిక భద్రత కల్పించలేకపోతే అదే యువ జనాభా నిరుద్యోగం, నిరాశ, వలసలు, అసమానతలకు కారణమవుతుంది. అందుకే నేడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రశ్నల్లో యువత ఉపాధి ప్రశ్న ఒకటి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రూపొందించిన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2025 కూడా భారతదేశంలో యువత నిరుద్యోగం, ముఖ్యంగా చదువుకున్న యువత నిరుద్యోగాన్ని తీవ్రమైన సవాలుగా గుర్తించింది. విద్యా స్థాయి పెరుగుతున్నప్పటికీ దానికి అనుగుణంగా నాణ్యమైన ఉపాధి అవకాశాలు తగినంతగా పెరగకపోవడం భారత కార్మిక మార్కెట్‌లో ఉన్న వైరుధ్యాన్ని బయటపెడుతోంది. ఒకవైపు యువ భారతదేశం గురించి గొప్పగా మాట్లాడుతున్న పాలకులు, మరోవైపు ఆ యువతకు తగిన స్థిరమైన ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమవుతున్నారు. నేటి యువత గత తరాలతో పోలిస్తే ఎక్కువగా చదువుకుంటోంది. అయితే విద్యా వ్యవస్థ నుంచి బయటకు వచ్చిన ప్రతి యువకుడికి తన విద్యకు తగ్గ ఉద్యోగం దొరుకుతుందా అనే ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేదు. డిగ్రీ చేతిలో ఉంది, కానీ ఉద్యోగం లేదు. నైపుణ్యం ఉంది, కానీ అవకాశాలు లేవు. ప్రతిభ ఉంది, కానీ స్థిరమై న ఉపాధి లేదు. ఇదే నేటి యువత ఎదుర్కొంటున్న విషాదకర వాస్తవం.


ప్రభుత్వ ఉద్యోగం కోసం జీవితమే ఒక పరీక్షగా మారడం నేటి యువత పరిస్థితికి మరో ఉదాహరణ. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం జీతం కాదు. అది కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం, వైద్య భద్రత, భవిష్యత్తుపై నమ్మకం. అందుకే ఒక చిన్న ఉద్యోగ ప్రకటన వెలువడినా వేలాది, లక్షలాది మంది యువత దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒక పోస్టుకు వేలమంది పోటీ పడటం యువత ప్రతిభకు మాత్రమే నిదర్శనం కాదు; దేశంలో నాణ్యమైన, స్థిరమైన ఉద్యోగాల కొరతకు కూడా నిదర్శనం.

తెలంగాణలో కూడా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఒక ప్రధాన రాజకీయ, సామాజిక ప్రశ్నగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ దశల్లో నియామక ప్రక్రియలను చేపట్టింది. 2026 జనవరిలో టిజిపియస్ గ్రూప్–IIIలో ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగింది. భవిష్యత్తులో ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నియామకాలు జరగడం స్వాగతించాల్సిన విషయమే. అయితే యువత అడగాల్సిన ప్రశ్న ఇక్కడితో ముగియదు. ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నా యి? వాటికి నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయి? పరీక్షలు ఎప్పుడు జరుగుతాయి? ఫలితాలు ఎప్పుడు వస్తాయి? నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయి? ఈ వివరాలన్నీ ప్రజలకు పారదర్శకంగా తెలియాలి.

ప్రతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం, కొన్ని నియామకాలు చేపట్టడం, ఆ తర్వాత మిగిలిన ఖాళీలపై స్పష్టత లేకపోవడం కొనసాగితే యువత భవిష్యత్తు అనిశ్చితిలోనే ఉంటుంది. అందుకే రాష్ట్రంలో ప్రతి సంవత్సరం శాఖల వారీగా ఖాళీలను ప్రకటించి, వాటి ఆధారంగా వార్షిక ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలి. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం యువత జీవితాన్ని సంవత్సరాల తరబడి నిలిపివేసే పరిస్థితికి ముగింపు పలకాలి.

ప్రభుత్వ ఉద్యోగాల కొరతతో యువత ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తోంది. అయితే ప్రైవేటు రంగంలో కూడా సమస్యలు తీవ్రంగానే ఉన్నాయి. ఇంజినీరింగ్ లేదా ఇతర ఉన్నత విద్య పూర్తిచేసిన యువకుడు తక్కువ వేతనంతో ఉద్యోగం ప్రారంభిస్తాడు. ఎక్కువ పని గంట లు, వారానికి ఆరు రోజుల పని, ఉద్యోగ భద్రత లేకపోవ డం, ఆరోగ్య బీమా లేకపోవడం, భవిష్యత్తు భద్రత లేకపోవడం సాధారణమవుతున్నాయి. కాంట్రాక్ట్ ముగిసిందంటే ఉద్యోగం ముగిసిపోవచ్చు. సంస్థలో ఆర్థిక పరిస్థితులు మారితే ఉద్యోగం కోల్పోవచ్చు.

ఈ నేపథ్యంలో గిగ్ ఎకానమీ మరో కొత్త సవాలుగా ముందుకు వచ్చింది. డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ కార్మికులు, వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సేవలు అందించే యువత సంఖ్య పెరుగుతోంది. వీరికి పనిచేసే స్వేచ్ఛ ఉన్నట్లు కనిపించినప్పటికీ, కనీస ఆదాయ భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్య రక్షణ, వృద్ధాప్య భద్రత వంటి ప్రశ్నలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. యాప్ లో లాగిన్ అవ్వండి, పని చేసుకోండి అనే విధానం యువతకు స్థిరమైన భవిష్యత్తును ఇవ్వదు. శ్రమించే ప్రతి యువకుడికి సామాజిక భద్రత ఉండాలి.




అదే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రభుత్వా లు కేవలం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యత ముగించకూడదు. నైపుణ్యం అవసరమే. కానీ స్కిల్ ట్రైనింగ్ ఉద్యోగానికి ప్రత్యామ్నాయం కాదు. ఒక యువకుడికి ఆరు నెలల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడం ద్వారా అతని సమస్య పరిష్కారం కాదు. శిక్షణ తర్వాత అప్రెంటిస్‌షిప్, అప్రెంటిస్‌షిప్ తర్వాత ఉద్యోగం, ఉద్యోగంలో న్యాయమైన వేతనం, సామాజిక భద్రత అనే పూర్తి వ్యవస్థను నిర్మించాలి. యువతకు శిక్షణ ఇచ్చే సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు పరస్పరం అనుసంధానమై పనిచేయాలి.

ఉపాధి సమస్యకు మరో ముఖ్యమైన కోణం ప్రాంతీయ అసమానత.

గ్రామీణ యువత ఉపాధి ప్రశ్నను వ్యవసాయంతో వేరు చేసి చూడలేం. రైతు కుటుంబం ఆర్థికంగా బలహీనపడితే ఆ కుటుంబంలోని యువత మొదటగా ప్రభావితమవుతుంది. వ్యవసాయంలో ఆదాయం అనిశ్చితంగా ఉంటే యువత పట్టణాల వైపు చూస్తుంది. అందుకే వ్యవసాయాన్ని కేవలం పంట పండించే రంగంగా కాకుండా ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలి. పంట ఉత్పత్తితో పాటు నిల్వ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, ఎగుమతులు వంటి రంగాలను గ్రామీణ ప్రాంతాల్లోనే అభివృద్ధి చేస్తే వ్యవసాయంతో అనుసంధానమైన అనేక ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

మహిళా యువత ఉపాధి సమస్యను కూడా ప్రత్యేకం గా చూడాలి. విద్య పూర్తిచేసిన అనేక మంది యువతులు ఉద్యోగాల్లోకి రావాలనుకున్నా సురక్షితమైన రవాణా లేకపోవడం, పని ప్రదేశాల్లో భద్రతపై ఆందోళనలు, కుటుంబ బాధ్యతలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాల కొరత, వేతన అసమానత వంటి సమస్యలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. కాబట్టి మహిళా యువతకు ఉపాధి కల్పించడం అంటే కేవలం ఉద్యోగ ప్రకటనలు ఇవ్వడం కాదు. సురక్షిత రవాణా, హాస్టళ్లు, సమాన వేతనం, సురక్షిత పని ప్రదేశా లు, ప్రసూతి ప్రయోజనాలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలను కూడా ఉపాధి విధానంలో భాగం చేయాలి.

ఇక కొత్తగా ముందుకొస్తున్న సాంకేతిక మార్పు యువత ఉపాధి ప్రశ్నకు మరో కొత్త కోణాన్ని జోడించింది. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, ఆటోమేషన్ వంటి సాంకేతిక పరిణామాలు కొన్ని కొత్త ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని ప్రథమ శ్రేణి, రిపీటిటివ్ పనుల స్వభావాన్ని మార్చే అవకాశం కూడా ఉంది. అందుకే యువతకు కేవలం ఏఐ నేర్చుకోండి అని చెప్పడం సరిపోదు. గ్రామీణ ప్రాంతాల వరకు డిజిటల్ మౌలిక వసతులు, ఉచిత AI శిక్షణ, కంప్యూటర్ సదుపాయాలు, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అవకాశాలు అందుబాటులోకి రావాలి.

AIYF కోరుకునేది కేవలం కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు కాదు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను తక్షణం భర్తీ చేయాలి. కేంద్రం, రాష్ట్రాలు ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి. నోటిఫికేషన్ నుంచి నియామకం వరకు నిర్ణీత కాలపరిమితి ఉండాలి. ప్రభుత్వ రంగ సంస్థల ను ప్రైవేటీకరించకుండా బలోపేతం చేయా లి. ప్రతి జిల్లాలో స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కొత్త పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి. స్కిల్ డెవలప్‌మెంట్‌ను అప్రెంటిస్‌షిప్, ఉద్యోగంతో అనుసంధానం చేయాలి. గిగ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. గ్రామీణ యువతకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, చిన్న పరిశ్రమలు, సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలి. మహిళా యువతకు సురక్షితమైన, సమాన వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఏఐ , ఆటోమేషన్ వల్ల ఉద్యోగ మార్పులకు గురయ్యే యువతకు ఉచిత రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అందించాలి. ప్రతి జిల్లాలో పోటీ పరీక్షలకు ఉచిత ప్రభుత్వ కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నియామకాల్లో పేపర్ లీకులు, అవకతవకలు లేకుండా పారదర్శక వ్యవస్థను నిర్మించాలి.

ఇది కేవలం డిమాండ్ల జాబితా కాదు. యువత భవిష్యత్తు గురించి ఒక ప్రత్యామ్నాయ దిశ. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగ అవకాశాలను సృష్టించాలి. దేశ సంపదను సృష్టించే కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలి. చదువుకున్న యువతకు తన ప్రతిభను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలి. గ్రామీణ యువత తన ఊరిని వదిలి వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించాలి. మహిళా యువతకు సమాన అవకాశాలు కల్పించాలి. సాంకేతిక అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలి. భారతదేశ యువతకు సామర్థ్యం ఉంది. ప్రతిభ ఉంది. శ్రమ ఉంది. కలలు ఉన్నాయి. అవసరం ఉన్న ది అవకాశం. ఒక యువకుడికి ఉద్యోగం ఇవ్వడం ద్వారా కేవలం ఒక వ్యక్తిని నిలబెట్టడం కాదు; ఒక కుటుంబాన్ని నిలబెట్టడం. ఒక కుటుంబం ఆర్థికంగా బలపడితే ఒక గ్రామం బలపడుతుంది. లక్షల కుటుంబాలు బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే యువతకు ఉద్యోగం కల్పించడం ప్రభుత్వ దయ కాదు; ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వానికి ఉన్న ప్రజా బాధ్యత.

యువతను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకుని, మిగిలిన కాలంలో వారి సమస్యలను పక్కన పెట్టే రాజకీయ సంస్కృతికి ముగింపు పలకాలి. యువతను ఓటు బ్యాంకుగా కాకుండా దేశ నిర్మాణ శక్తిగా గుర్తించాలి. వారి కోపాన్ని మతం, కులం, ప్రాంతం పేరు తో విభజించకుండా, వారి సమస్యలకు పరిష్కారం చూపే ప్రజా ఉద్యమంగా మలచాలి. నిరుద్యోగ యువతలో ఉన్న అసంతృప్తికి ప్రజాస్వామ్య, శాస్త్రీయ, సామాజిక న్యాయ దిశను చూపడం యువజన ఉద్యమాల చారిత్రక బాధ్యత.

యువత హక్కుల కోసం ఐక్యమై ఉద్యమిద్దాం – విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం ఆధారంగా సమానత్వ, ప్రజాస్వామ్య సమాజ నిర్మాణం కోసం పోరాడుదాం.

## ఆదర్శ కార్మిక నేత మనుబోతుల కొమురయ్య

సింగరేణి బొగ్గు గనుల చరిత్ర కేవలం బొగ్గు ఉత్పత్తి, పారిశ్రామిక ప్రగతి చరిత్ర మాత్రమే కాదు. ఆ నల్ల బంగారాన్ని వెలికితీసిన కార్మికుల చెమట, కన్నీరు, త్యాగాలు, పోరాటాల చరిత్ర కూడా. సింగరేణి కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ సంక్షేమం, వారసత్వ ఉద్యోగాలు, పెన్షన్ వంటి అనేక హక్కులు సాధించడంలో పలువురు కార్మిక నాయకులు కీలక పాత్ర పోషించారు. అలాంటి మహానాయకులలో మనుబోతుల కొమురయ్య పేరు సింగరేణి కార్మిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

కార్మికుల సమస్యలను తన సమస్యలుగా భావించి, యాజమాన్యంతో నిరంతరం పోరాడుతూ, కార్మిక కుటుంబాల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన కొమురయ్యను కార్మికులు ప్రేమగా యూనియన్ కొమురయ్య'గా పిలుచుకునేవారు. ఆయన పోరాట జీవితం సింగరేణి కార్మిక ఉద్యమానికి ఒక గొప్ప అధ్యాయం.

ఉమ్మడి ఖమ్మం జిల్లా, నేటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు సింగరేణి బొగ్గు గనుల పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది. ఇదే నేలపై 1928 జూన్ 12న మనుబోతుల కొమురయ్య జన్మించారు. విద్యాభ్యాసం చేస్తున్న చిన్న వయసులోనే వామపక్ష సాహిత్యం, కరపత్రాలు చదవడం ద్వారా సమాజంలోని అసమానతలు, కార్మికుల దుస్థితి గురించి అవగాహన పెంచుకున్నారు.

కార్మికులకు కనీస హక్కులు కూడా లేని పరిస్థితుల్లో వారి తరపున నిలబడాలని నిర్ణయించుకున్నారు.

1940లో కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాప్‌లో టర్నర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఉద్యోగం చేస్తూనే కార్మికుల సమస్యలపై పోరాటాల్లో పాల్గొన్నారు. దేవూరి శేషగిరిరావు, మఖ్దూమ్ మొయినుద్దీన్, రాజ్‌బహదూర్, కె.ఎల్. మహేంద్ర వంటి ఆనాటి కార్మిక నాయకులతో కలిసి ఉద్యమాలను నిర్మించారు.

1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) స్థాపనలో కొమురయ్య కీలక పాత్ర పోషించారు. కార్మిక హక్కుల కోసం పోరాడటంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఈ పోరాటాల కారణంగా 1947 నుంచి 1948 వరకు జైలు జీవితం గడిపారు.

దాదాపు 44 సంవత్సరాల పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కొమురయ్య, కార్మికుల నమ్మకానికి ప్రతీకగా నిలిచారు. ఆయనకు పదవి ఒక అలంకారం కాదు; కార్మికుల గొంతుకగా పనిచేయడానికి ఒక బాధ్యత.



సింగరేణి గనుల్లో కాంట్రాక్టు కార్మికుల దోపిడీని కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. శాశ్వత స్వభావం కలిగిన పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ కార్మికులను అస్థిరతలోకి నెట్టే విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు.

అదేవిధంగా మహిళలు, పిల్లలను భూగర్భ బొగ్గు గనుల్లో పనిచేయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. యాజమాన్యం పై పోరాడి మహిళలు, పిల్లలకు భూగర్భ పనుల బదులు ఉపరితల ప్రాంతాల్లో పని కల్పించేలా చర్యలు సాధించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపైనా నిరంతరం పోరాడి అనేక మందిని పర్మినెంట్ చేయించడంలో కీలక పాత్ర పోషించారు.ఇది కేవలం ఒక కార్మిక సమస్యను పరిష్కరించడం కాదు. కార్మికుడికి పని అంటే కేవలం వేతనం కాదు – గౌరవం, భద్రత, కుటుంబ భవిష్యత్తు కూడా అనే భావనను కొమురయ్య తన ఉద్యమం ద్వారా బలంగా చాటిచెప్పారు.

**వేతన బోర్డుల్లో సింగరేణి కార్మికుల గొంతుక**

మనుబోతుల కొమురయ్య కేవలం సింగరేణి యూనియన్ నాయకుడిగానే పరిమితం కాలేదు. జాతీయ స్థాయిలో బొగ్గు కార్మికుల సమస్యలను వినిపించిన నాయకుడిగా ఎదిగారు.

రేగే కమిటీ, జాదన్ కమిటీ, మజుందార్ కమిటీ, లేబర్ అప్పిలేట్ వంటి వివిధ కార్మిక సంబంధిత కమిటీలలో సభ్యునిగా పనిచేశారు. తరువాత కోల్ వేజ్ కమిటీ, జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జెబిసిసిఐ) వంటి వేదికల్లో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను బలంగా వినిపించారు.

మొదటి వేజ్ బోర్డు నుంచి ఆరవ వేజ్ బోర్డు వరకు సింగరేణి తరపున శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడిగా ఉండి కార్మికులకు ఇంక్రిమెంట్లు, ఎల్‌టీసీ, క్యాడర్ స్కీమ్ వంటి అనేక ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేశారు.

1974 రఘునాథ్‌రెడ్డి అవార్డు సందర్భంలో సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా కార్మికులతో పోలిస్తే అదనపు ప్రయోజనాలు సాధించడంలో ఆయన పోరాటం ముఖ్యమైనదిగా నిలిచింది. కొమురయ్య పోరాటం కేవలం బొగ్గు గనులకే పరిమితం కాలేదు. పేపర్, స్టీల్, సిమెంట్, విద్యుత్ తదితర పారిశ్రామిక రంగాల్లో యూనియన్ల నిర్మాణానికి, కార్మికుల మెరుగైన వేతన ఒప్పందాల సాధనకు కృషి చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడిగా, జాతీయ ఎఐటియుసి కార్యవర్గ సభ్యుడిగా, ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి జాతీయ కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారు.

1996 సెప్టెంబర్ 5న ఆయన తుదిశ్వాస విడిచారు. మరుసటి రోజు నుంచి నిరాహార దీక్షకు కార్మికులను సిద్ధం చేసిన నాయకుడు, అదే ఉద్యమం కోసం తన జీవితాన్ని అర్పించి వెళ్లిపోవడం ఆయన అంకితభావానికి నిదర్శనం.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752



## ఒవైసీ సోదరులకు దేశభక్తి సర్టిఫికెట్లా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసమే ఒవైసి సోదరులను 'దేశభక్తులు' అని ప్రశంసిస్తున్నారని, ఇది యావత్ దేశాన్ని అవమానించడమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తల్లిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఆడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నాయకులతో ఒవైసీలను పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 15 నిమిషాలు పోలీసులను పక్కకు జరిపితే చూపిస్తాం అని బెదిరించినందుకా, లేక బహిరంగంగా గోమాంసం తింటామని మాట్లాడినందుకా రేవంత్ రెడ్డి వారికి దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో 'వందేమాతరం' పాడుతుంటే ఒక్క మజ్లిస్ ఎమ్మెల్యే కూడా నిలబడలేదని, అలాంటి వారిని దేశభక్తులు అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాజ్యసభ ఎంపి డాక్టర్ లక్ష్మణ్ కూడా నాగం వర్షిత్ రెడ్డి తల్లిని పరామర్శించారు.



## రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

### గవర్నర్‌కు బిజెపి మహిళా మోర్చా వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు భద్రత కరువైందని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి ఆరోపించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను శుక్రవారం కలిసి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తుక్కుగూడలో నర్సుగా పని చేస్తున్న గిరిజన యువతిపై పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు మహమ్మద్ సనావుల్లా ఖాన్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరితీయ్యాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ మేయర్, ఆయన అనుచరులు దాడి చేసి, ఆయన తల్లిపై భౌతిక దాడికి దిగినా పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. దాడి వల్ల తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారని తెలిపారు. హోం శాఖను వద్దే ఉంచుకున్న సిఎం రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నేరాలు రెట్టింపు అయ్యాయని, మైనర్‌లపై నేరాల్లో తెలంగాణ దేశంలోనే 2వ స్థానంలో నిలవడం సిగ్గుచేటని విమర్శించారు. రాజీ పేరిట కేసులు నీరుగారుస్తున్నారని, షీ టీమ్స్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా వైద్య సిబ్బందికి, హాస్టళ్లకు కట్టుదిట్టమైన భద్రత కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌ను కోరినట్లు ఆమె తెలిపారు.



## కాంగ్రెస్ భూదోపిడిని బహిర్గతం చేస్తాం : ఈటల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూభారతి, 22ఎ నిషేధిత భూముల వ్యవహారంపై ఈనెల 5న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరుపతలపెట్టిన నిరాహార దీక్ష ఏర్పాట్లను ఎంపి ఈటల రాజేందర్, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాంగ్రెస్ భూదోపిడిని బహిర్గతం చేస్తామని ఈటల, ఏలేటి తెలిపారు.

## స్వదేశీ 'కామికేజ్'కు మరింత బలం

### మ్యూనిషన్స్ ఇండియా- డ్రోగో ఏరోస్పేస్ మధ్య కీలక ఒప్పందం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతకు మరింత ఊతమిచ్చేలా మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్), డ్రోగో ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. యూఏవీలు, లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థల అభివృద్ధి, సమీకరణ కోసం రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి.పుణెలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డ్రోగో ఏరోస్పేస్ సిఇఒ యశ్వంత్ బొంతు, ఎంఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ వైభవ్ గౌర్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం డ్రోగో ఏరోస్పేస్ యూఏవీ రూపకల్పన, తయారీపై, ఎంఐఎల్ వార్‌హెడ్, మ్యూనిషన్ సాంకేతికతపై దృష్టి సారించనున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో విజయవంతంగా పరీక్షించిన **'డెల్టా వింగ్ కామికేజ్' యుఎవి ఈ భాగస్వామ్యానికి కీలకంగా నిలవనుంది. లక్ష్యాన్ని గుర్తించి దానిపై దూసుకెళ్లే లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. సుమారు 1,000 కిలోమీటర్ల మిషన్ పరిధి, 20–30 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లే సామర్థ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ తెలిపింది.మ్యూనిషన్–యుఎవి సమీకరణ, పరీక్షలు, నాణ్యతా ధ్రువీకరణ తదితర అంశాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ భాగస్వామ్యం దేశీయ రక్షణ తయారీ, సాంకేతిక స్వావలంబనకు మరో ముందడుగుగా నిలుస్తుందని ఇరు సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడబోము

### ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు
### మాజీ మంత్రి కొండాసురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బిజెపిలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ 'నేను ఎక్కడికీ వెళ్లడం లేదు' అని మాజీ మంత్రి కొండాసురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. 'త్వరలో బిగ్ అప్‌డేట్', 'నిరీక్షణకు తెరపడనుంది' వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు.

తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటిరోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సిఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సిఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సిఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీచేసింది.

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సిఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు.

### వెయ్యి రోజుల ప్రజా పాలనను చూసి

# కెటిఆర్ డ్రామాలు

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ప్రజా ప్రభుత్వం విజయవంతంగా సాగుతుండటాన్ని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రైతుల పేరుతో కొత్త రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.కెసిఆర్ 3,470 రోజుల పాటు ఫామ్‌హౌస్ నుంచి పాలన సాగిస్తే.. తమ ప్రభుత్వం ప్రజల మధ్య ఉంటూ ప్రజా పాలన అందిస్తోందని అయిలయ్య అన్నారు. తమ వెయ్యి రోజుల పాలనతో ప్రజలు సంతోషంగా ఉంటే కల్వకుంట్ల కుటుంబం మాత్రం అధికారం కోల్పోయిన బాధలో ఉందని ఎద్దేవా చేశారు.

గత యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 13.37 లక్షల మంది రైతులకు రూ.18,929 కోట్లు చెల్లించామని తెలిపారు. రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నల్గొండలో కెటిఆర్ రైతు సమావేశం నిర్వహించడంపై అయిలయ్య తీవ్రంగా స్పందించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సాగర్ ఎడమ కాల్వను ఆధునీకరించారా? డిండి ప్రాజెక్టును పూర్తి చేశారా? ఉదయ సముద్రాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఉదయ సముద్రం పనులను పూర్తి చేశామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షాలు తగ్గాయని, నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ప్రస్తుతం తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నామని అయిలయ్య అన్నారు. దీన్నే రాజకీయంగా ఉపయోగించుకునేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫ్లోరైడ్, మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో బిఆర్ఎస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కెటిఆర్‌ ఎన్ని పాదయాత్రలు చేసినా, మోకాళ్ల యాత్రలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మరని అయిలయ్య వ్యాఖ్యానించారు. నల్గొండలో చిల్లర రాజకీయాలు, జిమ్మిక్కులు పనిచేయవని, ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరిస్తారని అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదని, మంత్రి పదవిని త్యాగం చేసిన చరిత్ర కోమటిరెడ్డిదని పేర్కొన్నారు.

# గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత రవాణా రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో శుక్రవారం తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ ప్రతినిధి షేక్ సలావుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు మంత్రిని కలిసి మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్2025ను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఓలా, ఉబెర్, రాపిడో, పోర్టర్ వంటి అగ్రిగేటర్లపై నియంత్రణకు ప్రభుత్వం నిర్దేశించే కనీస బేస్ ఛార్జీ, కిలోమీటర్, నిమిషం ఛార్జీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాప్ ఆధారిత ప్రయాణికుల, సరుకుల రవాణాలో ఉపయోగించే ప్రైవేట్ వాహనాలపై నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, అవసరమైన చోట వాణిజ్య రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని కోరారు. పెరుగుతున్న ఇంధన, వాహన నిర్వహణ, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హైర్ వెహికల్ ఛార్జీలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై చర్యలు చేపట్టడంపై యూనియన్ ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వారు ప్రస్తావించిన అంశాలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### ఎపిలో కరువు మండలాలు

## వెంటనే ప్రకటించాలి



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఒక్క ఎకరాలో కూడా పంట పండని పరిస్థితి ఉన్నా ఇప్పటివరకు కరువు మండలాలు ప్రకటించలేదని శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈ అంశాలపై ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించము

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి
### ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్70అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తార్నాక, లాలాపేట్ హియరింగ్ కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి. సంతోష్ శుక్రవారం సందర్శించారు. ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. అన్‌మ్యాపింగ్, అనమాలిస్‌కు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, తగిన ఆధారాలు, డాక్యుమెంట్లను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా హియరింగ్స్ నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. హియరింగ్‌కు హాజరైన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను అధికారులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగించబోమని అధికారులు స్పష్టం చేస్తూ ఓటర్లకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ ఏఎస్‌డి (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) ఓటర్ల వివరాల పునఃపరిశీలనలో భాగమని తెలిపారు. అర్హత కలిగిన ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైతే ఈ ప్రక్రియ ద్వారా తమ హక్కులను వినియోగించుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

**ఫారం– 6, 7, 8 ద్వారా దరఖాస్తుకు అవకాశం :** ఓటర్ల వివరాల్లో మార్పులు, కొత్త నమోదు, తొలగింపు లేదా ఇతర సవరణలు అవసరమైతే ఫారం– 6, 7, 8ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్‌లను పోలింగ్ స్టేషన్‌లలోని కేంద్రాలు, హెల్ప్‌లైన్‌లకు, ఇఆర్‌ఓ కార్యాలయంలో సమర్పించవచ్చని చెప్పారు.

**ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేక ప్రచారం :** సికింద్రాబాద్ 70 నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్లలో అవగాహన కల్పించేందుకు రెండు దశల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టనున్నారు. మొదటి దశ సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో దశ సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనుంది. ఓటరు జాబితా పునఃపరిశీలన, ఏఎస్‌డి, అన్‌మ్యాపింగ్, అనమాలీస్, సూచనలు, అభ్యంతరాలు, వివిధ ఫారాల ద్వారా దరఖాస్తు విధానంపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ ఎంఎన్ఆర్ జ్యోతి, ఏఈఆర్‌ఓలు, డిసి సుధీర్ సింగ్, తార్నాక అదనపు ఏఈఆర్‌ఓ నాగమణి, బిఎల్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ విద్యా విధానాన్ని


## కాపాడుకోవాల్సిందే : కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిన తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీలో ఇంటర్ విద్యా జెఎసి ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ జంగ్ సైరన్' సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఇంటర్ బోర్డును ఎస్ఎస్‌సి బోర్డులో విలీనం చేసే ఆలోచనలను, ప్రథమ సంవత్సరం పరీక్షలను రద్దు చేసే ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యా వ్యవస్థలో నాణ్యతను కాపాడటానికి పరీక్షలు ఎంతో అవసరమని, ఇంటర్ విద్యను కాపాడుకునేందుకు జరిగే పోరాటంలో తమ పార్టీ ముందు వరుసలో ఉంటుందని హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యకు రూ.50 వేల కోట్లు, ఉచిత వైద్యానికి రూ.50 వేల కోట్లు కేటాయిస్తుందని వెల్లడించారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విదేశీ విద్యా నమూనాలను పరిశీలించే అధికారులు పక్క రాష్ట్రంలో ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక సంస్థలలో మన విద్యార్థులు రాణించడానికి ఇక్కడి ఇంటర్మీడియట్ విద్యా విధానమే పునాది అని స్పష్టం చేశారు. సరైన అవగాహన లేకుండా ఇచ్చే సలహాలను పాటించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కొండా సురేఖను బిఆర్ఎస్‌లోకి రానివ్వం

### తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అనంతరం రాష్ట్ర రాజకీయాలు తీవ్ర ఉత్కంఠగా మారాయి. ఆమె కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్నారంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి. జగదీష్ రెడ్డి ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టగోష్టిగా మాట్లాడారు. కొండా సురేఖను ఎట్టి పరిస్థితుల్లోనూ బిఆర్ఎస్‌లోకి చేర్చుకోమని, కనీసం తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వమని స్పష్టం చేశారు. గతంలో పార్టీని వీడి వెళ్లిన వారి విషయంలో కఠినంగా ఉంటామని, క్యారెక్టర్ ఆధారంగా ఒకరిద్దరిని తప్ప మిగతా ఎవరినీ మళ్లీ చేర్చుకునే ప్రసక్తి లేదని జగదీశ్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోకి చేరేందుకు సిద్ధంగా వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి అప్లికేషన్ పెట్టుకున్నా బిఆర్ఎస్‌లోకి తీసుకోమని, ఒక వేళ సిఎం రేవంత్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇస్తే అది పూర్తి స్థాయిలో అమ్ముడుపోయినట్టేనని ఆరోపించారు.

**సిఎంనే బర్తరఫ్ చేయాలి..** రేవంత్ రెడ్డి ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో సాధించిందేమీ లేదని, కేవలం ఒక మహిళా మంత్రిని బర్తరఫ్ చేయడమే ఆయన సాధించిన ఘనత అని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత లేవనెత్తిన అవినీతి ఆరోపణలు, కాంట్రాక్టర్‌ల వద్ద వసూళ్ల వ్యవహారాలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అసలు ఈ వ్యవహారంలో బర్తరఫ్ కావాల్సింది కొండా సురేఖ కాదని, సిఎం రేవంత్ రెడ్డినే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా దారి తప్పిందని మండిపడ్డారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి'ని తొలగించి 'భూ భారతి' పేరుతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్‌లు, పైరవీకారుల వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావలసిన వాటాలను కాపాడుకోవడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమే నడుస్తోందని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగిన ఈడి దాడులపై స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించిన ఆయన, అమ్ముడుపోయిన ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై శాసనసభ ఎథిక్స్ కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, పార్టీ నేత నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పర్యాటక ప్రాంతాల్లో పనులు వేగవంతం చేయాలి

### నిర్దేశిత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి : టిజిటిడిసి ఎండి గౌతమి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, హరిత హోటళ్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై నిర్వహించిన ఇంజినీరింగ్ సమీక్ష సమావేశంలో పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. రామప్ప, నిజాంసాగర్, బుద్ధవనం, భువనగిరి కోట, అనంతగిరి హిల్స్ తదితర ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక వసతుల పనుల స్థితిగతులను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యాలు, వసతి, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్, సివిల్ పనులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమోదిత ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, క్షేత్రస్థాయి తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, సంబంధిత శాఖలతో సమన్వయం పెంచుకోవాలని స్పష్టం చేశారు. హరిత హోటళ్లు, టిజిటిడిసికు చెందిన ఇతర ఆస్తుల్లో జరుగుతున్న పనుల పురోగతిని కూడా సమీక్షించారు. పర్యాటక మౌలిక వసతులు సురక్షితంగా, సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా, అందరికీ అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేయాలని సూచించారు. స్థిరమైన పర్యాటక అభివృద్ధితో పాటు స్థానిక సమాజాలకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా ప్రాజెక్టులను అమలు చేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, కాలానుగుణంగా నివేదికలు సమర్పించాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. సమావేశంలో టిజిటిడిసి ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ.5.70 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే హరీష్ బాబు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 5.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో మెరుగైన రహదారి సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 24వ వార్డు బాలాజీనగర్ నుంచి ఖలీద్ కిరాణం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, 11వ వార్డు ఆదర్శనగర్ నుంచి స్విమ్మింగ్ పూల్ వరకు రూ.1 కోటి, 12వ వార్డులో హనుమత్‌రావు ఇంటి నుంచి ఫకీర్ మొహమ్మద్ ఇంటి వరకు రూ.1.50 కోట్లు, 6వ వార్డులో తాహెర్ ఇంటి నుంచి మసాలా మోరీ వరకు రూ.1.70 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టియుఎఫ్ఐడిసి నిధులతో పనులు చేపడుతున్నామని, మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు సమీకరించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, డిఇ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక ఒప్పందాల అమలు మా బాధ్యత

ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ వీరభద్రయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి కార్మికుల కోసం యాజమాన్యంతో తాము సాధించిన ఒప్పందాలను చూసి ఓర్వలేకనే ఇతర సంఘాలు విమర్శలు చేస్తున్నాయని ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కందికట్ల వీరభద్రయ్య మండిపడ్డారు. ఆర్‌కె న్యూటెక్ గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పోరాటంతో పెర్క్స్‌పై పన్ను చెల్లింపు, మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల సాయం, నెలవారీ వైద్య మండలి, పదోన్నతులు, 149 వారసత్వ ఉద్యోగాలు, సొంత ఇంటి పథకంపై సానుకూలత, ఒప్పంద కార్మికులకు ఇఎస్ఐ, ఇతర ప్రయోజనాలు సాధించినట్లు తెలిపారు. ఈ ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా కార్మికులకు దక్కేలా అమలు చేయించడమూ తమ బాధ్యతేనని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా మాట్లాడటం మానుకుని, కార్మికుల కోసం ఏం సాధించారో ఇతర సంఘాలు చెప్పాలని సవాల్ విసిరారు.బద్రి బుచ్చయ్య, అఫ్రోజ్ ఖాన్, ఆకుల లక్ష్మణ్, సందీప్, చంద్రమౌళి, అజయ్, నారాయణ, ఉదయ్ పాల్గొన్నారు.

## కలెక్టర్ కుమార్ దీపక్‌కు విశిష్ట పురస్కారం

విద్యా పరిపాలనలో ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు



**ప్రజాపక్షం / మంచిర్యాల :** విద్యా పరిపాలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ప్రతిష్టాత్మక 'విశిష్ట ప్రతిభా పురస్కారం–2026' కు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచడంలో మంచిర్యాల ముందంజలో నిలిచింది. గతేడాది 43,072 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆ సంఖ్య 45,626కు చేరి అదనంగా 2,554 మంది చేరారు. రెండేళ్ల కాలంలో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు 10.34 శాతం పెరిగాయి.4,346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి సర్కారు బడుల్లో చేరడం విశేషం. కలెక్టర్ నేతృత్వంలో అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ సమష్టి కృషితో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. సెప్టెంబర్ 5న కొడంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ అవార్డును అందుకోనున్నారు.

## అక్రమంగా పశువుల తరలింపు

11 మంది అరెస్టు

**ప్రజాపక్షం/మందమర్రి :** అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠాలపై రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రెండు వేర్వేరు ఘటనల్లో 57 పశువులతో వెళ్తున్న 5 వాహనాలను స్వాధీనం చేసుకుని, 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎసిపి శ్రీనివాస్ రావు నేతృత్వంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కౌటాల నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను తరలిస్తున్నారన్న సమాచారంతో మందమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను అడ్డుకున్నారు. 3 వాహనాల్లో తరలిస్తున్న 13 ఆవులు, 17 దూడలను గుర్తించి 7 గురిని పట్టుకున్నారు. వారి నుంచి 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో రాజ్‌కుమార్, షేక్ అహ్మద్,కుమార్, షేక్ షఫీ, షేక్ షాహీద్, ఒరగంటి రాజ్‌కుమార్,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పవర్‌గూడా అభివృద్ధికి నిధులివ్వండి



**ప్రజాపక్షం/జైనూర్ :** గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మిని పవర్‌గూడా సర్పంచ్ తొడసం రాజేందర్ కోరారు. జైనూర్ మండలం పవర్‌గూడా సమస్యలపై ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. పోచమ్మ దేవాలయ నిర్మాణం, పెరిలా సవరిల సెటర్లకు నిధులు కేటాయించడంతో పాటు గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించి గ్రామ ప్రగతికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తొడసం గంగారాం పటేల్, అనక రాంజీ, కనక భీమ్ రావ్, ఉక్క శ్రీనివాస్, మాడవి కృష్ణ, తొడసం జంగు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపు

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, హామీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని ప్రజలు నిలదీయాలని బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ ఆర్‌కెపి క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన, మహిళా రాష్ట్ర నాయకురాలు తుల ఉమ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు రూ.2,500 సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# అలీసాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదలకు అనుమతి

సుదర్శన్‌రెడ్డి,భూపతిరెడ్డి చొరవతో సాగునీటి విడుదల, అధికారులకు ఆదేశం జిల్లా రైతులు హర్షం వ్యక్తం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీరందించేందుకు నీటిపారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చొరవతో నిజాంసాగర్ నుంచి గుత్ప, అలీసాగర్ లిఫ్టులకు నీటిని విడుదల చేసేందుకు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా, పంటలు కీలకమైన పొట్టదశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్ప, అలీసాగర్ ఎతిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్ లోసాగునీరందించేందుకు నీటి పారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నీటిని విడుదల చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశించటం జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథఖాల పరిధిలోని ఆయకట్టుకు నిజాంసాగర్ నుంచే నీటిని విడుదల చేసి రైతులకు సకాలంలో సాగునీరందించాలని మంత్రిని కోరారు. అలీసాగర్, గుత్ప లిఫ్టులకు ప్రతి 10 రోజులకోకసారి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పంటలకు అత్యంత కీలకమైన దశ కావటంతో తక్షణమే నీటి విడుదల చేయాలని మంత్రిని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈమేరకు అలీసాగర్ పరిధిలోని 48 వేల ఎకరాలకు, గుత్పలోని 35 వేల ఎకరాలకు కలిపి 83 వేల పైచిలుకు ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా నీటిని విడుదల చేయనున్నారు. రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గుత్ప, అలీసాగర్ ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్పందించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భూపతిరెడ్డి జిల్లా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి విడుదలకు అనుమతితో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## జుక్కల్ సమీపంలో.. ఆర్‌టిసి బస్సు ప్రమాదం

- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి
- బస్సు డ్రైవర్ మృతి తీవ్రంగా కలిచివేసింది
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జుక్కల్ ఎక్స్ రోడ్డు దాటి బిచ్కుంద సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ డిపోకు చెందిన బస్సు నెం. టిఎస్34జడ్0030 సర్వీస్ నెం. బిసికె3, హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళుతుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిచ్కుంద రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండి, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఆంజనేయులు బస్సు కింద చిక్కుకుని మృతి చెందటం తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సులో మొత్తం 13 మంది ప్రయాణీకులున్నారని, వారందరూ సురక్షితంగా బయట పడ్డప్పటికీ కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. గాయపడిన ప్రయాణీకులను అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం, మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య సహాయ చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు. అలాగే ఆర్‌ఎం నేతృత్వంలో అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని బాధితులకు అవసరమైన అన్ని విధాలుగా అండగా నిలవాలని మంత్రి ప్రభాకర్ ఆదేశించారు. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై పూర్తి వివరాలను తెలుసుకుని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.

## ఇవిఎం గోదాము వద్ద పటిష్ఠ బందోబస్తు

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని ఇవిఎం గోదామును శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత కల్పించామని, నిరంతరం సిసి కెమెరాల నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ పలు సూచనలు చేశారు. ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చిలుముల విఠల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల విఠల్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి వెల్లడించారు. చిలుముల విఠల్ రెడ్డి 110వ జయంతి వేడుకలు నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విఠల్ రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని, ఆయన నడిచిన బాటలో నడుస్తూ ప్రజలకు సేవ చేస్తామని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, మాజీ ఎంపీపీ నర్సింగ్ రావు, మాజీ సర్పంచ్ రమణారావు, నాయకులు రఘువీరారెడ్డి, రాజా గౌడ్, బాల్ రాజ్, పంబల బాలకృష్ణ, వెంకట నాగేందర్ గౌడ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అదేవిధంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్ విఠల్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

## కాంగ్రెస్ ప్రజా పాలన నిబద్ధతకు 1000 రోజులు పూర్తి



**ప్రజా పక్షం/ఖానాపూర్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలన విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖానాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు.మండల వ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని ర్యాలీ నిర్వహించి,టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుంటూ విజయోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ రైతులు,మహిళలు, యువత, విద్యార్థులు, పేద కుటుంబాల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతుండడం వల్లే ప్రజా పాలనపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని పేర్కొన్నారు.డీసీసీ అధ్యక్షులు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో ఖానాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని,గ్రామ స్థాయి వరకు పార్టీని బలంగా తీర్చిదిద్దేందుకు నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మండల ఉపాధ్యక్షులు దొనికిని సాగర్,నారాయణరెడ్డి, కరిపే రాజు,ప్రధాన కార్యదర్శులు వీరేష్, గుమ్ముల రమేష్, శ్రీనివాస్, గంగ నరసయ్య, జమాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావాలి సంతోష్,నాయకులు జహీర్ భాయ్, షబ్బీర్ భాషా,అమనుల్లా ఖాన్, మదిరే సత్యనారాయణ, ధ్యావతి రాజేశ్వర్,జన్నారపు శంకర్ ,మహిళా నాయకులు సుజాత, రమాదేవి, వసంత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తహశీల్దార్‌పై దాడి కేసులో విచారణ జరపాలి

**ప్రజాపక్షం /జైనూర్ :** విధులు నిర్వహిస్తున్న జైనూర్ తహశీల్దార్ ఆడ బీర్షాపై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జైనూర్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి అశోక్, సిఐ రమేష్, ఎస్ఐ రవికుమార్‌లకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యాలయ సిసి టివి దృశ్యాలను పరిశీలించి నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మహాగం ఆశ్రమ పాఠశాలలో సిఆర్‌టిగా పనిచేస్తున్న ఆత్రం నరేష్ నకిలీ ఎస్‌టి ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నారనే ఆరోపణలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. మేశ్రం శేకు, గేడం గోపీచంద్, సేడ్మాకి భగవంత్ రావ్, మాడావి మధురజ్, ఆత్రం కన్ను, షౌంరావ్, మేశ్రం అంబాజీ రావ్, గేడం మారుతీ, సేడ్మాకి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపైనే పేదల ఆశలు

ముధోల్ గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజోద్దీన్

**ప్రజాపక్షం/ముధోల్ :** కాంగ్రెస్ ప్రభుత్వంపైనే పేదల ఆశలు నెరవేరుతున్నాయని ముధోల్ గ్రామ సర్పంచ్ షబానా బేగం ఇజాజోద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రేషన్ పంపిణీ కోసం శుక్రవారం గ్రామంలోని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. స్మార్ట్ కార్డులతో ప్రభుత్వ సేవలు,సంక్షేమ పథకాల వివరాలను సులభంగా పొందవచ్చన్నారు.గ్రామంలో ఇప్పటివరకు ఈ ఎన్నో కొత్త రేషన్ కార్డులు మంజూరు కావడం జరిగిందన్నారు.నిరంతరం గా రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగ తుందని మీ సేవలో దరఖాస్తులను చేసుకోవాలన్నారు.రేషన్ లబ్ధిదారులు, రేషన్ డీలర్ శంకర్,గ్రామస్తులు,పాల్గొన్నారు.



## దివ్యాంగులు,వృద్ధులు,మహిళల హామీల అమలులో విఫలం

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దివ్యాంగులు ,వృద్ధులు ,మహిళలకు ఇచ్చిన హామీలలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం సంగారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ,వృద్ధులు మహిళలతో కలసి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామి నెరవేర్చలేక పోయిందన్నారు.420 మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు మోసం చేశారన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఎదురు దాడికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎన్నికల సమయంలో వృద్దులకు నెలకు రూ. 4000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు.అని పేర్కొంటు వృద్దులకు ఇచ్చిన హామిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళలకు నెలకు రూ. 2500ల ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు.వృద్దులకు రూ. 4000 పింఛన్ మహిళలకు నెలకు రూ. 2, 500 ఆర్థిక సహాయం వికలాంగులకు రూ. 6,000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హా మీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పో రాటం చేస్తుందని హెచ్చరించారు.మాజీ టీఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షులు,రాజేందర్ రెడ్డి, మాజీ డిసిసిబి వై స్ చైర్మన్ పట్నం మాణిక్యం ,డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి ,మండలాల పార్టీ అధ్యక్షుడు , బిఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలోని మహిళలు పాల్గొన్నారు.

# రైతుల భూములకు 22-ఎ ఉచ్చు

రైతు సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తాం : మాజీ మంత్రి హరీష్‌రావు





**ప్రజాపక్షం/కౌటాల :** భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటం వల్ల సిర్పూర్ నియోజకవర్గంలోని వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు. కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రైతులు, భూ నిర్వాసితుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు నిషేధిత జాబితాలో చేరడంతో క్రయవిక్రయాలు జరగక, బ్యాంకుల నుంచి రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 42,672 ఎకరాలు, ఒక్క కౌటాల మండలంలోనే 6,350 ఎకరాల భూములు 22ఎ జాబితాలో చిక్కుకున్నాయని తెలిపారు. పట్టాలు ఉన్నా హక్కులు వినియోగించుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చి రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సమస్యపై శాసనసభలో ప్రస్తావించి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నడిపెల్లి దివాకర్, ఎర్రోల శ్రీను, స్థానిక సర్పంచ్ నక్క శంకర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రెబ్బెనలో గంజాయి విక్రయం: ఇద్దరు అరెస్టు

బల్లార్షా నుంచి రవాణా.. నిందితులు రిమాండ్‌కు

**ప్రజాపక్షం/రెబ్బెన :** మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయిని తీసుకొచ్చి రెబ్బెన మండలంలో యువతకు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎస్ఐ ఎ.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7 వేల విలువైన 130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో జక్కులపల్లికి చెందిన ధాగం సందీప్, మంచిర్యాలకు చెందిన కొండగొర్ల రాజేందర్ ప్రసాద్‌లు మరో నిందితుడితో కలిసి రైలులో బల్లార్షా వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు తేలింది. మండలంలోని గ్రామాల్లో యువతకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని, మిగిలిన నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ ఎం.సంజయ్ హెచ్చరించారు.



## 6 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రేషన్ లబ్ధిదారుల నుండి సన్న బియ్యం విక్రయించి అక్రమంగా నిల్వచేసిన స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు దాడులు చేసి 6 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని గొల్లపల్లి దౌలపూర్ పరిసర ప్రాంతం నుండి వాహనాల ద్వారా తరలిస్తున్న 560 బస్తాల పిడిఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వట్టిపల్లి గ్రామానికి చెందిన శంకర్ నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే తిగుల్ నర్సాపూర్‌లో 6 టన్నుల పిడిఎస్ బియ్యం లోడుతో ఉన్న డిసిఎం వ్యాను జగదేవ్‌పూర్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం అదుపులోకి తీసుకోని జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారుల అదేశం మేరకు పంచనామా నిర్వహించి అనంతరం నింధితులపై చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

## వంటావార్పుతో బిఆర్ఎస్ నాయకుల నిరసన



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుపై వంటావార్పు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం చేసిన పలువురు బిఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ ఎన్ రమేష్ తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లు పట్టివేత




**ప్రజాపక్షం / కొత్తపల్లి** :కరీంనగర్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో దుర్శేడు వైపు నుంచి కరీంనగర్ వైపు ఇసుక లోడుతో వస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్లలో ఉన్న ఇసుకకు సంబంధించిన అనుమతులు, ర వాణా పత్రాలు చూపించాలని పోలీసులు అడిగారు. డ్రైవర్లు తాము బొమ్మకల్, చేగుర్తి ప్రాంతాలకు చెందిన వారమని చేగుర్తి ప్రాంతంలోని ఇసుక వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో నింపి కరీంనగర్‌లో అధిక ధరకు విక్రయం చేసేందుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. పోలీసులు మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించి డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక ర వాణాకు సంబంధించి కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చ ర్యల నిమిత్తం నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిని సంబంధిత తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

## బేకరీలో భారీ అగ్నిప్రమాదం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పట్టణ పరిధిలోని జగిత్యాల రోడ్డులోని విశ్వ బేకరీ (విశ్వ కేక్ జోన్)లో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బేకరీ లోపలి నుంచి ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో పాటు భారీగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు బేకరీ అంతటా వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు భయాందోళనకు గురై వెంటనే ఫైర్ స్టేషన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. బేకరీ నివాస గృహాలు, వ్యాపార సముదాయాల మధ్య ఉండటంతో మంటలు పక్కనున్న భవనాలకు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో బేకరీలోని ఫర్నీచర్, ఎలక్ట్రికల్ పరికరాలు, కాలి బూడిదయ్యాయి. లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బేకరీ నిర్వాహకులు తెలిపారు. ప్రమాద సమయంలో ప్రాణనష్టం ఏమీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్ గాంధీపై కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ఎఐసిసిఅగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వెలుమ కార్పొరేషన్ చైర్మన్,కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో శుక్రవారం మెట్‌పల్లి పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,సర్పంచులు,వివిధ హోదాల్లో ఉన్న నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కట్టి చుక్కనీరు రాకుండా చేశారు

### కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు



**ప్రజాపక్షం/కరీంనగర్:**బిఆర్ఎస్ నేతలే దేశంలో అతి పెద్ద 420లని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా.. రైతులకు చుక్కనీరు అందించలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాజేందర్రావు పాల్గొన్నారు. ఇందిరా చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్ చౌక్, గాంధీ చౌక్, బాబు జగ్జీవన్‌రామ్ చౌక్ మీదుగా కోర్టు చౌరస్తా, అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వెలిచాల రాజేందర్ రావు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ "పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అయినా ఇచ్చిందా?" అని ప్రశ్నించారు. బిఆర్ఎస్, బిజెపి నేతలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాజేందర్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా మద్యం విక్రయం

### రూ. 9,706 విలువైన సరుకు స్వాధీనం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** లైసెన్స్ లేకుండా అధిక ధరలకు విక్రయించేందుకు నిల్వ ఉంచిన మద్యాన్ని మద్దూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మద్దూరు ఎస్ఐ ఆసిఫ్ ఆధ్వర్యంలో బ్లూకోట్స్ సిబ్బందితో కలసి మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లద్నూరు గ్రామానికి చెందిన బోగి శ్రీనివాస్ టీ షాపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సుమారు 9,706 రూపాయల 13,8835 లీటర్ల మద్యంను పట్టుకున్నట్లు మద్దూరు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా మద్యం లేకుండా మద్యం విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మద్దూరు ఎస్ఐ ఆసిఫ్ వెల్లడించారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మద్దూరు పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిచాలని ప్రజలకు ఎస్ఐ ఆసిఫ్ విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత విషయంలో రాజీ లేదని ఎస్ఐ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విఫలం


### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు,ఎమ్మెల్యే సంజయ్ ధ్వజం



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన విఫలమైందని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అ ధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భ ంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఇందిరాగా ంధీ చౌరస్తా వద్ద ధర్నా,రాస్తారోకోతో పాటు వంటావా ర్పు నిర్వహించారు. అనంతరంబీఆర్ఎస్ పార్టీ జిల్లా అ ధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ. .హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శి ంచారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. వ్యవసాయం, నీటిపారుదల సహా అన్ని రంగాల్లో ప్రజల ను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచనకు గురిచేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.ఇచ్చిన హా మీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నే మూరి సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు రేబ్బాటి రాజేందర్, బద్దం గోపి,నాంపల్లి రమేష్, కంఠం రమేష్, ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షు లునాయకులు,కార్యకర్తలుమహిళలు,బిడికార్మికులు,రైతులు,తదితరులుపాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ టాప్

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ఎండపల్లి :** సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ టాప్ అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.ఎండపెల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన ఇంటిలో అడుగు పెట్టిన కుటుంబ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు గ డుస్తున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల నేతన్న చౌక్ నుండి ర్యాలీ ప్రారంభించి అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల సమర్పించి గాంధీ చౌక్ వరకు విజయోత్సవ ర్యాలీ చేపట్టి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడారు. నరకాసుర పాలన పోయి తె లంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ఏర్పడిందని అన్నారు. వెయ్యి రోజు ల పాలనలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా ఒక్కొక్కటిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేరుస్తూ వస్తుందని అన్నారు. మహిళలకు, రైతులకు, మైనారిటీలకు, నేతన్నలకు, గీత అన్నలకు, సబ్బండ వర్గాలకు కావలసిన పథకాలను తీసుకొచ్చి బృహత్తరమైన పాలన కొనసాగుతుందన్నారు. 9 సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డ్ ఇచ్చిన పాపాన పోలేదు కానీ మేమేమో చేశామని గ్రామాలలో తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలలో రేషన్ కార్డ్ ఇస్తామని చెప్పకుండా ప్రతి పేదవానికి రేషన్ కార్డ్ జారి చేసి ఆరు కిలోల సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటివరకు 142 పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ ర్యాలీలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అ ధ్యక్షులు సూర దేవరాజు, నాయకులు చొప్పదండి ప్రకాష్, కౌన్సిలర్లు వెంగళ లీల లక్ష్మీ నరసయ్య, శ్రీశైలం, బైరి ప్రభాకర్ విజయనిర్మల, కాంగ్రెస్ పార్టీ జిల్లా బాధ్యులు, వివిధ మండలాల అ ధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నా రు.

## అంతర్గాం అభివృద్ధిపై ఎమ్మెల్యే ఫోకస్!



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం ఎంపిడిఒకార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చే పట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పలు శాఖల మండల అధికారులు, గ్రా మాల సర్పంచిలు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దగా పాలనపై బిఆర్ఎస్ సమరభేరి!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో మహిళలను మోసం చేస్తోందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మార్కండేయకాలనీలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో సదస్సు నిర్వహించారు. నెలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో కళ్యాణలక్ష్మి, ఆసరా, కెసిఆర్ కిట్, అమ్మ ఒడి, షీ టీమ్స్, మహిళా స్వయం సహాయక సంఘాలకు మద్దతు, గురుకులాలతో మహిళలకు అండగా నిలిచామని తెలిపారు. మహిళలను లబ్ధిదారులుగా కాకుండా, కుటుంబానికి ఆర్థిక బలంగా, సమాజంలో గౌరవంగా నిలబెట్టే దిశగా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారని హరీష్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు మూల విజయారెడ్డి, తస్లీమా భాను, అనుముల కళావతి, పర్స స్వాతి, బోడకుంట వెంకట లక్ష్మి, శాంతిలక్ష్మి, కృష్ణవేణి, రంగు దుర్గాప్రసాద్, కంకల దేవేందర్, బక్కి కిషన్, యువరాజ్ నేత, సార్ల ఉదయ్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నిజామోద్దీన్‌లు పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలం



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** వెయ్యి రోజుల కాంగ్రెస్ దగా పాలనలో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ విఫల పాలనపై మూడవ రోజు చేపట్టిన కార్యక్రమంలో శుక్రవారం దివ్యాంగులు, మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో మహిళలకు, విద్యార్థినులకు స్కూటీలు, ప్రతి నెల 2500 రూపాయలు, వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ల పెంపు, తులం బంగారం వంటి హామీలు ఏమాయో ? అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న లేకున్న బిఆర్ఎస్ ప్రజలతోనే ఉంటుందని, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు నిరసనలు తెలుపుతూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, మాజీ జెడ్పిటిసి గుగులోత్ కళావతి, స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సామల్ల దేవరాజు, సురేష్ నాయక్, అరుణ్ కుమార్ తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెపుతారు

### మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట గులాబీ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున నిరసన గళం వినిపించారు. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలు పడుతున్న అవస్థలను ఎండగట్టేందుకు, వారికి అండగా నిలిచేందుకు నగర శాఖ ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపి బోయిన్ పల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలతో కలిసి వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గంగుల కమలాకర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమం మహిళలతో ముడిపడి ఉంటుందని, అలాంటి మహిళలనే కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగులతో పాటు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, సుధగోని మాధవి, గాదె రూప, యూసుఫ్, అలీ, జమ్ము, కరీంనగర్ రూరల్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్ లు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ డివిజన్ అధ్యక్షులు.. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వాల్సిందే

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు వదిలేది లేదని, కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా ప్రకటించిన లక్షా నూట పదహార్ల ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇచ్చే వరకు కాంగ్రెస్ నాయకులను కల్యాణ వేదికలపైకి రానివ్వవద్దని రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు మూల విజయారెడ్డి నేతృత్వంలో కార్యక్రమాలు నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యానికి నిరసనగా గోదావరిఖని చౌరస్తాలో భారీ ఎత్తున వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరసనలో కోరుకంటి చందర్ హాజరయ్యారు. రామగుండం నియోజకవర్గంలోని ప్రతి వార్డు, గ్రామంలో జరిగే ఆడపిల్లల పెళ్లిళ్లకు కాంగ్రెస్ నాయకులను పిలవడం తక్షణమే బంద్ చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, పింఛనుదారులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూ ల విజయారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ నిరసన సభలో పాల్గొన్న బిఆర్ఎస్ మహిళా నేతలు, కార్యకర్తలు చేతులెత్తి ఈ తీర్మానానికి పూర్తి మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు,మహిళా ప్రతినిధులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కెసిఆర్

### గజ్వేల్‌లో కెసిఆర్ దిష్టి బొమ్మ ఊరేగించి దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/గజ్వేల్:** కేబినెట్ ర్యాంకు హోదాతో గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్‌కు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.24 కోట్లు ఖర్చు చేయగా, మూడేండ్లలో మూడు సార్లు కూడా ఆయన గజ్వేల్ ప్రజల మధ్యకు రాలేదని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట అంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ దిష్టిబొమ్మను ఊరేగించి అంబేద్కర్ చౌరస్తాలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కెసిఆర్‌ను గజ్వేల్ ప్రజలు గెలిపిస్తే వారిని నట్టేట ముంచినట్లు విమర్శించారు. బంధువుల ఇంటికి, పార్టీ నేతల ఇండ్లకు వెళ్తున్న కెసిఆర్ ప్రజల మధ్యకు మాత్రం రావడం లేదని ఎద్దేవా చేశారు. దీంతో గజ్వేల్ అభివృద్ధి ఎక్కడికక్కడే నిలిచిపోగా, పేదల సమస్యలు తీరడం కష్టంగా మారిందని తెలిపారు. అయితే ఎమ్మెల్యే కోసం నిర్మించిన క్యాంపు కార్యాలయానికి ఇప్పటి వరకు ఆయన అడుగు పెట్టకపోగా, అనామకుల అడ్డాగా మారి మందు పార్టీలు జరుగుతున్న ట్లు ఆరోపించారు. ప్రభుత్వ పథకాల వర్తింపులో ప్రోటోకాల్ పరంగా కష్టంగా మారిందని, దీంతో సరైన సమయంలో లబ్ధిదారులకు పథకాలు అందలేకపోతున్నట్లు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారానికి ఒక సారి గజ్వేల్‌లో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని కెసిఆర్ హామీ ఇవ్వగా, ఆ హామీ అమలుకు నోచుకోకపోవడంతో పాటు ప్ర స్తుతం ఫాంహౌజ్‌కే పరిమితమైనట్లు గుర్తు చేశారు. ఇంటి కష్టాలు, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్న కెసిఆర్ ఇక ప్రజల మధ్యకు రావడం కష్టమేనని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా తాము ఎర్రవల్లి ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి స్వాగతం పలికినప్పటికీ స్పందన కరువైందని, ప్రభుత్వ జీతభత్యాలు పొందుతూ ఎంజాయ్ చేయడం ఆయన వంతైందని చెప్పారు. అవినీతి అక్రమాలతో రూ లక్ష కోట్లు కూడబెట్టిన కెసిఆర్ వాటిని కాపాడుకోవడానికి పరిమితం కాగా, కెసిఆర్ స్పందించని పక్షంలో నియోజకవర్గంలో నిరసన ర్యాలీలు చేపడతామని వివరించారు.

## ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోండి : కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాచలం :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ('సర్' 2026)లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 01.10.2026 అర్హత తేదీగా చేపడుతున్న ఈ సవరణలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిలా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు తమకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలి. పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నా, కొత్తగా పేరు నమోదు చేయాల్సి ఉన్నా, పేరు తొలగింపు లేదా వివరాల్లో మార్పులు అవసరమైనా నిర్ణీత ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా సంబంధిత బిఎల్‌ఒ/ఇఆర్‌ఒలకు క్లెయిమ్స్, అభ్యంతరాలు సమర్పించవచ్చని అధికారులు సూచించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో సంబంధిత బిఎల్‌ఒలు తప్పనిసరిగా పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

## సిపిఐ నుంచి కాంగ్రెస్‌లో చేరిక అవాస్తవం: బండి సాయిరాం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో సిపిఐకి చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమని సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి బండి సాయిరాం శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. మంకెన సత్యం, అమరబోయిన సంగయ్యలను సిపిఐ పార్టీకి చెందిన వారిగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ మండల నాయకత్వాన్ని పక్కదారి పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సదరు వ్యక్తులకు సిపిఐతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను తెలుసుకోకుండా సిపిఐ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ చేరినట్లు ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలన కుంటుపడింది: ఎంపి



**ప్రజాపక్షం/ఇల్లందు:** కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పదేపదే ఢిల్లీ చక్కర్లు కొడుతూ కాలం గడుపుతున్నారని బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర వి టమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందులో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారంటీ టల్లో ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణను సాధించిన బిఆర్‌ఎస్, కెసిఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొంటూ, వచ్చే ఎ న్నికల్లో బిఆర్‌ఎస్ ఘన విజయం సాధించి కేసీఆర్ మళ్లీ సిఎం కావడం ఖా యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, నాయకులు దిండిగల రాజేందర్, రంగనాథ్, శ్రీనివాస్, సత్యనారాయణ, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములకలపల్లిలో అధికారుల అత్యుత్సాహం




బిఆర్‌ఎస్ జెండాలు తొలగించడంపై నేతల నిరసన

**ప్రజాపక్షం/ములకలపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్య పాలనకు నిరసనగా బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సు సందర్భంగా ప్రధాన కూడలి రోడ్డు డివైడర్‌పై ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను అధికారులు తొలగించడంపై బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం నిరసన తెలిపి జెండాలను తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేశారు. అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం విధులు నిర్వహించాలే తప్ప రాజకీయ నాయకుల మెప్పు కోసం కాదని బిఆర్‌ఎస్ నేతలు అన్నారు. అధికార పార్టీ అండతో ఇలాంటి చర్యలకు పాల్పడితే భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని గుర్తుంచుకుని నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## 'స్మార్ట్‌కిడ్జ్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి



**ప్రజాపక్షం/ఖమ్మం :** చిన్నారుల వేషధారణల నడుమ స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల శ్రీకృష్ణ జన్మాష్టమి సంబురాలతో మురిసిపోయింది. శుక్రవారం చిన్నారులంతా రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రజలను రక్షించేందుకు శ్రీకృష్ణు డు గోవర్ధనగిరిని ఎత్తే సన్నివేశం స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగా యి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు

**ప్రజాపక్షం/ఖమ్మం:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీల అమలులో వైఫల్యం చెందిందని దీనిని నిరసిస్తూ బిఆర్‌ఎస్ శుక్రవారం ఖమ్మంలో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో ఖమ్మంలోని పాత ధర్నాచౌక్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను మభ్యపెట్టి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని నెలకు రూ. 2,500 మహిళల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి చేయలేదని బిఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఏ హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా పిల్లల చదువులకు సంబంధించి రీయంబర్స్‌మెంట్, పింఛన్ పెంపు తదితర విషయాల్లో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల ద్వారా ఇస్తామన్న తులం బంగారం ఇవ్వలేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కర్నాటి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, ఖమర్, మగ్బూల్, వలరాజు పాల్గొన్నారు.

# మహిళలను కించపరిస్తే సహించేది లేదు

**బిఆర్‌ఎస్ నేతలకు మంత్రి సీతక్క హెచ్చరిక**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మహిళలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క బిఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. మహిళలు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబులు కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన శాఖ ద్వారా ఇప్పటికే సుమారు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేశామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు, పాఠశాల యూనిఫాం కుట్టే కాంట్రాక్టులు కల్పించడంతో పాటు ప్రతి నియోజకవర్గంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోదాములు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత మూడేళ్లలో మహిళా సంఘాలకు సుమారు రూ. 61 వేల కోట్ల రుణాలు, ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. మహిళలు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ''మహిళ సంతోషంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుంది.. కుటుంబం సంతోషంగా ఉంటే సమాజం సంతోషంగా ఉంటుంది'' అని అన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతుండటాన్ని ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంపై విమర్శలు చేస్తున్న వారు ఉచిత సన్నబియ్యం, ఉచిత విద్యుత్‌ను ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన మహిళా సంఘాలను కాంగ్రెస్ ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. 'అమ్మకు అక్షర మాల' కార్యక్రమం ద్వారా సుమారు ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులను చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి 15 వేల పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేశామని, రిటైర్మెంట్ సమయంలో అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2 లక్షలు, ఆయాకు రూ.లక్ష అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని మాటిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ మంత్రి సీతక్కను ఆదర్శంగా తీసుకుని తాను పొలిటికల్ సైన్స్ చదువుతున్నానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సీతక్క నిరూపించారని కొనియాడారు. గత ఏడాది 61 వేల చీరలు పంపిణీ చేయగా, ఈ ఏడాది సుమారు 74 వేల చీరలను మహిళలకు అందిస్తున్నామని తెలిపారు. వీఓఏల సమావేశాల కోసం రూ.12 కోట్లతో 116 భవనాలు మంజూరు కాగా, 102 భవనాలు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కల్లూరు మండలం చిన్న కోరుకొండిలో ఖమ్మం జిల్లాలో తొలి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని, దీని ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందిరా మహిళ శక్తి చీరలను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి సీతక్క మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రిహానా కమల్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ , భాగం నీరజా చౌదరి, కౌన్సిలర్లు, డిడబ్ల్యూఒ ప్రమీల, ఎసిబి వసుంధర యాదవ్, సిడిపిఒ సత్యవతి, ఎంపిడిఒ నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చల్లగుండ్ల కృష్ణయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సైబర్ నేరాలకు కేంద్రంగా ఖమ్మం?

- నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్న ఖమ్మం పోలీస్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో సైబర్ నేరాలకు ఖమ్మం కేంద్రంగా మారు తుందన్న ఆందోళన వ్యక్త మవుతుంది. సైబర్ నేరగాళ్లు ఖమ్మంను కేంద్రంగా ఎంచుకుని అక్రమాలకు పాల్పడుతుండడంతో ఖమ్మం జిల్లా పోలీస్ యంత్రాంగం సిపి సునీల్ దత్ నేతృత్వంలో అత్యంత జాగ్రతతో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు పలు కేసులను చేధిస్తూ అక్రమాలకు చెక్ పెడుతున్నారు. ఖమ్మం కేంద్రంగా చైనా ఆపరేటర్ల టెలిగ్రాం గ్రూపుల తో కలిసి అనాధికార ఆన్‌లైన్ గేమింగ్ చెల్లింపులు జరుపుతున్న వ్యవస్థీకృత నెట్ వర్క్‌ను ఖమ్మం పోలీసులు చేధించారు. ఇటీవల అరెస్టు చేసిన ఇద్దరితో కలిపి ఇప్పటి వరకు సైబర్ మోసాలకు సంబంధించి 52 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 10 మంది వ్యాపారులు, తొమ్మిది మంది కూలీలు, ఆరుగురు ప్రై వేటు ఉద్యోగులు, ఆరుగురు నిరుద్యోగులు, నలుగురు మాజీ బ్యాంకు ఉద్యోగు లు ఉన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 30 బ్యాంకు శాఖల్లో 123 మ్యూల్ ఖా తాలు, 273 ఏటిఎం విత్‌డ్రా ఖాతాలను గుర్తించి వీటి ద్వా రా రూ. 7.84 కోట్ల లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో రూ.6.23 కోట్లు పూ ర్తి వివాదాస్పద లావాదేవీలు జరిగినట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. 11 పో లీస్ ప్రత్యేక బృందాలు, 40మంది పోలీసులతో ఏక కాలంలో ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో 25 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో సామాన్యులతో పాటు నలుగురు బ్యాంకు మాజీ ఉద్యోగులు కూడా ఉండటం కలవరపరుస్తుంది. సైబర్ నేరాల అదుపుకు ప్ర జల సహకారం పూర్తిగా అవసరమని పోలీసులు తెలియజేశారు. రెండు రోజుల క్రితం బాదిశ మురళీకృష్ణ, వడ్లమూడి సాయినివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరు సైబర్ మోసాలకు 10 మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఇచ్చినట్లు గుర్తించారు. సైబర్ క్రైమ్స్ ఎస్‌పి సాయిశ్రీ , ఖమ్మం సిపి సునీల్ దత్ సమన్వయంతో పనిచేస్తూ సైబర్ నేరాలను అరికట్టేందుకు కృషి చేస్తున్నారు.

## శిరీష హత్య కేసు నిందితుడిపై కఠిన చర్యలు

- మృతురాలి కుటుంబానికి రూ. 5లక్షల సాయం: మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** హైదరాబాద్‌లో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న గిరిజన యువతి ఊకే శిరీష హత్య ఘటనపై నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి ఆమె తల్లి, అన్న, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నిరుపేద గిరిజన కుటుంబానికి అండగా నిలిచేందుకు నర్సుగా ఉద్యోగం పొందిన శిరీష దారుణ హత్యకు గురికావడం సభ్యసమాజం తలదించుకునే ఘటనగా మంత్రి పేర్కొన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున రూ 5లక్షల చెక్కుతో పాటు ఇందిరమ్మ ఇంటి మంజూరు ప్రొసీడింగ్స్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘటనపై అక్కడి సీపీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. శిరీష హత్య జరిగిన వసతి గృహాన్ని తక్షణమే తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని, అవసరమైతే ఆసుపత్రిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్‌ఐఆర్‌లో ఆసుపత్రి, వసతిగృహాల బాధ్యుల పాత్రపై అదనపు దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ఈ ఘటనపై సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఐటిడిఏ పిఒ రాహుల్, హౌసింగ్ పిడి సవయ్ రా మ్, కొత్తగూడెం ఆర్‌డిఒ మధు, తహసీల్దార్ స్వాతి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**రూ. కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇవ్వాలి: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని**



చౌటిగూడెంలో శిరీష కుటుంబాన్ని శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శిరీష పని చేసిన ఆస్పత్రిలో సరైన భద్రతా వసతులు లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని డిజిపితో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐ తరపున శిరీష దశ దిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్, నాయకులు యండి యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, అనుముల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగానే ఉన్నాం

- మరింత సంక్షేమం దిశగా పాలన జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- ఐజెయు మీట్ ద ప్రెస్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో వర్గాలు లేవని భిన్నాభిప్రాయాలు ఉన్న ఐక్యంగా పనిచేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. పాత, కొత్త అనే బేధం లేకుండా అందరిని కలుపుకుపోతూ సమర్థులైన వారికి అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. సిటీ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం టియుడబ్ల్యూజె (ఐజెయు) ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీట్ ద ప్రెస్ నిర్వహించారు. టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ జిల్లాలో ముగ్గురు మంత్రుల మధ్య ఐక్యత లేదని లక్షణరేఖలు గీసుకుని పనిచేస్తున్నారన్న ప్రశ్నకు సత్యనారాయణ స్పందిస్తూ అది ప్రచారం మాత్రమేనని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంత్రులు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నారని ఆయన తెలిపారు. కొండా సురేఖ తొలగింపు బాధకరమేనని ఓబిసి బిడ్డగా ఆమె తొలగింపు పట్ల ఆవేదన ఉన్న ప్రస్తుత పరిస్థితులు తొలగింపుకు కారణమైన అంశాల పట్ల కాంగ్రెస్ అధి నాయకత్వంతో ఏకీభవిస్తున్నానని సత్యనారాయణ తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వాలు మారినా పాలనకు సంబంధించిన అంశాలు కొనసాగుతాయని రాజీవ్ సాగర్ పేరుతో కాంగ్రెస్ గోదావరిపై ఎత్తిపోతలు ప్రారంభించిందని దాని పేరు మార్చి సీతారామ పేరుతో బిఆర్‌ఎస్ కొనసాగించిందని దానిని కాంగ్రెస్ పార్టీ పూర్తి చేస్తుందన్నారు. సీతారామ పట్ల నిర్లక్ష్యం లేదని గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాకు అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి స్పందిస్తూ లోటు బడ్జెట్‌తో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమైందని బిఆర్‌ఎస్ తప్పులను కాంగ్రెస్ సరిచేస్తూ పాలనను గాడిలో పెడుతుందన్నారు. 22ఎ పై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అధికారుల తప్పిదాల కారణంగా సమస్య తలెత్తిందని దానిని వీలైనంత మేర రైతాంగానికి నష్టం జరగని రీతిలో పరిష్కారం ఉంటుందని అన్నారు. సత్వర చెల్లింపులు జరిగేవిధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై ఆయన సమాధానం ఇస్తూ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని ఖమ్మం సొసైటీ స్థలాల పంపిణీకి సంబంధించి త్వరలో మంత్రుల దృష్టికి, పిసిసి అధ్యక్షుని దృష్టికి తీసుకుపోతా మన్నారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి డిసిసి అధ్యక్షునిగా కృషి చేయడంతో పాటు ఇండ్ల స్థలాల సాధనకు జర్నలిస్టులతో కలిసి పనిచేస్తానన్నారు. మీట్ ద ప్రెస్‌కు ముందు నూతి సత్యనారాయణ గౌడ్‌ను టియుడబ్ల్యూజె (ఐజెయు) ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్,రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఐజెయు నాయకులు వనం వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి శ్రీనివాస్, మోహినుద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరురాలు మారుతి వీరమ్మ మృతి

సిపిఐ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామానికి చెందిన సిపిఐ సానుభూతిపరురాలు మారుతి వీరమ్మ (85)శుక్రవారం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్, శాఖ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, గ్రామ సిపిఐ నాయకులు ఎర్రబోయిన వెంకటనరసయ్య, వడ్డెపూడి వెంకటేశ్వర్లు, కర్ణం పెద్ద ఉపేందర్, గోకినపల్లి రామ్మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

## పట్టా భూమి ఆక్రమణ యత్నం

దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

అధికారులను కోరుతున్న బాధితులు

**ప్రజాపక్షం/చర్ల :** గిరిజనేతరులకు చెందిన పట్టా భూమిని అక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడమే కాకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం అధికారులకు విజ్ఞప్తి చేసింది. తమ భూమికి చట్ట బద్ధమైన సంపూర్ణ హక్కులు కలిగి ఉన్నామని అయినా సాగు చేయనివ్వకుండా కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆ కుటుంబం తెలిపింది. చర్ల మండల పరిధిలోని గొమ్ము పులిబోయిన పల్లి గ్రామంలో సర్వే నెం. 48, 49/2, 49/3 సర్వే నెంబర్లలో ముమ్మనేని రామకృష్ణ చౌదరి వారి కుటుంబానికి 23.70 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి కొంత సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కరకట్ట నిర్మాణంలో పోతుండగా సంబంధిత పట్టాదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం కూడా చెల్లించారు. కానీ గొమ్ముపులిబోయిన పల్లిలో నివాసం ఉండే ఒక కుటుంబం గడిచిన 15 ఏళ్లుగా ఈ భూమిని ఆక్రమించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నం చేస్తుందని ముమ్మనేని రామకృష్ణ చౌదరి కుటుంబీకులు తెలిపారు. ఈ ఏడాది జూన్ 27న తమపై భౌతిక దాడికి దిగారని ఇందుకు సంబంధించి చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. అయినా ఏజెన్సీ చట్టాలను అడ్డు పెట్టుకుని అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతున్నారని రామకృష్ణ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. తమను దుక్కిదున్న నివ్వకుండా, పంటలు సాగు చేయనివ్వకుండా నిత్యం బెదిరిస్తున్నారని దీనికి సంబంధించి కుటుంబంపై తగు చర్యలు తీసుకుని తమకు సా టగు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని రామకృష్ణ కుటుంబీకులు కోరుతున్నారు.

## నగరంలో స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తనిఖీలు

న్యూల్ ఖాతాలు సీజ్: ఇద్దరు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, స్థానిక లా అండ్ ఆడర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో వివిధ బ్యాంక్‌లు, ఏటిఎం కేంద్రాలు, అనుమానిత ప్రాంతాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీసు కమిషనర్ సునిల్‌దత్ నేతృత్వంలో పోలీసులు ఏకకాలంలో సోదాలు చేపట్టి పది న్యూల్ అకౌంట్లను గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం జిల్లా సైబర్ నేరాలకు కేంద్రంగా మారకుండా ఉండే లక్ష్యంతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తాంగా మొత్తం 30 బ్యాంక్ ఖాతాల్లో 121 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. అధిక మొత్తంలో ఏటిఎంల ద్వారా నగదు విత్‌డ్రాచేసిన సంబంధిత 273 ఖాతాలతో పాటు ఇరవై వేల రూపాయలకు మించి చెక్ ద్వారా విత్‌డ్రా చేసిన 12 ఖాతాలు, మరో 25 అనుమానిత ప్రాంతాలను గుర్తించారు. ఆయా ఖాతాలు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తాంగా సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వీటి ద్వారా సుమారు 7.84 కోట్ల రూపాయలు లావాదేవీలు జరిపినట్లు తమ తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. వీటిలో 6.23 కోట్ల రూపాయలు వివాదాస్పదమైనవిగా గుర్తించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఈ దాడుల్లో 40 మంది పోలీస్ అధికారులతో కూడిన 11 బృందాలు పాల్గొనగా ఖమ్మం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 4, టూటౌన్ పరిధిలో 7, ఖానాపురం హవేలీ పరిధిలో 7, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, కారేపల్లి, నేలకొండపల్లి, కామేపల్లి స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఇరవై మూడు కేసులు నమోదు చేశారు.

## 'చలో' హైదరాబాద్‌ను జయప్రదం చేయండి : మేరీ ఏసుపాదం




**ప్రజాపక్షం/ఖమ్మం :** పింఛన్ బకాయిలు, ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన ఇతర డిమాండ్ల సాధనకు ఈనెల 10న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి) రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం పిలుపునిచ్చారు. ఎస్‌జిపిఎటి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన స్థానిక కృషి భవన్‌లో జరిగింది. సమావేశంలో మేరీ ఏసుపాదం మాట్లాడుతూ పిఆర్‌సిని సత్వరం ప్రకటించాలని, డిఏ మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. హెల్త్ స్కీంకు సంబంధించి గడిచిన నాలుగు నెలలుగా వేతనాలు, పింఛన్లలో కోత విధిస్తున్న ఇంత వరకు హెల్త్ కార్డు ద్వారా ఏ ఉద్యోగికి కానీ పెన్షన్‌దారులకు కానీ వైద్య సాయం అందలేదన్నారు. హెల్త్‌కార్డులు ఇచ్చే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగే ఆందోళనలో ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పెన్షన్‌దారులు పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, పెద్దమాళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, బోజడ్ల కృష్ణకుమారి, బెల్లం రాధాకృష్ణ మూర్తి, సుధాకర్‌రావు, ఎండి హుస్సేన్, ప్రసాదరావు పాల్గొన్నారు.


## 'సర్' ప్రక్రియ అన్యాయం
# 13 కోట్ల పేర్లు తొలగించడమేమిటి?

### మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాస



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది లక్షలాది మంది ప్రజలపై రుద్దబడుతున్న ఒక అన్యాయమైన ప్రక్రియ అని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాస అభివర్ణించారు. న్యాయ వ్యవస్థ ఈ ప్రక్రియను ఆమోదించిందని, ప్రభుత్వం దీనిని చట్టబద్ధమైనదిగా పేర్కొందని, అయితే ఇది న్యాయమైనదేనా అన్నదే ప్రశ్న అని ఆయన అన్నారు. 'నిస్సందేహంగా ఇది చట్టబద్ధమైనదే. కానీ ఇది న్యాయమైనదేనా అన్నదే ప్రశ్న. ఎందుకంటే న్యాయం అంటే అదే' అని గురువారం ఇక్కడ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నిర్వహించిన జగదీప్ సింగ్ చోకర్ స్మారక ఉపన్యాసంలో లవాస అన్నారు. చట్టబద్ధమైన సంస్థలు, రాజ్యాంగ సంస్థలు, ప్రభుత్వాలు తాము చేసేది ఏదైనా చట్టబద్ధంగా అనుమతించబడినందున అది సరైనదే అనే సూత్రంపై పని చేస్తున్నట్లుగా కనిపిస్తోందని లవాస అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను లక్షలాది మంది పౌరులపై బలవంతంగా రుద్దిన అన్యాయమైన విధానంగా ఆయన అభివర్ణించారు. అలాగే 'బలమే హక్కు' అనేది కాలం చెల్లిన భావన అని అన్నారు. చట్టబద్ధమైన బాధ్యతలను అప్పగించిన సంస్థలు దాని స్ఫూర్తిని కూడా నిలబెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయం అంటే కేవలం చట్టంలోని అక్షరాలను అమలు చేయడమే కాదని, దాని స్ఫూర్తిని కూడా కాపాడటమేనని తెలిపారు. ఎస్ఐఆర్ కింద జరుగుతున్నదంతా చట్టబద్ధమేనని అధికారులు వాదించవచ్చని, కానీ అది 'కచ్చితంగా అన్యాయమైనది' అని లవాస అన్నారు. ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించడం వెనుక ఉన్న హేతుబద్ధతను ఆయన ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియకు దూరం కాకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారా అని నిలదీశారు. ఈ సవరణ ప్రక్రియపై పెరుగుతున్న ఆందోళనను ప్రస్తావిస్తూ, ఇప్పటికే 33 శాతం మంది ఓటు వేయడం లేదని, ఇటువంటి భారీ స్థాయి మార్పులు పౌరులకు ప్రజాస్వామ్య ప్రక్రియపై మరింత విముఖత కలిగించే అవకాశం ఉందని లవాస పేర్కొన్నారు.

# అస్తిత్వం కోసం గిరిజన విద్యార్థుల పోరాటం: రాహుల్ గాంధీ



**ముంబై:** మహారాష్ట్రలోని గిరిజన విద్యార్థులు కేవలం విద్య, ఉపాధి, ప్రాథమిక సౌకర్యాల కోసమే కాకుండా తమ గుర్తింపు, అస్తిత్వం కోసం కూడా పోరాడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. హక్కుల పోరాటంలో కాంగ్రెస్ వారికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. 'ఆర్ఎస్ఎస్ బీజేపీ ఆదివాసీలను వనవాసులుగా మార్చాలని చూస్తున్నాయి. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన ఈ గిరిజన విద్యార్థుల పోరాటం కేవలం విద్య, ఉపాధి, హాస్టళ్లు, ఆహారం కోసం మాత్రమే కాదు, అది వారి అస్తిత్వం, ఆదివాసీ గుర్తింపు కోసం కూడా' అని రాహుల్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'మహారాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దద్దరిల్లా నిలబడి, తమ హక్కుల కోసం గళం విప్పి, విజయం సాధించిన ఈ ధైర్యవంతులైన విద్యార్థులను కలవడం ఆనందంగా ఉంది. విద్యార్థుల హక్కుల కోసం చేసే ప్రతి పోరాటంలో మేము, కాంగ్రెస్, నేను వారికి అండగా ఉంటామని వారికి వాగ్దానం చేశాం' అని తెలిపారు. ఒక రోజు ముందు, మహారాష్ట్రలోని నాసిక్‌లో తమ డిమాండ్ల కోసం నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులతో సహా గిరిజన విద్యార్థుల ప్రతినిధి బృందాన్ని గాంధీ కలిశారు. ప్రభుత్వ గిరిజన హాస్టల్ నిబంధనలలో మార్పులకు వ్యతిరేకంగా పూణే, నాగ్‌పూర్, నాసిక్‌కు చెందిన విద్యార్థులు ఆగస్టు 13న ఆందోళన ప్రారంభించారు. వారి డిమాండ్లు ఆ తర్వాత హాస్టల్ సౌకర్యాలు, భద్రత, గిరిజన రిజర్వేషన్లు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, పంచాయతీల (షెడ్యూల్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం (పెసా) కింద నియామకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, గడ్చిరోలిలోని ఒక ఆశ్రమ పాఠశాలలో పాముకాటుతో మరణించిన ముగ్గురు గిరిజన బాలికల కుటుంబాలకు పరిహారం వంటి అంశాలను చేర్చడానికి విస్తరించాయి. గిరిజన హాస్టళ్లలో ఉంటూ, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ. 10 లక్షల బీమా కవరేజీని కూడా నిరసనకారులు కోరారు. 12,500 గిరిజన పోస్టులతో పాటు ఇతర ఖాళీగా ఉన్న గిరిజన స్థానాల కోసం పెండింగ్‌లో ఉన్న నియామక ప్రక్రియను తక్షణమే అమలు చేయడం వారి ప్రధాన డిమాండ్లలో ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా విధుల నుంచి తొలగించబడిన పెసా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, శాశ్వత నియామకం కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు. పూణేలోని మంజరి గిరిజన హాస్టల్‌లో గిరిజన విద్యార్థులు చేపట్టిన 17 రోజుల నిరవధిక నిరాహార దీక్ష, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి అశోక్ ఉయికే నిరసనకారులను కలిసి వారి డిమాండ్లపై లిఖితపూర్వక హామీలు ఇవ్వడంతో ఆగస్టు 30న ముగిసింది.


# సైబర్ ముఠాలపై సిబిఐ ఉక్కుపాదం

### 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ నేరాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ చక్ర' లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సీబీఐ ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టింది. బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్మును స్వీకరించడం, దారి మళ్లించడం, వంచనకు చేయడంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు నిందితులను సీబీఐ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు, ప్రభుత్వ అధికారులమని చెప్పి నకిలీ గుర్తింపు కార్డులు చూపి ప్రజలను డిజిటల్ అరెస్టులు చేస్తూ ఈ సైబర్ ముఠాలు అనేక అరాచకాలకు పాల్పడుతున్నాయి. బాధితుల్ని భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి రూ.కోట్లల్లో కొల్లగొడుతున్నాయి. ఈ ముఠాలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ తాజా తనిఖీలు చేపట్టింది. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి సీబీఐ స్వీకరించిన పదు కీలక డిజిటల్ అరెస్ట్ కేసుల్లో బాధితులను నెలల తరబడి డిజిటల్‌గా బంధించి, మొత్తం రూ. 42.36 కోట్లు దండుకున్నారు. బిట్స్ పిలానీలో బాధితుడిని పదు నెలల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి, రూ. 7.67 కోట్లు కాజేశారు. గుజరాత్‌లో పోలీసుల పేరిట నమ్మించి, ఒక వ్యక్తిని పదు నెలలు డిజిటల్‌గా బంధించి ఏకంగా రూ. 19.24 కోట్లు వసూలు చేశారు. కర్నాటకలో బాధితుడిని నెల రోజుల పాటు భయాందోళనకు గురిచేసి రూ. 15.45 కోట్లు దోచుకున్నారు. ఫైనాన్షియల్, సాంకేతిక సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల డేటాను విశ్లేషించిన తర్వాత సీబీఐ 89 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో బ్యాంకు రికార్డులు, డిజిటల్ డివైజ్‌లు, కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుంది. ఈ నగదు ఎక్కడెక్కడికి మళ్లిందో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ వ్యవహారాలకు సంబంధించి హ్యాండ్లింగ్, మనీ లాండరింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. హర్యానాకు చెందిన ఆకాష్ ఖాతాలోకి రూ. 1.95 కోట్లు రాగా, అదే రోజు ఆ డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించాడు. కోల్‌కతాకు చెందిన రాజా కర్మాకర్ కంపెనీ ఖాతాలోకి రూ. 1.5 కోట్ల మోసం సొమ్ము జమైంది. జ్యోతి రాణి ... తన ఖాతాలోకి వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని నగదు రూపంలో విత్‌డ్రా చేసి, మిగిలిన మొత్తాన్ని ఇతర ఖాతాలకు పంపిణీ చేసింది.

# 2027 ఫిబ్రవరి వరకూ ఎల్‌నినో

- వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం
- భారత్‌కు పొంచి ఉన్న ముప్పు: డబ్ల్యుఎంఒ హెచ్చరిక




**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్న వాతావరణ మార్పులు రానున్న రోజుల్లో మరింత దారుణంగా మారబోతున్నాయా? మన దేశంలో వర్షాలు తగ్గి, ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో పెరగబోతోందా? అవుననే అంటోంది ప్రపంచ వాతావరణ సంస్థ. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యుఎంఒ హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడవచ్చునని పేర్కొంది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. ఈ దీర్ఘకాలిక ఎల్ నినో ప్రభావం భారత్ వాతావరణంపై, ముఖ్యంగా వర్షపాతం, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీయనుంది. గురువారం డబ్ల్యుఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్టే సాలో ఎల్‌నినో పై కీలక విషయాలు వెల్లడించారు. 'స్పానిష్ భాషలో 'ఎల్ నినో' అంటే చిన్నపిల్లవాడు అని అర్థం. కానీ ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు, మానవ సమాజాలకు మిగిల్చేది మాత్రం కోలుకోలేని దెబ్బ. పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే ఈ ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కరువులు, వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమవుతోంది. ఎల్ నినో తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత పెరుగుతాయని మేము అంచనా వేస్తున్నాం' అని ఆమె హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) సెప్టెంబర్ నెల అంచనాలో, ఎల్ నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని పేర్కొన్న కొద్ది రోజులకే డబ్ల్యుఎంఒ ఈ అంచనాలను వెలువరించడం గమనార్హం. సాధారణంగా ఎల్ నినో ఏర్పడిన సంవత్సరాల్లో భారతదేశంలో రుతుపవనాలు బలహీనపడటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అంతేకాకుండా 1901 నుంచి ఇప్పటివరకు నమోదు కానంత అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ ఆగస్టులోనే నమోదయ్యాయి.ఇక సెప్టెంబర్ నెలలో కూడా సుదీర్ఘకాల సగటు వర్షపాతంలో 91 శాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. ఇది రైతాంగానికి, ముఖ్యంగా వర్షాధార పంటలకు తీవ్ర ఆందోళన కలిగించే అంశం. కేవలం వర్షాకాలం మాత్రమే కాదు చలికాలంపై కూడా ఎల్ నినో నీడలు అలుముకున్నాయి. ఇప్పటికే దేశంలో శీతాకాలపు రోజులు తగ్గిపోతున్నాయని ఢిల్లీకి చెందిన 'క్లైమేట్ ట్రెండ్స్' సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. ఉత్తర భారతదేశంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో ప్రతి దశాబ్దానికి ఉష్ణోగ్రత 0.69 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతోందని అంచనా. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా వరుసగా 0.58 డిగ్రీలు, 0.66 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరుగుతోంది.

### ఆహార భద్రతకు ముప్పు

ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల మన ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపుతోంది. శీతాకాలంలో పండించే ముఖ్యమైన రబీ పంట అయిన గోధుమలపై ఇది ప్రభావం చూపి పంట దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం ముగిసే సమయంలో వచ్చే ఈ వేడిగాలులు రైతులకు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయి. ఎల్ నినో సుదీర్ఘకాలం కొనసాగే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నందున, ఇటు ప్రభుత్వం అటు రైతాంగం ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి నిల్వల నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉష్ణోగ్రత తట్టుకునే విత్తనాల వినియోగంపై దృష్టి సారించాల్సి ఉంది.

# సిక్కింలో 40 ప్రమాదకర గ్లేసియల్ లేక్స్..

### అత్యధిక రిస్క్‌లో 16 సరస్సులు

**గ్యాంగ్‌టక్:** తూర్పు హిమాలయ రాష్ట్రమైన సిక్కింలో సుమారు 40 మంచు సరస్సులు ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు తెలిసింది. వీటిల్లో 16 మంచు సరస్సులు అత్యధిక రిస్క్‌లో ఉన్నట్లు ఓ డేటా ద్వారా తెలిసింది. ఆ సరస్సులు ఏ క్షణమైనా పేలే అవకాశాలు ఉండగా, దిగువ ప్రాంతాలకు సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు 26వ తేదీన నేపాల్‌లో మంచు కొండ విరిగిపడడంతో.. భారీ జలవిలయం సంభవించిన విషయం తెలిసిందే. నేపాల్ వరదల్లో 1250 మందికిపైగా మృతిచెందగా, మరో 4 వేలకు పైగా గల్లంతయ్యారు. హిమాలయ ప్రాంతాల్లో కొత్త సరస్సులు ఏర్పడుతున్నాయని, ప్రస్తుతం ఉన్న వాటి వైశ్యాలం పెరుగుతోందని ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. మంచుకొండలు కరిగిపోవడం వల్ల గ్లేసియల్ సరస్సులు ఏర్పడుతాయని, ఆ సరస్సులో ఉన్న నీరంతా సమీపంలో గుమ్మికూడుతుందని, అయితే ఇలాంటి సరస్సులు ఒక్కసారి పేలినప్పుడు.. భూకంపం లాంటి పరిస్థితి ఏర్పడుతుందని, దీని వల్ల ఆకస్మిక వరదలు సంభవించే అకాశాలు ఉన్నాయని రిపోర్టులోచెప్పారు. 2023 అక్టోబర్‌లో సిక్కింలో సంభవించిన గ్లేసియల్ బస్ట్ వల్ల.. సుమారు 60 మంది మృతిచెందారు. మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యాంగ్, నామ్‌చి జిల్లాల్లో విస్తృత స్థాయిలో నష్టం జరిగింది. గ్లేసియల్ లేక్స్‌లో జరుగుతున్న మార్పులను రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా పరిశీలిస్తున్నట్లు ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ తంబే తెలిపారు. 40 ప్రమాదకర సరస్సుల్లో 16 సరస్సులు కేటగిరీ ఏ(హై రిస్క్) లో ఉన్నాయి. కేటగిరీ బీలో 2, కేటగిరీ సీలో 9, మిగితా 13 సరస్సులో మరో కేటగిరీలో ఉన్నాయి.

# లండన్ పర్యటనకు సిఎం విజయ్

**చెన్నై:** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం విజయ్ తొలిసారిగా విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు బ్రిటన్‌లో జరిగే పారిశ్రామికవేత్తల సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ అధికారిక పర్యటనలో ఆయన తన భార్య సంగీత, కుమార్తె దివ్యలను కలవనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, నటి త్రిష కూడా అదే సమయంలో రప్‌లో షూటింగ్ నిమిత్తం ఉండటంతో వారిద్దరి కలయికపై కూడా చర్చ జరుగుతోంది.

# అఖిలేశ్‌తో సిజెపి నేత రాంకా మంతనాలు

**లక్నో:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అధికారం కోసం రాజకీయ పార్టీలు వ్యూహ రచనలో మునిగిపోయాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కాక్రోక్ జనతా పార్టీ(సీజేపీ) జాతీయ సహ కన్వీనర్ ఆశుతోశ్ రాంకా లక్నోలో రహస్యంగా సమావేశం కావడం చర్చనీయాంశమైంది. ఇద్దరు 90 నిమిషాలు మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం రాజకీయంగా ఆసక్తిగా మారింది. తాము ప్రెజర్ గ్రూపుగా ఉంటామని, రాజకీయాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన సీజేపీ... ఇప్పుడు అఖిలేశ్‌తో భేటీ కావడం, అది కూడా పీ ఎన్నికల ముందు జరగడం కీలకంగా మారింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్పీ ప్రధాన కార్యాలయం సమీపంలోని జనేశ్వర్ మిశ్రా ట్రస్ట్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఈ భేటీపై అటు ఎస్పీ, ఇటు సీజేపీ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల సీజేపీ ప్రభుత్వ పాఠశాలల్ని బాగు చేయాలని 'ఫిక్స్ ది స్కూల్' కార్యక్రమం చేపట్టింది. అయితే, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించవద్దని పీ, రాజస్థాన్ ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నిజానికి సీజేపీ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే స్కూళ్లలోని సమస్యల్ని ఎత్తిచూపుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఇప్పుడు రాజస్థాన్, మహారాష్ట్ర తర్వాత పీని సీజేపీ లక్ష్యంగా చేసుకుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పేపర్ లీక్, విద్యా వ్యవస్థ సమస్యల్ని లేవనెత్తాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజస్థాన్‌లో ఒక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల తనిఖీకి వెళ్లిన అశుతోశ్ రాంకా బందంపై గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడికి పాల్పడింది బీజేపీ గుండాలే అని సీజేపీ ఆరోపించింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ పాఠశాలల్లో పర్యటించేందుకు సీజేపీ సిద్ధమవుతుందా? దీనికి అఖిలేశ్ యాదవ్ నుంచి మద్దతు కోరిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీలో వచ్చే ఏడాది మొదట్లో ఎన్నికలు జరగబోతున్న సమయంలో ఆ రాష్ట్రంలో పెద్ద ఉద్యమానికి సీజేపీ సిద్ధమై, రాజకీయ రంగు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందా అనే అనుమానాలు వెలువడుతున్నాయి. గతంలో నీట్ పేపర్ లీక్‌పై జంతర్ మంతర్ నిరసనల సమయంలో అశుతోశ్ రాంకా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, సీఎం యోగిని సవాల్ చేస్తూ హెచ్చరించారు. రాష్ట్రంలో పేపర్ లీక్ ఆగకపోతే జంతర్ మంతర్ కన్నా పెద్ద ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

# లైసెన్స్‌కు కొత్త విధానం: గడ్కరీ

**న్యూఢిల్లీ:** డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు గ్రేడెడ్ పాయింట్ల విధానం తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ 66వ వార్షిక సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ రికార్డులో ప్రతికూల పాయింట్లు నమోదవుతాయి. కేవలం శిక్షలకు పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వాహనం నడిపే వారికి ప్రోత్సాహకాలు అందించేలా ఉండొచ్చని గడ్కరీ తెలిపారు. మంచి డ్రైవింగ్ రికార్డు ఉన్నవారికి బీమా సంస్థల నుంచి ప్రోత్సాహకాలు లేదా ఇతర ప్రయోజనాలు లభించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. డ్రైవర్ ప్రవర్తన దేశంలో రోడ్డు భద్రతకు ప్రధాన సవాలుగా ఉందని గడ్కరీ పేర్కొన్నారు. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 5,13,563 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో సుమారు 1.83 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 59 ప్రమాదాలు, 21 మరణాలు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. భారత్ ఎన్‌క్యాప్ 2.0ను 2027 అక్టోబర్ నుంచి అమలు చేయాలని యోచిస్తున్నట్లు గడ్కరీ వెల్లడించారు.

**బైక్ ట్యాక్సీలకు మద్దతు :** ప్రైవేట్ ద్విచక్ర వాహనాలను బైక్ ట్యాక్సీలుగా నడిపేందుకు రాష్ట్రాలు అనుమతించాలని గడ్కరీ కోరారు. రవాణా రంగం రాష్ట్రాల పరిధిలో ఉండటంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సేవలకు అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దాదాపు 8 కోట్ల మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించే సామర్థ్యం ఈ రంగానికి ఉందని అన్నారు. హైవేలు, మైనింగ్ వంటి అధిక ప్రమాద రంగాల్లో పనిచేసే డ్రైవర్లు, కార్మికుల కోసం 'సురక్ష' పైలట్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

# సోనియా ఆత్మకథ ప్రచురణకర్త హార్పర్ కాలిన్స్

### నవంబర్ 10న విడుదల

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు ప్రచురణకర్త ఖరారయ్యారు. దీన్ని హార్పర్ కాలిన్స్ ఇండియా ప్రచురించనుంది. 544 పేజీల ఈ ఆత్మకథ నవంబర్ 10న విడుదల కానుంది. వ్యక్తిగత జీవితం, కుటుంబం, రాజకీయాలు, గుర్తింపు, బాధ్యత, భారత్‌తో అనుబంధం తదితర అంశాలను సోనియా గాంధీ ఈ పుస్తకంలో వివరించినట్లు హార్పర్ కాలిన్స్ వెల్లడించింది. ఇటలీలోని బాల్యం నుంచి భారత్‌కు తన ప్రయాణం, 1965లో కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, గాంధీ కుటుంబంలో విషాదాలు, రాజకీయాల్లోకి రావాలన్న ఒత్తిడిని తొలుత ప్రతిఘటించిన సందర్భాలనూ పొందుపర్చారు. ఈ పుస్తకాన్ని తొలుత పెంగ్విన్ ఇండియా ప్రచురించాల్సి ఉండగా కొన్ని అంశాల్లో మార్పుల విషయమై విభేదాలు తలెత్తాయి. ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్, చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిన అంశాలలో మార్పులకు సోనియా గాంధీ అంగీకరించలేదు. దీంతో ఈ పుస్తకానికి తాము ప్రచురణకర్త కాదంటూ ఆగస్టు 18న పెంగ్విన్ ఇండియా ప్రకటించింది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పుస్తకాన్ని యథాతథంగా ప్రచురిస్తూ, భారత్‌లో మాత్రం మార్పులతో విడుదల చేయడం వల్ల రెండు వేర్వేరు సంచికలు ఏర్పడే పరిస్థితిని సోనియా గాంధీ అంగీకరించలేదని సమాచారం. 'బిలాంగింగ్'లో సోనియా గాంధీ వ్యక్తిగత అనుభవాలతో పాటు స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్ర, రాజకీయ పరిణామాలు, గత ఆరు దశాబ్దాల్లో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక మార్పులను తన దక్కోణంలో ఆవిష్కరించినట్లు హార్పర్ కాలిన్స్ ప్రకటన వెల్లడించింది. వ్యక్తిగత కథనాన్ని, రాజకీయ చరిత్రను మేళవించిన ఆత్మకథగా ఈ పుస్తకాన్ని అభివర్ణించింది.

# భూస్థిరకక్షలోకి భారత్ తొలి ఇమేజింగ్ ఉపగ్రహం..

- 'ఇస్రో' బృందానికి కాంగ్రెస్ ప్రశంసలు
- మోదీ ప్రభుత్వం దాని స్వరూపాన్ని 'పూర్తిగా మార్చే కుట్ర' చేస్తోందని ధ్వజం



**న్యూఢిల్లీ :** దేశపు మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని భూకక్షలోకి విజయవంతంగా ప్రయోగించినందుకు శుక్రవారం కాంగ్రెస్ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రశంసించింది. అలాగే, భారత అంతరిక్ష సంస్థ స్వరూపాన్నే మార్చే 'రాడికల్ రోల్ రీకాన్ఫిగరేషన్' చేపడుతోందని మోదీ ప్రభుత్వంపై ఆరోపణాస్త్రాలు సంధించింది. వివిధ వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న అంతరిక్ష సంస్థకు ఈ ప్రయోగం నిస్సందేహంగా గొప్ప నైతిక బలాన్ని చేకూరుస్తుందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శుక్రవారం మరోసారి చరిత్ర సృష్టించింది. జిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా 2,300 కిలోలకు పైగా బరువున్న పేలోడ్‌ను నిర్దేశిత కక్షలోకి ప్రవేశపెట్టడం ద్వారా దేశపు మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని జియో ఆర్బిట్ (భూస్థిర కక్ష)లోకి విజయవంతంగా ప్రయోగించింది.ఈ ప్రయోగం అంతరిక్ష సంస్థకు 2026 సంవత్సరంలో తొలి విజయాన్ని అందించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో జిఎస్ఎల్‌వి–ఎఫ్ 17 ఇఓఎస్–5 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఇస్రో బృందం మొత్తానికి అభినందనలు తెలిపారు.'జియో సింక్రోనస్' కక్ష నుంచి పనిచేసే మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహం అయిన ఇది మనం ఏళ్లుగా అభివృద్ధి చేస్తున్న భూ పరిశీలనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. భారత అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తున్న మన శాస్త్రవేత్తలు, అంతరిక్ష ఇంజినీర్లు, పరిశోధకుల అంకితభావం, నైపుణ్యం పట్ల మేం ఎంతో గర్వపడుతున్నాం' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ శాస్త్రీయ దృక్పథం, అంతరిక్ష పరిశోధనల పట్ల దృఢమైన నిబద్ధతతో ఉంటూ వచ్చిందని ఖర్గే గుర్తుచేశారు.ఆధునిక భారతదేశ నిర్మాతలు దూరదృష్టితో మన అంతరిక్ష కార్యక్రమానికి పునాదులు వేశారని. ఆ వారసత్వాన్ని మన శాస్త్రవేత్తల తరాలు అద్భుతమైన విజయాలతో మరింత ముందుకు తీసుకెళ్లాయని మల్లికార్జున్ ఖర్గే అభినందించారు. కొంతకాలం నిశ్శబ్దంగా ఉన్న తర్వాత, 2,367 కిలోల బరువున్న అత్యాధునిక భూ చిత్రీకరణ ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో ఈ రోజు ఉదయం శ్రీ హరికోట నుంచి తన జిఎస్ఎల్‌వి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేష్ పేర్కొన్నారు.

# ఇస్రో ప్రయోగం సక్సెస్‌పై ఎంఇఎ హర్షం


**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నిర్వహించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ భారతదేశపు తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన ఈఓఎస్05ను నిర్దేశిత కక్ష్యలోకి అత్యంత కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. ఈ చరిత్రాత్మక విజయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి గర్వకారణమని అభివర్ణించారు. 'ఇస్రో జీఎస్ఎల్‌వీఎఫ్17 ద్వారా ఈఓఎస్05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం భారత్‌కు ఎంతో గర్వకారణమైన క్షణం. ఇది మన దేశ అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను, ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని స్పష్టం చేస్తోంది' అని రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పేర్కొన్నారు.

# బిజెపి చేతిలో కీలు బొమ్మలా ఉండొద్దు

### ఢిల్లీ పోలీసులపై కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో విద్యార్థి కార్యకర్త నిషు ఆజాద్ తండ్రిపై జరిగిన దాడికి సంబంధించి, 'హిందుత్వ ఇన్‌ఫ్లుయెన్సర్'గా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌ను 24 గంటల్లోపు అరెస్టు చేయాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. ఢిల్లీ పోలీసులు అధికార బిజెపికి చేతిలో కీలుబొమ్మలా వ్యవహరించకూడదని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా అన్నారు. శుక్రవారం ఆమె ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆజాద్ కేసుతో పాటు మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటిలో జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలు, జంతర్ మంతర్ నిరసనలో పాల్గొన్న రుచికా సింగ్‌ను ఆన్‌లైన్‌లో లక్ష్యంగా చేసుకోవడం, అలాగే నోయిడాలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌదరిని జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్టు చేయడం వంటివి ఉన్నాయి. తరువాత, చౌదరిని నిర్బంధించే ఉత్తర్వులను అలహాబాద్ హైకోర్టు రద్దు చేసింది. న్యాయం కోసం పోరాడుతున్న ఈ యువతులందరికీ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ అండగా ఉంటారని లాంబా స్పష్టం చేశారు. ఆజాద్ కేసు గురించి ప్రస్తావిస్తూ, భరద్వాజ్ ఒక వీడియోలో హింసకు సంబంధించిన సంఘటనలను వివరించారని, దళితుల పట్ల అసభ్యకరమైన భాషను ఉపయోగించారని, అయినప్పటికీ అతనిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. 'స్వతంత్ర భరద్వాజ్‌ను 24 గంటల్లోపు అరెస్టు చేసి జైలుకు పంపాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని లాంబా అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఆజాద్ ప్రజాస్వామ్యయుతంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని, ఆ సమయంలోనే ఆమె తండ్రిపై దాడి జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో హత్యాయత్నం వంటి తగిన చట్టపరమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

# స్తంభాన్ని ఢీకొట్టిన ఇండిగో విమానం



**శ్రీనగర్:** విమానాశ్రయంలో పార్కింగ్ చేస్తుండగా ఇండిగో విమానం ఓ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఇండిగోకు చెందిన 6ఈ 225 విమానం శుక్రవారం నవీ ముంబై నుంచి శ్రీనగర్ చేరుకుంది. ఉదయం 9 గంటలకు శ్రీనగర్ విమానాశ్రయంలో దిగింది. అయితే విమానాశ్రయంలోని 6వ నంబర్ బే వద్ద పార్కింగ్ చేస్తుండగా అక్కడ ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విమానం ముందు భాగం దెబ్బతింది. కాగా, ఈ ప్రమాదాన్ని ఇండిగో సంస్థ ధవీకరించింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించినట్లు ఇండిగో సంస్థ తెలిపింది. ఆ అధికారులతో కలిసి దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది. అయితే ఈ సంఘటన తర్వాత శ్రీనగర్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T 4873 | Mahender Masampelly | SONALIKA DI 740 | 2019 |
| 2 | TS11UC7308 | Puppala Nagaraju | AL DOST BS6 | 2020 |
| 3 | TS19C 2313 | Suresh kunusothu | JOHN DEERE 5310 HARVESTER (ENGINE) | 2018 |
| 4 | TS27T 4537 | Mohahhad Khasim | SONALIKA DI 740 | 2019 |
| 5 | TS27E 2633 | Bhaskar Gugulothu | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2017 |

AUCTION DATE:05-09-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793

# ఇద్దరు మృత్యుంజయులు

- 9 రోజుల తర్వాత సొరంగం నుంచి బయటకు...
- 1,295కు పెరిగిన మృతులు
- వందల మంది పిల్లలు, అధ్యాపకులు గల్లంతు

**ఖాట్మండు:** నేపాల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. సహాయక కార్యకలాపాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ ఆపరేషన్ అద్భుత ఫలితానిచ్చింది. భారీ వరదల కారణంగా సొరంగంలో తొమ్మిది రోజుల పాటు చిక్కుకుపోయిన ఇద్దరిని సహాయక సిబ్బంది శుక్రవారం సురక్షితంగా బయటకు తెచ్చారు. దీంతో ఈ ఇద్దరిని మృత్యుంజయులని స్థానికులు అంటున్నారు. సజీవంగా బయటకు రాగలిగిన ఈ ఇద్దరు జల విద్యుత్ ప్రాజెక్టు కార్మికులు కబీర్ మహర్జన్ (45) సంజయ్ సాహ్(30) అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నేపాల్ మంత్రి బిరాజ్ భక్త శ్రేష్ఠ మాట్లాడుతూ ఈ ఆపరేషన్ గురించి మీడియాతో మాట్లాడారు. త్రిశూలి హైడ్రోపవర్ ప్రాజెక్టులోని సొరంగం నుంచి ఒక్కొక్కరు చొప్పున ఇద్దరిని కాపాడగలిగినట్లు తెలిపారు. హోం మంత్రి సుదన్ గురుంగ్ మాట్లాడుతూ కబీర్ మహర్జన్ ప్రాజెక్టులో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, సంజయ్ సాహ్ ఫోర్‌మెన్ అని తెలిపారు. భారీగా మట్టి, రాళ్లు పేరుకుపోయిన కారణంగా ఈ ఆపరేషన్ అత్యంత కష్టంగా మారిందని నేపాల్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టరేట్ వెల్లడించింది. సైన్యం అధ్వర్యంలోని సంయుక్త బృందం ప్రత్యేక పరికరాలతో గాలింపు చేపట్టి, సొరంగం నుంచి శబ్దాలు వినిపించడాన్ని గమనించి, చిక్కుకున్న వారితో మాట్లాడేందుకు ఏర్పాటు చేయగలిగారు. నేపాల్ ఆర్మీ, ఆర్మ్డ్ పోలీస్ దళాలు కలిసి సహాయక చర్యల్లో వేగం పెంచారు. చివరకు ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ అద్భుత రెస్క్యూకు సంబంధించి ఫొటోలు, వీడియోలనూ విడుదల చేశారు.

**ఇంకా ఆచూకీ లేని 4,798 మంది**

జల ప్రళయం మృతుల సంఖ్య 1,295కు చేరుకుంది. ఎనిమిది జిల్లాల నుంచి మృతదేహాలు లభ్యమయ్యాయని, మరో 4,798 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. 12 వేల మందిని కాపాడినట్లు చెప్పారు. జాడలేని వారి కోసం గాలింపులు కొనసాగుతున్నాయన్నారు. నేపాల్ భద్రతా బలగాల సంయుక్త కమాండ్ అధ్వర్యంలో గాలింపు చర్యలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. అయితే వీరిలో వందలాది మంది పిల్లలు ఉన్నారన్నారు. రసువా జిల్లాలో 280 మంది, నువాకోట్ జిల్లాలో 350 మంది పిల్లలు గల్లంతైనట్లు విద్యా శాఖ ప్రాథమిక సమాచారం. బిదూర్ మున్సిపాలిటీలోనే 250 మంది పిల్లలు గల్లంతయ్యారు.. అక్కడ మొత్తం 170 విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 142 కమ్యూనిటీ పాఠశాలలు, 28 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. పరిస్థితి విషాదకరంగా ఉందని మున్సిపల్ విద్యా విభాగానికి



చెందిన స్కూల్ ఇన్‌స్పెక్టర్ నవ్‌రాజ్ సాపోక్టా తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం వెతుకుతున్నారని, మరికొన్ని చోట్ల పిల్లలు తమ తల్లిదండ్రుల ఆచూకీ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. గల్లంతైన పిల్లల సంఖ్యను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని నువాకోట్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ అండ్ కోఆర్డినేషన్ నిట్ అధికారి సూర్య బహదూర్ ఖత్రీ తెలిపారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో కచ్చితమైన వివరాలు లేవన్నారు. కొంతమంది ఆచూకీ తెలిసినప్పటికీ చాలా మంది పిల్లల సమాచారం లేదన్నారు. అలాగే, రసువా, నువాకోట్ జిల్లాల్లో 22 మంది టీచర్లు, విద్యా సిబ్బంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. ధాదింగ్, గోర్ఖా ప్రాంతాల ఉపాధ్యాయులు తీర్థయాత్ర కోసం రసువాకు వెళ్లిన సమయంలో వరదల్లో చిక్కుకున్నారని సమాచారం. రసువా జిల్లాలో 16 మంది టీచర్ల ఆచూకీ లేదని, వీరిలో 15 మంది కమ్యూనిటీ పాఠశాలలకు చెందిన వారు కాగా ఒకరు ప్రైవేట్ విద్యా సంస్థ అధ్యాపకుడన్నారు. నువాకోట్‌లో మరో ఆరుగురు ఉపాధ్యాయులు గల్లంతైనట్లు అధికారులు ధ్రువీకరించారు.

## ఇరాన్‌తో సైనిక ఘర్షణను 'యుద్ధం'గా పిలవలేం

జెడి వాన్స్ వ్యాఖ్య

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య ఆరు నెలలుగా కొనసాగుతున్న సైనిక ఘర్షణను యుద్ధంగా పిలవడం సరికాదని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అన్నారు. నవంబర్ 3న జరిగే కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల నాటికి ఈ పోరాటం ముగుస్తుందా? అనే ప్రశ్నకు ఆయన ఖచ్చితమైన గడువు చెప్పలేదు. ప్రస్తుతం దాడులు పెద్ద స్థాయిలో జరగడం లేదని, కాబట్టి దీనిని యుద్ధమని తాను వ్యాఖ్యానించలేనని వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాన్స్ అన్నారు. అయితే, అమెరికా మిత్రదేశమైన కువైట్‌పై ఇరాన్ తాజాగా దాడి చేయడంపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. చేసింది. హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్తున్న వాణిజ్య నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడం కొనసాగిస్తున్నందున, అమెరికా ఈ వారం జరిపిన దాడులు బాధ్యతలో భాగమేనని వాన్స్ చెప్పారు. ఇలా వుంటే, ఈ ఘర్షణ అమెరికాలో రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోంది. ప్రారంభంలో కొన్ని వారాల్లో ముగుస్తుందని వైట్‌హౌస్ చెప్పినప్పటికీ, ఆరు నెలల తర్వాత కూడా ఎలాంటి



ఫలితం రావడం లేదు. చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరగడం అమెరికా వినియోగదారులపై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో నవంబర్ ఎన్నికల్లో కాంగ్రెస్‌లోని స్వల్ప మెజారిటీలను కాపాడుకోవాలని చూస్తున్న రిపబ్లికన్లకు ఇది సవాలుగా మారింది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 95 డాలర్లకు పైగా ఉంది. ఘర్షణ ప్రారంభానికి ముందు అది సుమారు 72 డాలర్లుగా ఉండేది. ప్రపంచ చమురు సరఫరాలో యుద్ధానికి ముందు సుమారు 20 శాతం హోర్ముజ్ జలసంధి మీదుగా జరిగేది. ఇప్పుడు ఇరాన్ ఈ ప్రాంతాన్ని దిగ్బంధనం చేసింది. ఫలితంగా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే, అమెరికా నౌకాదళం సహాయంతో బుధవారం సుమారు 15 మిలియన్ బ్యారెల్ల చమురు తరలించామని వాన్స్ చేసిన ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇరాన్‌పై సైనిక చర్య, ఆర్థిక ఒత్తిడి అనే రెండు మార్గాలను అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్నది. అవసరమైతే సైనిక చర్య తీవ్రతను పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడం గమనార్హం.

## మరో నలుగురు లెబనీస్ ఖైదీలను విడుదల చేసిన ఇజ్రాయెల్



**టైర్ (లెబనాన్):** మరో నలుగురు లెబనీస్ ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. సుమారు దశాబ్దకాలం క్రితం చోటుచేసుకున్న లెబనాన్ అంతర్యుద్ధ సమయంలో కొంత మంది యూదులు గల్లంతయ్యారు. వారు మృతి చెంది ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. కనీసం వారి శరీర అవశేషాలను కనుగొనే ప్రయత్నం చేస్తామని లెబనాన్ అంగీకరించడంతో, ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇజ్రాయెల్ నలుగురు ఖైదీలను విడుదల చేసింది. వారిని అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ బృందానికి శుక్రవారం అప్పగించింది. ఇజ్రాయెల్ ఇప్పటికే బంధించిన వారిలో హెజ్బొల్లా మిలిటెంట్లతోపాటు సామాన్య ప్రజలు కూడా ఉన్నారని లెబనాన్ ఆరోపిస్తున్నది. అయితే, ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయంపై స్పందించలేదు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకే నలుగురు లెబనీస్ ఖైదీలను విడుదల చేసినట్టు ప్రకటించింది.

# క్యూబాపై అమెరికా కొత్త ఆంక్షలు

**హవానా:** క్యూబాలో ఇప్పటికే అనేక సంక్షోభాలు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగా అమెరికా ప్రభుత్వం తాజాగా ఆదేశంపై కొత్త ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో మనవడు ఫిడెల్ ఎర్నెస్టో కాస్ట్రోతో పాటు, క్యూబా ప్రభుత్వానికి చెందిన ఆయిల్ ఇండస్ట్రీ సప్లై ఇంపోర్ట్ కంపెనీ (అబాపెట్) పైన కూడా ప్రభావం చూపుతాయి. క్యూబాలో క్రమంగా క్షీణిస్తున్న విద్యుత్ గ్రిడ్‌ను కొనసాగించేందుకు అవసరమైన ప్రత్యేక పరికరాలు, విడిభాగాలను దిగుమతి చేసుకునే బాధ్యత ఈ సంస్థదేకావడంతో, అమెరికా ఆంక్షల వల్ల విద్యుత్ సరఫరా గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. క్యూబా విద్యుత్ వ్యవస్థకు అవసరమైన కీలక యంత్రాంగాన్ని పనిచేయకుండా చేయడం, తద్వారా ఆ దేశంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఇంధన సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయడమే అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నదని ఆబ్సిడియన్ రిస్క్ అడ్వైజర్స్ అనే కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ ప్రిన్సిపల్, ఆంక్షల వ్యవహారాల నిపుణుడు బ్రెట్ ఎరిక్సన్ వ్యాఖ్యానించారు. క్యూబాపై ఒత్తిడిని అమెరికా మరింత పెంచేందుకు ప్రయత్నిస్తోంది అని ఆయన అన్నారు. క్యూబా నుంచి పాలనా మార్పు తప్ప మరే ఇతర మార్పును అంగీకరించే ఉద్దేశం ట్రంప్ ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉద్దేశిస్తూ, ఆయన ఈ విషయంలో వెనక్కి తగ్గబోవడం లేదు అని ఎరిక్సన్ అన్నారు. ఆంక్షలను తప్పించుకునేందుకు క్యూబా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అంచనా వేశారు. కాగా, అమెరికా ఆంక్షల నేపథ్యంలో క్యూబా ప్రత్నామ్నా



య మార్గాలను అన్వేషించే అవకాశాలు ఉన్నా యి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్యుత్ సరఫరా, నిర్వహణకు అవసరమైన విడిభాగాలను ఎలా సమకూర్చుకోవాలన్న విషయంలో క్యూబా కొత్త మార్గాలను అన్వేషిస్తున్నది. అయితే, అలా ప్రత్యామ్నాయ మార్గాల్లో పరికరాలను సమకూర్చుకోవడం మరింత ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుందని, దాని ప్రభావంతో ద్రవ్యోల్బణం పెరిగి క్యూబా ఆర్థిక వ్యవస్థ మరింత దెబ్బతింటుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలావుంటే, క్యూబా అంతటా విద్యుత్ కోతలు గతంలో కంటే ఎక్కువగా సాధారణమయ్యాయి. జీర్ణావస్థకు చేరుకున్న విద్యుత్ గ్రిడ్ తరచూ విఫలమవుతుండటంతో, ఇంధన నిల్వలు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో రోజువారీ విద్యుత్ కోతలు 24 గంటలను కూడా దాటుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఈ ఏడాది జనవరి చివరిలో క్యూబాకు చమురు విక్రయించే లేదా సరఫరా చేసే ఏ దేశంపైనైనా సుంకాలు విధిస్తామని హెచ్చరించినప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితులను తట్టుకోలేక ప్రభుత్వంపై క్యూబా ప్రజలు తిరుగుబాటు చేస్తారని అమెరికా భావిస్తున్నదని, మొత్తం మీద సంక్షోభాన్ని సృష్టించే ప్రయత్నం తీవ్రతరం చేస్తున్నదని పరిశీలకులు అంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా, క్యూబా మధ్య జరిగిన చర్చలు ఆ తర్వాత నిలిచిపోయాయి. అదే సమయంలో ఇటీవలి నెలల్లో అమెరికా ఆంక్షలు మరింత పెరిగాయి. క్యూబా ప్రభుత్వానికి చెందిన చిన్నచిన్న సంస్థలను కూడా అమెరికా వరుసగా లక్ష్యంగా చేసుకుంటున్నది. వాటిని పతన చక్రంలోకి నెట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తుంది. గతంలోనూ క్యూబాకు చెందిన ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజవాయువు సంస్థలతో పాటు ఇతర సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ ఏడాది జూన్ మాసంలో ఆమోదించిన చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలకు సంబంధించిన మరిన్ని వివరాలను క్యూబా అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించిన కొన్ని గంటలకే అమెరికా విదేశాంగ శాఖ తాజా ఆంక్షలను ప్రకటించడం గమనార్హం.

## బర్తరఫ్ బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

ఖండించి ఉండాల్సిందని.. ఖండించకపోవడం వల్లే ఎఐసిసి తీవ్రంగా పరిగణించిందని పేర్కొన్నారు. ఇప్పటికీ కొండా సురేఖ పార్టీలో కొనసాగాలని కోరుకుంటున్నామని చెప్పారు. తనను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని హైకమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేశాడన్న సురేఖ ఆరోపణలను మహేష్ గౌడ్ ఖండించారు. ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సిఎంకు లేదని వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని.. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా వేటు తప్పదని హెచ్చరించారు. లీడర్లు తమ సమస్యలు, ఇబ్బందులపై మాట్లాడేందుకు పార్టీలోనే ఎన్నో వేదికలు ఉన్నాయని.. బహిరంగంగా మాట్లాడటం క్షమించరాని తప్పని అన్నారు.

## జైల్ భరో

(మొదటి పేజీ తరువాయి)




అమర్‌జిత్ కౌర్, గిరీశ్ శర్మ, కె.రామకృష్ణలు శుక్రవారం నాడు మీడియాకు వెల్లడించారు.

**దశాబ్దాల తరువాత ఢిల్లీలో అతి పెద్ద సభ**

దశాబ్దాల తర్వాత దేశ రాజధానిలో ఒక వామపక్ష పార్టీ నిర్వహించిన అతిపెద్ద సభకు సెప్టెంబర్ 1న జరిగిన 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి రాంలీలా మైదానం ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని రాజా అన్నారు. 'ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రలు, ప్రజా సంబంధ కార్యక్రమాలు, సెప్టెంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'బద్లావ్ జరూరీ హై' సభ విజయవంతం కావడం, 80వేల మందికిపైగా పాల్గొనడం వంటి అంశాలన్నింటిని సమీక్షించాం' అని తెలిపారు. మోదీ ప్రభుత్వ విధానాలతో తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో 'బద్లావ్ జరూరీ హై' అనేది రాజకీయ నినాదంగా కాకుండా ప్రజల మార్పు ఆకాంక్షకు ప్రతీకగా మారిందని ఆయన స్పష్టంచేశారు. అడ్డంకులు, నిర్బంధాలను అధిగమించి ఢిల్లీలో వేలాది మందిని సమీకరించడం ద్వారా సిపిఐ ప్రజా ఉద్యమ సామర్థ్యాన్ని మరోసారి చాటి చెప్పిందని డి.రాజా వెల్లడించారు.

'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు పలు దశల కార్యాచరణను ఆయన ప్రకటించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబరు 2న దేశవ్యాప్తంగా మత సామరస్య దినం పాటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెరుగుతున్న మత సామాజిక విభజనకు వ్యతిరేకంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ విముక్తి, విప్లవ ఉద్యమాల్లో కమ్యూనిస్టుల పాత్రతో పాటు భారత స్వాతంత్ర్యోద్యమం, ప్రజాస్వామ్య నిర్మాణంలో కమ్యూనిస్టుల కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. యువతకు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, ప్రజాస్వామిక వారసత్వాన్ని పరిచయం చేయాలని సిపిఐ నిర్ణయించినట్లు డి.రాజా వెల్లడించారు. దేశవ్యాప్తంగా వడు రోజుల పాటు జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకుగాను ఐదు లక్షల మంది అరెస్టులకు సిద్ధం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల మద్దతును కోరారు. ప్రజా సమస్యలపైనే తమ ఉద్యమం జరుగుతున్నట్లు డి.రాజా తెలిపారు.

**మైనింగ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి**

ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించవద్దంటూ 'మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాజా డిమాండ్ చేశారు. ఒడిశా, జార్ఖం డ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ఖని జ సంపద ఉన్న రాష్ట్రాల హక్కులను ఈ చట్టం దె బ్బతీస్తోందని విమర్శించారు. ఖనిజ వనరుల పై రా ష్ట్రాల అధికారాలను కేంద్రీకరించడం సమాఖ్య వ్య వస్థకు విరుద్ధమని విమర్శించారు. దేశ సహజ వనరులు ప్రజల సంపదేనని, వా టిని కార్పొరేట్ ప్రయోజనాలకు అప్పగించరాదని ఆయన స్పష్టంచేశారు.

**జాతీయ విపత్తుగా అస్సోం వరదలు**

అస్సోంలో వరదల బీభత్సం కారణంగా వెయ్యికి పైగా గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రాజా పేర్కొన్నారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, బాధితుల సహాయ, పునరావాసం, పునర్నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం, మౌలిక వసతుల పునరుద్ధరణ, పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు.

## రాజీపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ఆరా**

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాడ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ స్కేపింగ్ పనులకు వాడాలని సిఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సిఎం బస చేశారు. శనివారం కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తాగునీటికే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఉమ్మడి ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కష్టకాలంలో తాగు నీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని కెఆర్‌ఎంబి స్పష్టం చేసింది. కృష్ణా జలాల పంపిణీపై కొనసాగుతున్న ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు హైదరాబాద్‌లోని జలసౌధలో కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. కెఆర్‌ఎంబి సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు తమ ప్రతిపాదనలను బోర్డు ముందుంచారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలలోని ప్రస్తుత నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, నీటి విడుదల విధానంపై సుదీర్ఘంగా చర్చించినప్పటికీ రెండు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడి ఉండటంతో నిర్ణయం తీసుకోలేకపోయారు. త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ 4వ వారంలో నిర్వహించనున్న కెఆర్‌ఎంబి పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నందున తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ ప్రతిపాదించగా, 66:34 నిష్పత్తినే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ పట్టుబట్టింది. ఈ ప్రతిపాదనను తెలంగాణ అధికారులు వ్యతిరేకించారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ తదితర మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అధిక మొత్తంలో నీటిని తరలిస్తోందని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. మరో వైపు నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయం వద్ద తెలంగాణ అవసరానికి మించి జలవిద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తోందని ఆంధ్రప్రదేశ్ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఈ అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య వాడీవేడిగా చర్చ జరిగినప్పటికీ ఎలాంటి రాజీ కుదరలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ ప్రతిపాదించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున పాత 66:34 నిష్పత్తిని కొనసాగించడం సమంజసం కాదని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరాల మేరకు తెలంగాణకు మొత్తం 200 టిఎంసిల నీరు అవసరమని, అందుకు అనుగుణంగా కేటాయింపులు చేయాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు. గత మూడేళ్లుగా 66:34 నిష్పత్తిని తెలంగాణ అంగీకరించడంలేదని, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటి తరలింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. అయితే తెలంగాణ ప్రతిపాదన సహేతుకంగా లేదని ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి పేర్కొన్నారు. గతంలో అమల్లో ఉన్న 66:34 నిష్పత్తి ప్రకారమే నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం 104 టిఎంసిల నీరు అవసరమని వివరించారు. తెలంగాణ కోరిన 200 టిఎంసిల కేటాయింపు ఆచరణ సాధ్యం కాదని, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్న నీరు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన వాటా నుంచే వినియోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## రాకెట్ ప్రయోగం సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల బరువు ఉన్న ఇఒఎస్–05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్య ంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6 సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307 సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అ ప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన పిఎస్‌ఎల్‌విసి – 62 రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కా రణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన పిఎస్‌ఎల్‌విసి–61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది.

ఈ ఆర్థిక సంవత్సంరలోనే తొలి మానవరహిత మిషన్ మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగం గా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఇఒఎస్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇఒఎస్–05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు.

**దేశానికి గర్వకారణం: ప్రధాని మోదీ**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన చరిత్ర విజయాత్మకాన్ని ప్రధాని మోదీ అభినందించారు. జిఎస్‌ఎల్‌విఎఫ్–17 మిషన్ విజయవంతం కావ దం అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి మరొక నిదర్శనమంటూ ప్రశంసలు కురిపించారు. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఇఒఎస్–05.. జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం.. భారత అంతరిక్ష రంగం సాధించిన ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న మన అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకు వెళ్లడంతో పాటు.. ఈ రంగంలో మన సమర్థతను మరింత బలోపేతం చేస్తున్నారు'' అని మోదీ రాసుకొచ్చారు.

**ఇస్రో శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు**

జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ద్వారా ఇఒఎస్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మ రో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దా ర్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు స రికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చా రు.

## చేజారిన పదవి (మొదటి పేజీ తరువాయి)

వైఎస్ జగన్‌తో విభేదించి టిఆర్‌ఎస్‌లో చేరి 2014 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి పోటీచేసి గెలుపొందారు. 2018లో టిఆర్‌ఎస్ టికెట్ నిరాకరించడంతో మళ్ళీ కాంగ్రెస్ టికెట్ పై పరకాల నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2023 సంవత్సరములో వరంగల్ తూర్పు నుంచి పోటీచేసి గెలుపొంది రేవంత్ రెడ్డి కేబినెట్ లో మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే అంతా సవ్యంగా ఉందనుకున్న తరుణంలో కొండా సురేఖ కూతురు సుస్మిత ఎపిసోడ్ సురేఖను మంత్రి పదవి పోయేదాకా తెచ్చింది.

**ముంచిన కొండా కుటుంబ దూకుడు తత్వం**

మొదట్లో కలిసొచ్చిన దూకుడు తనం కొండా దంపతులకు ఇప్పుడు చేదు అనుభవాన్ని మిగిలించింది. తొలినుంచి ఓరుగల్లు రాజకీయాల్లో కొండా ఫ్యామిలీ ఫైర్ బ్రాండ్ గా పేరు సంపాదించింది. తమను నమ్ముకున్న కేడర్ కోసం ఎక్కడికైనా వెళ్లే తత్వం ఉండడంతో కేడర్ కూడా కొండా దంపతుల వెంట నిలుస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శాయంపేట పోలీస్ స్టేషన్ లో అప్పటి పోలీస్ అధికారి గొర్రె మధుతో వాగ్వాదం, కార్యకర్తల కోసం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగడం వంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్ గా మంత్రి సురేఖ కూతురు సుస్మిత చేసిన సంచలన వ్యాఖ్యలే పదవి పోవడానికి కారణమైంది. కొండాను అనునయించని కేడర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ కు గురైన కొండా సురేఖను కేడర్ అనునయించ లేదు. ఆమె సొంత నియోజకవర్గమైన వరంగల్ తూర్పులో, గతంలో ప్రాతి నిధ్యం వహించిన పరకాలలో కేడర్ స్తబ్దుగా ఉన్నారు. హనుమకొండ రాంన గర్ లోని కొండా దంపతుల ఇంటి వద్ద కూడా నిర్మానుష్య వాతావరణం నెల కొంది. వరంగల్ తూర్పులో క్యాంపు ఆఫీసు వద్ద కూడా నిశబ్దం ఆవరించింది. ఇప్పటికే వరంగల్ తూర్పులో కాంగ్రెస్ కేడర్ గ్రూపులుగా విడిపోయి ఉన్నం దున కొండా బర్తరఫ్ తో అంతటా నిర్మానుష్యం నెలకొంది.

**కొండా సురేఖకు అచ్చిరాని మంత్రి పదవి**

సీనియర్ మహిళా ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖకు మంత్రి పదవి అచ్చి రావడం లేదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. రెండు సార్లు మంత్రి పదవి చేపట్టిన ఆమె.. రెండుసార్లూ పూర్తికాలం కొనసాగకుండానే పదవికి దూరమయ్యారు. తొలిసారి వైఎస్ రాజశేఖర్రెడ్డి మంత్రివర్గంలో చేరిన ఆమె ఏడాదికే మంత్రి పద విని కోల్పోగా.. 13 ఏండ్ల తర్వాత మరోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండున్నరేండ్లకే పదవి నుంచి వైదొలగాల్సిన పరి స్థితి ఏర్పడింది. 2023లో తిరిగి వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి.. సీఎం రేవంత్రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. మంత్రి హోదాలో ఉన్న సమయంలో కొండా సురేఖ పలు వివాదాలకు కేంద్రబిందువుగా మారారు. తాజాగా ఆమె కుటుంబానికి సంబంధించిన రాజకీయ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీశాయి. మారిన రాజకీయ పరి ణామాల నేపథ్యంలో సురేఖ మంత్రి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఇలా రాజకీయంగా సుదీర్ఘ ప్రస్థానం ఉన్న సురేఖకు రెండుసార్లు మంత్రి పదవి దక్కినా.. రెండుసార్లూ అనూహ్య పరిణామాలే పదవిని దూరం చేశాయి. దీంతో మంత్రి పదవి సురేఖకు నిజంగానే అచ్చిరావడం లేదా? లేక ప్రతిసారీ పరిస్థి తులే ప్రతికూలంగా మారుతున్నాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

### ఈస్ట్ జోన్‌తో ఫైనల్..

# తిలక్‌వర్మ బృందంలో సిరాజ్, పడిక్కల్





దేశవాళీ సీజన్ 2025–26 తొలి ట్రోఫీ అయిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో భారత స్టార్లు ఆడనున్నారు. శ్రీలంక పర్యటన ముగియడంతో పేసర్ సిరాజ్, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ ఈ టోర్నీలో బరిలోకి దిగనున్నారు. లంకపై మెరిసిన వీరిద్దరూ సౌత్ జోన్ జట్టు తరఫున చెలరేగనున్నారు. సెప్టెంబర్ 6 ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఈస్ట్ జోన్‌తో ఫైనల్ జరుగనుంది. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ముందే సౌత్ జోన్ జట్టు మరింత పటిష్టంగా మారనుంది. సెమీస్‌లో నార్త్ జోన్‌పై సూపర్ విక్టరీ కొట్టిన సౌత్ బలాన్ని పెంచుతూ.. శ్రీలంకపై సెంచరీలతో చెలరేగిన దేవదత్ పడిక్కల్, ప్రధాన పేసర్ సిరాజ్‌లు జట్టుతో కలువనున్నారు. శ్రీలంకపై మూడు ఇన్నింగ్స్‌లో పడిక్కల్ రెండు సెంచరీలతో 328 రన్స్ సాధించగా.. సిరాజ్ మాత్రం నాలుగే వికెట్లతో నిరాశపరిచిన విషయం తెలిసిందే. ఇప్పటికే కేఎల్ రాహుల్ కూడా స్క్వాడ్‌లో చేరడంతో.. తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఆ టీమ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు కానుంది. ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో నార్త్ జోన్‌పై 7 వికెట్ల విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైంది సౌత్. సెప్టెంబర్ 6 ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇరు జట్లు అంతిమపోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

**సౌత్ జోన్ స్క్వాడ్(అప్డేటెడ్) :** కెఎల్ రాహుల్, దేవ్దత్ పడిక్కల్, కరుణ్ నాయర్, తిలక్ వర్మ(కెప్టెన్), రికీ భూ(వైస్ కెప్టెన్), నారాయణ్ జగదీశన్, కొడమెల హిమతేజ, షేక్ రషీద్, రవిచంద్రన్ స్మరణ్, అభినవ్ తెజ్రన, సిరాజ్, సీవీ మిలింద్, అమన్ ఖాన్, శ్రేయాస్ గోపాల్, కావూరి సాయి తేజ, తనయ్ త్యాగరాజన్, త్రిపురణ విజయ్.

# చైనా మాస్టర్స్ సెమీస్‌లో సాత్విక్ జోడీ

### క్వార్టర్స్‌లోనే కంగుతిన్న శ్రీకాంత్





చైనా మాస్టర్స్ 2026లో భారత డబుల్స్ ద్వయం అదరగొట్టింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో అద్భుతంగా ఆడిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో అస్ట్రుప్ రస్ముసెన్(డెన్మార్క్) జంటను చిత్తు చేసింది సాత్విక్ జోడీ. అయితే.. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్ చేరిన అతడు లీ చీక్ యూ(హాంకాంగ్) చేతిలో వరస సెట్లలో వెనకబడి.. ఓటమి పాలయ్యాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో భారత డబుల్స్ ద్వయం సెమీస్‌లో అడుగుపెట్టింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్లో తొలి సెట్‌ను 21–13తో గెలిచిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట.. ఆపైనా మరింత చెలరేగింది. అస్ట్రుప్ రాస్ముస్సెన్ జంట 16–21తో రెండో సెట్ గెలిచి మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్లో పంజా విసిరిన భారత ద్వయం 21–18తో మట్టికరిపించింది. డెబ్బై నిమిషాల పోరులో ప్రత్యర్థిని గొప్పగా నిలువరించిన సాత్విక్ జోడీ సెమీస్ బెర్తు దక్కించుకుంది.

**పట్టు సడలించి..** ఇదే ఈవెంట్లో పతకంపై ఆశలు రేపిన కిడాంబి శ్రీకాంత్ మాత్రం క్వార్టర్స్‌లో కంగుతిన్నాడు. శుక్రవారం మ్యాచ్ ఆరంభంలో లీ చెక్ యూపై చకచకా రెండు పాయింట్లు సాధించిన అతడు.. ఆపై ఆదే జోరు చూపలేకపోయాడు. అనూహ్యంగా పుంజుకున్న హాంకాంగ్ ప్లేయర్ అద్భుతంగా భారత షట్లర్‌ను నిలువరించాడు. తొలి సెట్‌ను 21–16తో గెలుచుకున్న లీకి.. రెండో సెట్లో శ్రీకాంత్ షాకిస్తూ వరసగా నాలుగు పాయింట్లు సాధించాడు. కానీ, కాసేపటికే ఆధిక్యాన్ని తగ్గించినా.. భారత ఆటగాడు 15–14తో సెట్ సొంతం చేసుకుంటాడనిపించింది.

కానీ, పట్టువదలని లీ.. 21–16తో సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. దాంతో, శ్రీకాంత్ వరసగా అతడి చేతిలో నాలుగో ఓటమి చవిచూశాడు. చివరగా 2018 ఇండియా ఓపెన్‌లో లీపై విజయం సాధించాడీ మాజీ వరల్డ్ నంబర్ 1. హాంకాంగ్ షట్లర్ చేతిలో భారత సీనియర్‌కు ఇది వరసగా నాలుగో పరాజయం. మ్యాచ్ పోయినా కాసింత గర్వపడాల్సిన విషయం ఏంటంటే.. గత మూడేళ్లలో ఒక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో శ్రీకాంత్ క్వార్టర్స్ ఆడడం ఇదే మొదటిసారి.

## సైన్స్

### గమ్యం లేని తీరాలకు అంతులేని ప్రయాణం



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' 1977 సెప్టెంబర్ 5న ప్రయోగించిన 'వాయేజర్ I' అంతరిక్ష నౌకను మొదట బృహస్పతి (జూపిటర్), శని (శాటర్న్) గ్రహాలను అధ్యయనం చేయడానికే రూపొందించారు. అయితే దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత అది మానవులు నిర్మించిన వస్తువుల్లో భూమికి అత్యంత దూరంలో ఉన్న అంతరిక్ష నౌకగా నిలిచింది. అంతేకాదు, 'అంతర్‌నక్షత్ర అంతరిక్షం'లోకి ప్రవేశించిన తొలి మానవ నిర్మిత యంత్ర ప్రయాణంగా చరిత్ర సృష్టించింది. 2012 ఆగస్టు 25న హీలియోపాజ్ అనే సరిహద్దును వాయేజర్ I దాటింది. ఈ సరిహద్దు వరకు సూర్యుని అయస్కాంత క్షేత్రం, సౌర గాలుల ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ప్రారంభమయ్యేది నక్షత్రాల మధ్య విస్తరించిన అంతరిక్షం. ప్రస్తుతం వాయేజర్ I అదే ప్రాంతంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. దానితో పాటు భూమి నాగరికతకు ప్రతీకగా రూపొందించిన ప్రసిద్ధ గోల్డెన్ రికార్డు కూడా తనతో తీసుకెళుతున్నది. ఇందులో భూమిపై జీవజాతులు, సంగీతం, శుభాకాంక్షలు, ప్రకృతి ధ్వనులు వంటి సమాచారం భద్రపరిచారు. వాయేజర్ Iకు సౌర ఫలకాలు లేవు. విద్యుత్ ఉత్పత్తి కోసం అది మూడు రేడియోఐసోటోప్ థర్మోఎలక్ట్రిక్ జనరేటర్లను (ఆర్‌టిజిలను) ఉపయోగిస్తోంది. వీటిలో ఉన్న ప్లూటోనియం 238 సహజ రేడియోధార్మిక క్షయంతో ఉత్పత్తయ్యే ఉష్ణాన్ని విద్యుత్తుగా మారుస్తాయి. అయితే ఈ ప్రక్రియతో లభించే విద్యుత్ ప్రతి సంవత్సరం సుమారు 4 వాట్లు తగ్గిపోతోంది. అందువల్ల శక్తిని ఆదా చేయడానికి నాసా శాస్త్రవేత్తలు ఒక్కో శాస్త్రీయ పరికరాన్ని క్రమంగా నిలిపివేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నాసా లోఎనర్జీ ఛార్జ్ పార్టికల్స్ పరికరాన్ని కూడా నిలిపివేసింది.

## జీవసాంకేతిక రంగంలో వృద్ధి



జీవసాంకేతిక విభాగం (డిబిటి) తాజాగా విడుదల చేసిన 2025 సంవత్సరాంత సమీక్ష ప్రకారం, భారతదేశ జీవసాంకేతిక రంగం గత దశాబ్దంలో అసాధారణ వృద్ధిని సాధించింది. 2014లో కేవలం 10 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువ కలిగిన ఈ రంగం, 2024 నాటికి 165.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల లక్ష్యంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ వృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో 12వ అతిపెద్ద బయోటెక్ హబ్‌గా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో 3వ స్థానంలో, ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టంగా నిలిపింది. అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ తయారీ దేశంగా భారత్‌కు గుర్తింపు లభించింది. ఈ విజయానికి పునాదిగా ప్రభుత్వ విధానాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధన–వాణిజ్యీకరణ మధ్య బలమైన అనుసంధానం ఉన్నాయి. 2025లో దేశంలో తొలి జాతీయ బయోఫౌండ్రీ నెట్‌వర్క్ ప్రారంభించబడింది. దీని ద్వారా దేశీయ బయోమాన్యుఫాక్చరింగ్ సామర్థ్యాలు గణనీయంగాపెరిగాయి. బయోఇ3 విధానం అమలులోకి రావడం ద్వారా బయో ఆధారిత రసాయనాలు, ప్రెసిషన్ బయోథెరప్యూటిక్స్, వాతావరణానికి తట్టుకునే వ్యవసాయంవంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దారితీసింది. యువత ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు డిజైన్ ఫర్ బయోE3 కార్యక్రమం ప్రారంభించబడింది. జీవసురక్షను కాపాడుతూ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడానికి 2025లో స్టాక్డ్ జన్యుపరంగా మార్పు చేసిన పంటలపై మార్గదర్శకాలు నోటిఫై చేయబడ్డాయి. ఒకే పంటలో రెండు లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలను కలిపే ఈ విధానం వ్యవసాయ ఉత్పాదకతను పెంచే కీలక అడుగుగా నిలిచింది. జీనోమ్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా 10,000 పూర్తి మానవ జీనోమ్ నమూనాలతో జాతీయ జన్యు డేటాబేస్ రూపొందించబడింది. వన్ డే వన్ జీనోమ్ కార్యక్రమం దేశంలోని సూక్ష్మ జీవ వైవిధ్యాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, వేరు చేసిన బ్యాక్టీరియా జీనోమ్‌లను ప్రతిరోజూ విడుదల చేసే ప్రయత్నంగా నిలిచింది. బయోమెడికల్ పరిశోధనలో మానవవనరుల అభివృద్ధికి బయోమెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రాం(బిఆర్‌సిపి) మూడవదశను ప్రారంభించారు. దీని ద్వారా అత్యాధునిక పరిశోధనలకు అవసరమైన శాస్త్రవేత్తలను తయారు చేయడం, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం లక్ష్యంగాపెట్టుకున్నారు. 2025లో డిబిటి సాధించిన విజయాలు అనేకరంగాల్లో స్పష్టంగా కనిపించాయి. ఇది దేశాన్ని స్థిరమైన బయో–ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ నాయకుడిగా నిలబెట్టే దిశగా బలమైన పునాది వేసింది.

## పాలపుంతలో కొత్త 'డైసన్ స్ఫియర్'!



ఖగోళ శాస్త్రవేత్తలు పాలపుంత (మిల్కీవే) గెలాక్సీలో ఒక నక్షత్రాన్ని చుట్టుముట్టి, దాని నుంచి వచ్చే శక్తిని సేకరించడానికి ఏర్పడే భారీ అంతరిక్ష నిర్మాణం (డైసన్ స్ఫియర్)గా అనుమానిస్తున్న ఏడు నక్షత్రాలను గుర్తించారు. అయితే ఇవి నిజంగా గ్రహాంతరవాసులు నిర్మించిన కృత్రిమ నిర్మాణాలేనని ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఇవి కేవలం మరింత పరిశోధనకు అర్హమైన అభ్యర్థులు మాత్రమే. శాస్త్రవేత్తలు గైయా, 2 ఎంఎఎస్ఎస్ (మాస్), డబ్ల్యుఐఎస్ఇ (వైజ్) అనే ఆకాశ సర్వేల ద్వారా సేకరించిన సమాచారాన్ని ఉపయోగించి దాదాపు 50 లక్షల నక్షత్రాలను విశ్లేషించారు. సాధారణంగా కనిపించే కాంతిలో సహజంగానే కనిపిస్తూ, మధ్యపరారుణ (మిడ్ ఇన్‌ఫ్రారెడ్) తరంగదైర్ఘ్యాల్లో అసాధారణంగా ఎక్కువ శక్తిని విడుదల చేస్తున్న నక్షత్రాలను వారు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పరిశోధనలో గుర్తించిన ఏడు నక్షత్రాలూ ఎండ్వార్ఫ్(ఎం డార్ఫ్ లేదా రెడ్ డార్ఫ్) రకానికి చెందినవి. వీటి నుంచి వస్తున్న పరారుణ వికిరణం ప్రస్తుతం తెలిసిన కొన్ని సహజ ఖగోళ ప్రక్రియలతో సులభంగా వివరించలేని విధంగా ఉంది. అందువల్ల వీటిని మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. డైసన్ స్ఫియర్ అనే భావనను 1960లో భౌతిక శాస్త్రవేత్త ఫ్రీమన్ డైసన్ ప్రతిపాదించాడు. అత్యంత అభివృద్ధి చెందిన ఒక నాగరికత తన నక్షత్రం విడుదల చేసే అపార శక్తిని వినియోగించుకోవడానికి, ఆనక్షత్రం చుట్టూ అనేక ఉపగ్రహాలు లేదా శక్తి సేకరణ నిర్మాణాలను ఏర్పాటు చేయవచ్చని ఆయన సూచించాడు. ప్రజాదరణ పొందిన చిత్రాల్లో చూపినట్లుగా అదిపూర్తిగా నక్షత్రాన్ని కప్పేసే ఘన గోళం కావాల్సిన అవసరం లేదు.అనేక చిన్ననిర్మాణాలసముదాయం కూడా పాక్షిక డైసన్ స్ఫియర్‌గా పరిగణించవచ్చు.

# హక్కుల కోసం యువత ఉద్యమించాలి

### 8న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల బహిరంగసభ విజయవంతానికి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** హక్కులు, సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మహాసభల చీఫ్ ప్యాట్రన్ పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 8న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కెఎం గ్రాండ్ ఫంక్షన్‌హాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేపర్ లీకులు, విద్యావైద్య రంగాల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట వేదికగా జరిగే ఈ మహాసభల్లో యువత సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభల గౌరవ అధ్యక్షుడు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలను ఎండగట్టాలని యువతను కోరారు. యువత సంఘటితమైతే సమాజం మారుతుంది అనే స్ఫూర్తితో సెప్టెంబర్ 8న యాదగిరిగుట్టలో నిర్వహించే భారీ యువజన ప్రదర్శన, బహిరంగ సభకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు తీర్పారీ వెంకటేశ్వర్లు, చేపూరి కొండల్, జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమీద్ది శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు




### ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం

**ప్రజాపక్షం/జగిత్యాల :** కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమాలు చేయాలని ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలో సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న ఎఐటియుసి రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముక్రం మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు పోరాటాలకు, విప్లవాలకు, ఉద్యమాలకు ఊపిరిగా ఉన్న కరీంనగర్ గడ్డ మీద జరుగనున్నాయన్నారు. మహాసభకు కార్మిక వర్గం కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎండి.రజాక్, టి.రాజు, బీడీ కార్మికులు భోగ నర్సయ్య, శేఖర్, రాజాం, మహేష్, లత, జయ, జల, నిరోషా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రద్దు చేసిన కార్మిక చట్టాలు పునరుద్ధరించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** రద్దు చేసిన కార్మిక కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరుగుతున్న ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఎఐటియుసి నల్లగొండ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ దోపిడీకి రెడ్‌కార్పెట్ పరుస్తోందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సవరణల పేరుతో కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, అవి కార్మిక సంక్షేమానికి మరణ శాసనాలుగా మారాయన్నారు. కనీస వేతనాన్ని రూ. 26,000కు పెంచి అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్.రెడ్డి, ఎండి జానీ, దొనకొండ వెంకన్న, గుండె రవి, జి.నరేందర్, వెంకన్న, నాగార్జున, శంకర్ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

### ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్




**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తుందని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్ అన్నారు. వరంగల్ పట్టణం శివనగర్ తమ్మెర భవన్‌లో సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటియూసి వరంగల్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలకు వరంగల్ జిల్లా నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ యజమానుల ఆస్తులను పెంచేందుకు కుట్రలు చేస్తూ, కార్మికులు 100 సంవత్సరాలకు పైగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారిని బానిస యుగంలోకి తీసుకెళ్లే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కుట్రలపై కార్మికులు అప్రమత్తమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో అన్నిరంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంపెల్లి మునీశ్వర్, గుండె భద్రి, ఎండి యాకోబ్, గోవర్ధన్, తాళ్లపల్లి జాన్ పాల్, ఉప్పుల రవి, బోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


# సింగరేణి భవిష్యత్తును కాపాడుతాం

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య




**ప్రజాపక్షం/కాసిపేట :** సింగరేణి సంస్థను, కార్మికుల హక్కులను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని, సింగరేణి భవిష్యత్తును కాపాడుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట రెండో గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ బోర్డుల విషయంలో సిబి విచారణ జరుగుతున్నందునే వైద్యులు అన్‌ఫిట్ ఇవ్వడానికి జంకుతున్నారని, దీనిపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చి పెర్క్స్‌పై ఆదాయపు పన్ను చెల్లింపు, సహజ మరణానికి రూ.20 లక్షల సాయం, మైనింగ్ సిబ్బందికి పదోన్నతులు, సొంత ఇంటి పథకం సహా 24 అంశాలపై చారిత్రక ఒప్పందం సాధించామని తెలిపారు. గతంలో ఏమీ చేయని నాయకులు తమ ఒప్పందాలను విమర్శించడం విడ్డూరమని, ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సంస్థ పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరో 9 కొత్త గనులను తీసుకొచ్చే బాధ్యత తమదేనని చెప్పారు. కార్యక్రమంలో మిట్టపల్లి వెంకటస్వామి, అక్బర్ అలీ, దాగం మల్లేష్, తిరుపతి, బియ్యాల వెంకటస్వామి, చిప్ప నరసయ్య, మీనుగు లక్ష్మీ నారాయణ, నాగేశ్వరరావు, మంతెన రమేష్, గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నరసయ్య, బొద్దుల వెంకటేష్, బొమ్మకంటి సాగర్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె హెచ్చరికతో యాజమాన్యం మెట్టు దిగింది




**చుంచుపల్లి :** ఎఐటియుసి సమ్మె నోటీసు, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, నిరంతర పోరాటం ఫలించాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. కార్మికుల పలు కీలక డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం అంగీకారం తెలిపి అగ్రిమెంట్లు చేసిందని వెల్లడించారు. శుక్రవారం పీవీకే5 గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూన్ 8న ఎఐటియుసిసమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ఆర్‌ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని, ఈ చర్చల ద్వారా అనేక డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు సాధించామని తెలిపారు. సాధించిన అగ్రిమెంట్ల అమలును ఎఐటియుసి పర్యవేక్షిస్తుందని, మిగిలిన సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఏఐటీయూసీ విధానమని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, పిట్ కార్యదర్శులు భుక్య రమేష్, మధుకృష్ణ, కమల్, సహాయ పిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సుమన్, ఎస్.రమేష్, నరేందర్, సురేందర్‌రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గర్భసంచి ఆపరేషన్ కోసం వెళ్లిన మహిళ కిడ్నీ మాయం?

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు పట్టణంలోని అర్పిత నర్సింగ్ హోం ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ చేయించుకున్న యాదగిరిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమలమ్మకు కిడ్నీ తొలగించారంటూ ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. గర్భసంచికి సంబంధించిన ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అనంతరం వైద్య నివేదికల్లో కిడ్నీ కనిపించ లేదని వారు పేర్కొన్నారు.దీంతో ఆగ్రహానికి గురైన బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గర్భసంచి ఆపరేషన్ చేయాల్సిన మహిళకు కిడ్నీకి సంబంధించిన సమస్య ఎలా తలెత్తిందో అధికారులు స్పష్టంగా తేల్చాలని కోరారు. ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులను పోలీసులు విరమింపజేసే ప్రయత్నం చేయగా, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. అనంతరం అర్పిత నర్సింగ్ హోం వైద్యుడు డాక్టర్ ప్రభాకర్‌ను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబసభ్యుల ఆరోపణలకు ముందు, అనంతరం నిర్వహించిన స్కానింగ్ నివేదికలు, వైద్య పరీక్షలు, పాత వైద్య రికార్డులు, ఆపరేషన్ వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆరోపణల్లో వాస్తవం తేలితే సంబంధిత వైద్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై అధికారుల విచారణతోనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## మచ్చ లేని నాయకుడు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : మచ్చ లేని నాయకుడు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అని భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ అన్నారు. యాదాద్రి వెయ్యి రోజులలో ఒక్కసారి కూడా ప్రజా సమస్యల గురించి మాట్లాడని గొంగిడి కేటీఆర్ అని హెద్దేవ చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు రూ.206 కోట్లు విడుదల చేయించిన ఘనత కుంభం అనిల్ కుమార్ రెడ్డికే దక్కిందన్నారు. భువనగిరిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే ఓర్వలేకనే ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఇప్పటి వరకు రూ.1500 వందల కోట్లతో భువనగిరి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నా అన్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చేసిన సవాల్‌ని కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తున్నామని చర్చకు ఎప్పుడొస్తారో శేఖర్ రెడ్డి చెప్పాలని అవైస్ చిస్తీ డిమాండ్ చేశారు.

## కార్మిక, వ్యతిరేక విధానాలపై ఎఐటియుసి పోరాటం

ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఏఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజారామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఐటియుసి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సెప్టెంబర్ 6న జరుగు కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. 7, 8 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలపై స్పష్టమైన వైఖరితో ఆజెండాతో ముందుకు వెళ్తున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అని అలాంటి సంఘం మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ దేశంలో, రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలకుల యొక్క పనితీరును ఎండగట్టడంలో భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను దిశానిర్దేశం చేసే విధంగా ఈ మహాసభలు జరుగుతాయన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ సర్కార్ కార్మిక చట్టాల సవరణ పేరుతో నాలుగు లేబర్ కోడ్లుగా మార్చిన చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాలను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదని విధంగా తీర్మానాలు చేయడం తామన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానానికి, స్కీమ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిచొ మరో పోరాటానికి సిద్దం కావాలన్న సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బొంకూరు శ్యాంసుందర్, నియోజక వర్గ గౌరవ అధ్యక్షులు కోట రామస్వామి, నరసయ్య, నజీర్, వెంకన్న, ఆంథ్రయ్య, హైమద్ ఖదీర్, శ్రీనివాస్, సత్యం, విక్రపతి, యాకూబ్, సైదులు, మహేష్, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రికి నూతన భవన మంజూరీ చేస్తున్నట్లు నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాసుపత్రి ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి.జహంగీర్ మాట్లాడుతూ రామన్నపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడా పడకలు,వైద్య సిబ్బంది, అవసరమైన మౌలిక వసతులు లేకపోవడంతో, శిథిలావస్థకు చేరిన భవనంలో పేద ప్రజలు దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.

# రేవంత్ సభకు రాజగోపాల్‌రెడ్డి వస్తారా?

నల్లగొండ సభకు దూరం..
నేడు సొంత గడ్డపై సిఎం సభ
రేవంత్‌తో వేదిక పంచుకుంటారా..
దూరంగానే ఉంటారా?



**ప్రజాపక్షం/నల్లగొండ:** నకిరేకల్ వేదికగా శనివారం జరగనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభకు భారీగా జన సమీకరణ చేపట్టడంతో పాటు నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే సభ కంటే కూడా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారా..లేదా.. అన్నదే ప్రస్తుతం ప్రధాన రాజకీయ చర్చగా మారింది. రాజగోపాల్‌రెడ్డి సొంత ఊరు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల కావడం,అది నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయన హాజరుపై ఉత్కంఠ నెలకొంది.

**నల్లగొండ సభకు దూరంగా..**

ఈ ఉత్కంఠకు మరో కారణం ఉంది.గత జూన్ 28న నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న భారీ సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకాలేదు. కనగల్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) రోడ్ల పైలాన్ ఆవిష్కరణతో పాటు నల్లగొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభకు హాజరైనప్పటికీ రాజగోపాల్‌రెడ్డి మాత్రం దూరంగా ఉన్నారు.

అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి తనకు నచ్చకపోవడంతోనే నల్లగొండ సభకు వెళ్లలేదని రాజగోపాల్‌రెడ్డి చెప్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అదే సమయంలో ముఖ్యమంత్రితో తాను టచ్‌లోనే ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

**నేడు సొంత గడ్డపై.. ఏం జరుగుతుంది?**

ప్రస్తుతం నకిరేకల్‌లో సీఎం సభ జరగనున్న నేపథ్యంలో గత పరిణామాలతో పోల్చితే ఈ సభకు మరింత రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ అంతర్గత వ్యవహారాలు,పాత కాంగ్రెస్‌కొత్త కాంగ్రెస్ వ్యాఖ్యలు,ప్రభుత్వ పనితీరుపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే చర్చకు దారితీశాయి.ఈ నేపథ్యంలో బ్రాహ్మణవెల్లెంలకు సమీప ప్రాంతం,తన రాజకీయ ప్రస్థానంతో అనుబంధం ఉన్న నకిరేకల్ గడ్డపై జరిగే సీఎం సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారా అన్నది ఆసక్తికరంగా మారింది.

**వేదిక పంచుకుంటే.. సంకేతం మారుతుందా**

రాజగోపాల్‌రెడ్డి సభకు హాజరై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వేదిక పంచుకుంటే..ఇటీవల ఇద్దరి మధ్య నెలకొన్న రాజకీయ దూరంపై భిన్నమైన సంకేతాలు వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు నల్లగొండ సభ తరహాలో నకిరేకల్ సభకు కూడా ఆయన దూరంగా ఉంటే.. పార్టీలో అంతర్గత విభేదాలపై చర్చ మరోసారి ఊపందుకునే అవకాశం ఉంది.ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు,ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఈ సభలో రాజగోపాల్‌రెడ్డి కనిపిస్తారా లేదా అన్నదే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.జూన్‌లో నల్లగొండ సభకు దూరమైన రాజగోపాల్‌రెడ్డి..సెప్టెంబర్ 5న నకిరేకల్ వేదికపై రేవంత్‌రెడ్డితో కలిసి కనిపిస్తారాలేక తన దూరాన్ని కొనసాగిస్తారా ఈ ప్రశ్నకు నేటి సభే సమాధానం చెప్పనుంది.



## 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/కోదాడ:** వ్యవసాయానికి విధిస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే రద్దు చేసి రైతులకు 24 గంటల విద్యుత్ కోతలను నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు సబ్ స్టేషన్ గేట్లు మూసి వేసి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎడిఈ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ 24 గంటల ఉచిత్ విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లు రామకృష్ణ, పోటు నరేష్, సామినేని సుబ్బారావు, శేషయ్య, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్‌రావు, వెంకటరామయ్య, బొల్లు నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

# సిఎం సభకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలన..ఎంపి చామల,ప్రభుత్వ విప్ వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం నకిరేకల్ పట్టణానికి రానున్న నేపథ్యంలో మినీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రజా వికాస సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న,పిఏసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,మాజీ జెడ్పిటిసి అలుగుబెల్లి రవీందర్ రెడ్డి కిరణ్, వీరార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

**కట్టంగూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

కట్టంగూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డును భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం,పేద కుటుంబాల అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వారు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుంది అన్నారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సన్నబియ్యం పొందవచ్చునని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలోబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య,తహశీల్దార్ పుష్పలత,జ్యోతి, మాదయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : జిల్లాలో నమోదవుతున్న కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల తీరుతెన్నులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, కోర్టు కేసుల పరిస్థితి, అట్రాసిటి కేసులు, సెంటర్ కంప్లైంట్ సెల్ ఫిర్యాదులు, 30 రోజుల్లో చార్జీషీట్ దాఖలు, ఫోక్సో కేసులు దర్యాప్తు తదితర అంశాలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తులో జాప్యం లేకుండా కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత సమయంలో దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులకు సంబంధించిన వివరాలను నిరంతరం సమీక్షిస్తూ, కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతోపాటు సాక్ష్యాధారాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్, కోర్టు విచారణకు అవసరమైన సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఫోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, దర్యాప్తుకు అత్యంత ప్రాధాన్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, నిర్ణీత సమయంలో చార్జీషీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీస్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## నీళ్ల పేరుతో బిఆర్‌ఎస్ నికృష్ట రాజకీయాలు

రైతు ధర్నా చెయ్యాల్సిన అవసరం ఏముంది ?
జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీళ్ల పేరుతో నికృష్ట రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని తన పదేళ్ల కాలంలో రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర కలిగిన బి ఆర్ఎస్ రైతుల గురించి ధర్నా చేయడం చాలా విడ్డూరంగా ఉందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జూబ్లీ హిల్స్ శాసనసభ్యులు నవీన్‌యాదవ్ కేటీఆర్‌పై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ రైతులకు వరి పంట పండించడం కేసీఆర్, జగదీశ్‌రెడ్డి నేర్పించినట్లు కేటీఆర్ బడాయి కబుర్లు చెపుతున్నాడని నాగార్జునసాగర్ కట్టింది కాంగ్రెస్ పార్టీ అని, మిర్యాలగూడ రైతులకు దశాబ్దాలు గా నీళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కేటీఆర్ గుర్తుంచుకోవాలని అన్నారు. నీళ్ల గురించి బీఆర్ఎస్ చెబితే నేర్చుకోవాల్సిన ఖర్మ కాంగ్రెస్ పార్టీకి లేదని, కేటీఆర్ మాటలు తాతకు దగ్గులు నేర్పినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు పడలేదు ఏడాది అంతా ఇదే పరిస్థితి ఉంటుందని ప్రస్తుత పరిస్థితుల్లో సాగు నీరు కంటే తాగు నీరు ముఖ్యం అందుకే ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం చెబుతోందని, ఈ పరిస్థితి రైతులు కూడా అర్థం చేసుకున్నారని కానీ కేటీఆర్‌కు అర్థం కావడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయంలో పార్టీలో ఉన్న వారికే పథకాలని నేడు ఆ పరిస్థితి మారి అందరికీ అందుతున్నాయని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాలు ఉధృతం

బుల్లెట్ ట్రైన్ కారిడార్ అఖిలపక్షాల పోరాట కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : దశాబ్దాలుగా సూర్యాపేటకు రవాణా సౌకర్యం కల్పించడం పాలకుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ వచ్చిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్చే కుట్రపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో తిరుగుబాటు కొనసాగిస్తామని జాతీయ రహదారి వెంట బుల్లెట్ ట్రైన్ కొనసాగించడమే లక్ష్యంగా ఉద్యమాలు చేస్తామని బుల్లెట్ ట్రైన్ కారిడార్ అఖిలపక్షాల పోరాట కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సద్దల చెరువులో జరిగిన సామూహిక జలదీక్షలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సూర్యాపేటకు వచ్చే బుల్లెట్ ట్రైన్ దారి మళ్లించుటకు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేంద్రం ప్రకటించిన విధంగా మొదటి అలైన్మెంట్ బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65కు సమాంతరంగా కొనసాగేలా ప్రకటించాలని ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్ర రాజధానితోపాటు దేశ రాజధానిలో పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, డాక్టర్ రామ్మూర్తి, జుట్టుకొండ సత్యనారాయణ, ధర్మార్జున్, డేవిడ్ కుమార్, మట్టిపెల్లి సైదులు, చల్లమల్ల నరసింహ, భూపతి రాములు, బూర మల్సూర్ గౌడ్, యాదగిరి రావు, పోలెబోయిన కిరణ్, పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో పేదలకు లబ్ధి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలో శివాజీ నగర్ నుండి క్లాక్ టవర్ వరకు వికాస యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకుల పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని,దళిత బహుజనుల ఆత్మీయ బంధువుగా మారారని కొనియాడారు. ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్, కేటీఆర్‌లు ప్రజా పాలనను విమర్శించడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దోచుకున్న బీఆర్ఎస్‌కు నిరసన తెలిపే నైతిక హక్కు లేదని, 2029లో మళ్లీ రేవంత్ రెడ్డే సీఎం అవుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు బోడ స్వామి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగని మాధవి,దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న వెంకటేశ్వర్లు, కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.



## ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం పెంచాలి

**ఉద్యోగ భద్రత కల్పించాలి..టార్గెట్లు,అదనపు పనులు నిలిపివేయాలి**
**బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ డిమాండ్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం తక్షణమే అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం అదనపు కలెక్టర్‌కు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సిలివేరు ప్రభాకర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గర్భిణుల నమోదు,ప్రసవాల పర్యవేక్షణకు సంబంధించిన ఏఎన్‌సీ టార్గెట్లను ఎత్తివేయాలని,ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో విధులు నిర్వహించే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఆశా కార్యకర్తలపై అదనపు పనిభారం మోపకుండా చూడాలని, ఆన్‌లైన్ పైప్‌లైన్, ఎన్‌సీఓ, అభా తదితర పనులను వారితో చేయించడం నిలిపివేయాలని కోరారు. ఆశా కార్యకర్తలకు వర్తించే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలోఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా అని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ బిఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుపై నల్లగొండ క్లాక్ టవర్ లేదా మిర్యాలగూడ రాజీవ్ చౌక్ కేంద్రంగా బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్న సమయంలో రైతు ధర్నా పేరిట అబద్ధాలు ప్రచారం చేయడం తగదన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడడంలో దిట్ట అని, ఆయన వ్యాఖ్యలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రాహుల్ డిక్లరేషన్‌ను ఆచరణలో చూపిస్తూ రూ.21 వేల కోట్లు ఒకే విడతలో రైతు రుణమాఫీ కింద విడుదల చేసిందని వివరించారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గిన పరిస్థితుల్లో పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని గుర్తు చేశారు. ప్రజా ధనాన్ని దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్న కేటీఆర్, కేసీఆర్ రూ.17 వేల కోట్ల అవినీతి సొమ్మును బీఆర్ఎస్ ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతతో పనిచేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ దశాబ్ద పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కనీసం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని నాయకులు నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ పరిధిలోని రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన సిపిఐ నాయకులు,ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి శంకర్ కుమారుడి వివాహనికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/నర్సంపేట:** ఈనెల 6,7,8లో కరీంనగర్ నిర్వహించే 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. నర్సంపేట పట్టణం కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటియూసి ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదిన కరీంనగర్ పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండలంలో నాల్గొవ రాష్ట్ర మహాసభలు ప్రారంభం కావడం జరుతాయని, ఈసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది హమాలి కార్మికులు పాల్గొని విజయవంతంచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు అక్కపెల్లి రమేష్, ఇల్లందుల సాంబయ్య, కనకమల్లు ఎడ్ల నాగులు, సారంగం, రవి, పాణి, కుమార్, సోమయ్య, రాజకుమార్ పాల్గొన్నారు.


## లారీని ఢీ కొన్న బైక్.. ఒకరు మృతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ, వరంగల్ ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నెక్కొండ పట్టణ శివారులోని క్రషర్ల సమీపంలో లారీని బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా బత్తినేనిపల్లి గ్రామానికి చెందిన అగ్ని గుండాల మస్తాన్ కొంతకాలంగా నెక్కొండ మండలం సాయిరెడ్డిపల్లిలో ఉంటూ సుతారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బైక్‌పై వరంగల్ వైపు వెళ్తుండగా క్రషర్ల సమీపంలో లారీని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఫణిందర్ తెలిపారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమ్మవారిని దర్శించుకున్న
ఎమ్మెల్యే నాయిని దంపతులు, సిపి శ్వేత



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** హిందువుల ముఖ్యమైన పండగల్లో అత్యంత విశిష్టమైనది శ్రీకృష్ణ జన్మాష్టమి అని పండితులు పేర్కొన్నారు. సనాతన ధర్మాచరణకు మార్గనిర్దేశం చేస్తూ కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి భగవద్గీతను బోధించిన జగద్గురువు శ్రీకృష్ణుడి జన్మదినాన్ని జన్మాష్టమిగా, జయంతిగా ఆచరిస్తారని తెలిపారు. అష్టమి తిథి రోహిణి నక్షత్రంలో కూడినప్పుడు జయంతిగా, రోహిణి నక్షత్రం లేకుండా వచ్చే అష్టమిని జన్మాష్టమిగా పరిగణిస్తారని వివరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వ్రతానికి పురాణాల్లో విశిష్ట స్థానం ఉందని, అర్ధరాత్రి సమయంలో శ్రీకృష్ణుడిని పూజించడం ప్రధానమని తెలిపారు. ఉపవాసం, పూజలు, జాగరణతో భక్తులు ఈ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుండే అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ అర్చకులు ప్రముఖులకు మహదాశీర్వచనం అందజేసి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందించారు.

## పోలీస్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం



**ప్రజాపక్షం/తొర్రూరు :** కుటుంబ కలహంపై డయల్ 112కు ఫిర్యాదు రావడంతో స్పందించిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ జాటోతు రామచంద్రుపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలోని 14వ వార్డులో చోటు చేసుకుంది. తొర్రూరు సీఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో భార్యభర్తల మధ్య కుటుంబ కలహం జరుగుతుందంటూ డయల్ 112కు ఫిర్యాదు అందింది. దీంతో బ్లూకోల్ట్ కానిస్టేబుల్ జాటోతు రామచంద్రు ఘటనా స్థలానికి చేరుకొని భార్య, భర్తల గొడవను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తుండగా కోటేశ్వర్‌రావు అనే వ్యక్తి అసభ్య పదజాలంతో దూషిస్తూ కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ రామచంద్రుకు చంక బాగంలో కత్తిపోటు తగిలి గాయం కాగా రక్తస్రావం అయింది. వెంటనే అప్రమత్తమైన కానిస్టేబుల్ మిగతా పోలీస్ సిబ్బందికి సమాచారాన్ని ఇవ్వగా ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు రామచంద్రును తొర్రూరులోని సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గాయాన్ని పరిశీలించి చికిత్స అందించి ఆరు కుట్లు వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని తదుపరి చర్యల నిమిత్తం తొర్రూరు కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గణేశ్ తెలిపారు.

## ఆసుపత్రుల పాలైన వారికి ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/కమలాపూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగానికి ప్రాధన్యత ఇస్తూ ఆరోగ్య శ్రీ పథకాన్ని పది లక్షలకు పెంచిందని, అలాగే పరిస్థితి బాగోలేక ఆసుపత్రుల పాలైన వారికి ఆర్థిక భరోసా కల్పించడానికి సిఎం సహాయ నిధి నుండి అర్హులైన లబ్ధిదారుల గడప గడపకు వెళ్ళి సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం కమలాపూర్ మండల పరిధీలోని 18 గ్రామాల్లో 18 లక్షల విలువ చేసే 51 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసాల శ్రీనివాస్, ఝాన్సీ, డైరెక్టర్లు, మాట్ల రమేష్, రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ధర్ముల శ్రీకాంత్, నవీన్, పైసా శరత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌దే ‘నానాజాతి సమితి’

పచ్చ కాంగ్రెస్ అంటూ విమర్శలా?
కెటిఆర్...ముందు మీ పార్టీ చరిత్ర చూసుకోండి
బిఆర్ఎస్, బిజెపిలకు మంత్రి సీతక్క కౌంటర్

**ప్రజాపక్షం/ములుగు:** ఇతర పార్టీల నుండి నేతలను చేర్చుకుని బిఆర్ఎస్ 'నానాజాతి సమితి'గా మారిందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఎద్దేవా చేశారు. అలాంటి పార్టీ కాంగ్రెస్‌ను 'పచ్చ కాంగ్రెస్' అంటూ విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఇతర పార్టీల నుండి బిఆర్ఎస్‌లో చేరిన నేతల గురించి మాట్లాడే ముందు కెటిఆర్ తన పార్టీ చరిత్రను గుర్తు చేసుకోవాలని సూచించారు. "మీ పార్టీలోకి వస్తే పవిత్రులు.. పక్క పార్టీలోకి వెళ్లే అనైతికులా? అని ప్రశ్నించారు. ములుగు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె బిఆర్ఎస్, బిజెపిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు నిరసనల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, పేదలకు సన్నబియ్యం, 200క యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ఇచ్చిన దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, డబుల్‌బెడ్రూం ఇళ్లు, కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య హామీల్లో ఎన్ని నెరవేర్చారో ప్రజలకు చెప్పాలని సవాల్ చేశారు.

**'లెక్కలతో సహా చర్చకు సిద్ధం'**

రైతు రుణమాఫీ, పంట బోనస్, సంక్షేమ పథకాలు, ఉద్యోగాల భర్తీ నియోజకవర్గాల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సీతక్క స్పష్టం చే శారు. మండలాల వారీగా లబ్దిదారుల జాబితాల తో చర్చకు రావాలని బిఆర్ఎస్ నేతలకు సవాల్ వి సిరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ కు ఏం చేసిందో కూడా చెప్పాలని డిమాండ్ చేశా రు.



**'పోస్టర్లతో రెచ్చగొడితే సహించం'**

వ్యక్తిగత దూషణలు, కించపరిచే పోస్టరల్తో రాజకీయాలను దిగజార్చవద్దని సీతక్క హెచ్చరించారు. తమ నాయకులు, ప్రజా ప్రతినిధులను అవమానించేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. "మా కార్యకర్తల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. సహనం కోల్పోతే నష్టం మీకే" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బిసి సెల జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సీఎం సహాయ నిధి పేదలకు వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లో మంజూరైన 60 మంది లబ్ధిదారులకు రూ19,22,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుంది. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, ఆపదలో సీఎం సహాయ నిధి ఆపద్బాంధవునిలా ఆదుకుంటుందని అన్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఈ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని, బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు శవాలతో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలు ఎలాంటి వెనకడుగు వేయడం లేదన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో హర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమురయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు దెబ్బేట అనిల్, దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, కుమార్, గంగాధర్ రవీందర్, బుర్ర లక్ష్మన్, సర్వ శరత్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 6న ఎఐటియుసి 4వ రాష్ట్ర మహాసభలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు
అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపు




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఆగస్టు 6 నుండి 8 వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ లో రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేశపల్లి నవీన్ లు మాట్లాడుతూ వందలాదిమంది తరలివచ్చి కరీంనగర్ లో జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులోకం కదిలి వచ్చి కేంద్రంలో మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహబూబాద్ జిల్లా నుండి 6వ తేదీన భారీ సంఖ్యలో కార్మికులు తరలివచ్చి లక్ష మందితో జరిగే బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర మహాసభలలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభలలో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు ముందుకు పోదాం అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు నర్రా శ్రావణ్, మంద శంకర్ ,తండా శ్రీనాథ్ ,మునుకుంట్ల రాజు, మంచినీళ్ల రాకేష్, మంద రవి, పొన్నం యాకయ్య పాల్గొన్నారు.

## మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి
సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ



**ప్రజాపక్షం/వరంగల్:** తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు 4పిఎం న్యూస్ నెట్‌వర్క్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్ ఢిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న సమయంలో తమను ఢిల్లీ పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకుని దాడి చేశారని చేసిన ఆరోపణలను అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శి డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి సంఘటనలు అత్యంత ఆందోళనకరమని, వార్తలను సేకరించడం, ప్రజలకు నిజాలను తెలియజేయడం జర్నలిస్టుల రాజ్యాంగబద్ధమైన హక్కని, విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టాలని, బాధ్యులైన ఢిల్లీ పోలీసు సిబ్బందిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించి, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలన్నారు. మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లకు ఏఐవైఎఫ్ సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ, వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులను డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మహిళా డెయిరీ నిర్మాణ పనులు ఎమ్మెల్యే తనిఖీ



**ప్రజాపక్షం/ఆత్మకూరు/దామెర :** దామెర మండలం కేంద్రంలో నిర్మిస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం రోజున పరిశీలించారు.డెయిరీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, స్థల పరిస్థితులు, రహదారి సౌకర్యం తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించి,పలు సూచనలు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు పోతున్నారని అన్నారు.రైతులకు పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాల సాధనకు ఉచిత కోచింగ్

టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు



**ప్రజాపక్షం/కాటారం:** గ్రామీణ ప్రాంత యువత పోలీస్ ఉగ్యోగాల సాధనకు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీబాబు అన్నారు. అశుక్రవారం మండల కేంద్రంలోని సువిధ్య హైస్కూల్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ ఉద్యోగాల సాధన కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల నిరుద్యోగ యువత పోలీస్ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసామని ఇందులో కోచింగ్ తీసుకునే యువతకు స్టడీ మెటీరియల్‌తో పాటు భోజనం తదితర సౌకర్యాలను అందించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సువిధ్య కొట్టె శ్రీశైలం, తిరుమల సమ్మయ్య, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు, మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి


వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే
రాజేందర్‌రెడ్డికి ప్రజా సంఘాల వినతి



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** హనుమకొండ జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్మూంటే రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చెయ్

నేనూ ఇండిపెండెంట్‌గా
పోటీ చేయడానికి సిద్ధం
కొండా సురేఖకు
ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వరంగల్ తూర్పులో ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కొండా సురేఖకు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తాను కూడా ఇండిపెండెంట్ గా పోటీకి సిద్ధమని, ఇన్నేళ్లుగా ప్రజల రక్తం తాగుతూ కొండా దంపతులు బీసీ కార్డు వాడుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని తిడితే ఊరుకోమని, హై కమాండ్ కు ఫిర్యాదు చేసింది తానేనని అన్నారు. మంత్రి పదవి పోవడం కొండా సురేఖ వాళ్ళ స్వయంకృతాపరాధమేనని, మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నే తిట్టడం భావ్యం కాదని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు కొండా దంపతులవేనని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ వారిని బ్లాక్ మెయిల్ చేయడం కొండ వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, నేను కూడా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తా ఎవరి భవిష్యత్తు ఏంటో ప్రజలు నిర్ణయిస్తారని సవాల్ విసిరారు. కష్టం వచ్చినప్పుడే బీసీ నినాదం ఎత్తుకుంటారని, ఒక్కరిని కూడా బీసీలను కొండా దంపతులు ఎదగనివ్వలేదని అన్నారు. రామసహాయం సురేందర్ రెడ్డి లాంటి సీనియర్లను విమర్శించడం వారి స్థాయి కి తగదన్నారు. సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన నీచ చరిత్ర కొండ సురేఖదని, వరంగల్‌లో ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా వారికి సపోర్ట్ చేయరని అన్నారు. కొండా సురేఖ గెలుపు కోసం పని చేసిన వారిని పట్టించుకోని వారి బుద్ధి ఇక్కడ అందరికీ తెలుసని, కుడా చైర్మన్ పదవి గుండు సుధారాణికి ఇవ్వడం అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్,బస్వరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి, చాగంటి శ్రీనివాస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రూ.14.82 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మంగపేట:** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ సూచన మేరకు పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ ముఖ్యంగా వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భరోసా కల్పిస్తున్నామని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క చొరవతో మంగపేట మండలానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి 32 మంది లబ్ధిదారులకు మొత్తం 14,82,500 లక్షల రూపాయలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ, ప్రజలు కష్టకాలంలో ఉంటే మేమున్నాం. మీకు అండగా ఉంటాం” అనే భరోసాతో మంత్రి సీతక్క ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పేద కుటుంబాల వైద్య అవసరాలను గుర్తించి వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ములుగు జిల్లాలో ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న మంత్రి సీతక్క ఉండటం జిల్లా ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని, పేదల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జయరాం రెడ్డి, యానయ్య, చింత పున్నారావు, జగన్ మోహన్ రెడ్డి, నరేందర్ ఆదినారాయణ, వీరస్వామి, మూగల చంటి, నరసింహారావు, శేషగిరిరావు, వెంకటేశ్వర్లు, నరేష్, శ్రీనివాస్ రావు, చాద మల్లయ్య, నాగార్జున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లబ్ధిదారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై నిర్మిస్తున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జీనీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

# రీల్



## బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో 'కృష్ణంభజే'

జయశ్రీ మీడియా సమర్పణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం 'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషిస్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు. పోస్టర్‌లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండేయుడి గెటప్‌లో సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీప్, వంగమయి పటేల్ నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన సంభాషణలను రచ్చ రవి అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. త్వరలోనే టీజర్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: శ్రీరాం గుప్త, సినిమాటోగ్రఫీ: . రాము సి.ఎం సూర్య మీసాల, సంగీతం: మంథెన త్రినాథ్ సత్య సొమేష్, ఎడిటర్: జి. రాకేష్ గౌడ్, కొరియోగ్రఫీ: ఎ.ఆర్. బాబు బాలకృష్ణ, ఫైట్స్: రవి తేజ.

## 18న 'హ్యాపీ జర్నీ' విడుదల



గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై నిర్మిస్తున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జీనీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'హ్యాపీ జర్నీ' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్లో విమానాశ్రయం బ్యాక్‌డ్రాప్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణం అంతా సందడిగా, సరదాగా కనిపిస్తున్నారు. ట్రావెల్ బ్యాగులు, బ్యాక్‌గ్రౌండ్‌లో విమానం, పేపర్ ప్లేన్ మోటిఫ్ సినిమాకు సంబంధించిన ట్రావెల్ థీమ్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ పాత్రలు సాగించే ప్రయాణం వారి జీవితాలపై చెరగని ప్రభావాన్ని చూపించబోతోందనే విషయాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా హార్ట్ వార్మింగ్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. విడుదల తేదీ ఖరారు కావడంతోమేకర్స్ ప్రమోషన్స్‌ను మరింత ముమ్మరం చేసి, సినిమాపై బజ్‌ను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్ నిర్వర్తిస్తున్నారు.

## కమల్ కొత్త లుక్ వైరల్



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ కొత్త సినిమా ప్రకటించింది. ఈ చిత్రానికి ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ఆర్‌కె ఎఫ్ఐ (రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా వరల్డ్ వైడ్ ఆసక్తిని పెంచుతోంది. పవర్‌ఫుల్‌గా కనిపించే లుక్‌ను చేతిలో పట్టుకున్న ఆ యుధం మరింత ఇంటెన్సిటీని తీసుకొచ్చింది. ఎంతో కూల్‌గా కనిపిస్తూనే, భారీ ఆయుధంతో నడుస్తున్న కమల్ హాసన్ లుక్..ఈ లుక్ టెస్ట్‌కు సంబంధించిన కొన్ని గ్లింప్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి 'సేతుపతి', 'చిత్తా' వంటి సినిమాలతో ఎస్.యు. ఆయన కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం ఈ కొత్త ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తవడంతో సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

## 'అతిగా ఆలోచించకురా' సాంగ్ రిలీజ్



డిజె టిల్లు' చిత్రంతో సెన్సేషనల్ డెబ్యూ చేసిన దర్శకుడు విమల్ కృష్ణ, రాగ్ మయూర్ కథానాయకుడిగా నటిస్తున్న మరో యునిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'అనుమాన పక్షి'తో అలరించబోతున్నారు. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే టీజర్, విభిన్నమైన ప్రమోషనల్ కంటెంట్ ఆసక్తిని పెంచింది.తాజాగా 'అతిగా ఆలోచించకురా' అనే ఫన్ సాంగ్ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా హీరో క్యారెక్టర్ను ఫన్గా ప్రజెంట్ చేస్తోంది. క్యారెక్టర్ స్వభావాన్ని, అతని ఆలోచనా విధానాన్ని సరదాగా చూపిస్తూ పాట సాగుతుంది. పాట విడుదలైన వెంటనే మంచి ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. ఈ పాటకు శ్రీచరణ్ పాకాల ఆకట్టుకునే ట్యూన్ సమకూర్చారు. సాన్వి, రవి ప్రకాష్ చోడిమళ్ల కలిసి ఆలపించారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించారు.'డిజె టిల్లు'తో తనదైన క్యారెక్టరైజేషన్, హ్యూమర్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు విమల్ కృష్ణ 'అనుమాన పక్షి'తో మరో వైవిధ్యమైన కాన్సెప్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ కథానాయికగా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, రాశి, అనన్య, చరిత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సినిమాటోగ్రాఫర్ సునీల్ కుమార్ నామా, శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ అందిస్తున్నారు. జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా, అభినవ్ కునపరెడ్డి ఎడిటర్‌గా పని చేస్తున్నారు.'అనుమాన పక్షి' సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది.



## 'లీసా' షూటింగ్ పూర్తి

ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లీసా'. విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలైన నటి అనన్య నాగళ్ల ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. జవహర్ పవార్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్‌లను సరికొత్త పద్ధతిలో మేళవించి 'లీసా' కథను రూపొందించారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సతీష్ రెడ్డి మాసం ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు స్క్రీన్‌ప్లే సమకూర్చి, సహ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. 'ఎస్సార్ కళ్యాణమండపం' దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు కథ నచ్చడంతో 'మెలోడీ బ్రహ్మ' మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించడానికి సుముఖంగా ఉన్నారు, ఇది సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కూర్గ్, విరాజ్పేట, పెంచలకోన పరిసర ప్రాంతాల్లోని అద్భుతమైన లొకేషన్లలో అత్యున్నత నిర్మాణ విలువల (రిచ్ ప్రొడక్షన్ వేల్యూస్) తో భారీ స్థాయిలో ఈ సినిమాను చిత్రీకరించారు. అనన్య నాగళ్ల, అల్లాల రవిరెడ్డి గారు, సుమన్, మూసా అలీ ఖాన్, రత్నాకర్ రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ, గడ్డం నవీన్, ఆకెళ్ల, సుజాత, సుజి, మానస, శ్యామ్, వెన్ని, జాను వర్మ, హనుశ్రీ తదితరులు నటించారు.



## నిర్మాతలకు ఏటా రూ.50 లక్షల ఇన్సూరెన్స్

### ప్రోగ్రెసివ్ ప్యానెల్ మేనిఫెస్టో విడుదల
### 6వ తేదీన నిర్మాతల మండలి ఎన్నికలు

తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఎన్నికలు ఈ నెల 6వ తేదీన ఫిలిం ఛాంబర్ ప్రాంగణంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రోగ్రెసివ్ ప్యానల్ మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే ప్రెసిడెంట్‌గా సి.కళ్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, మిగితా పోస్టులకు పోటీ నెలకొంది. ఈ సందర్భంగా శుక్రవారం మేనిఫెస్టో విడుదల అనంతరం మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలన్నీ పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నామని నిర్మాతలు దామోదర్ ప్రసాద్, నటుడు అశోక్ కుమార్ వెల్లడించారు. నిర్మాతలకు వైద్య భద్రత, అత్యవసర సహాయం కింద వెంటనే ఐదు లక్షల రూపాయల క్యాష్ లెస్ మెడికల్ ఇన్సూరెన్స్ అందుబాటులోకి తెస్తామని, ఏటా యాభై లక్షల వైద్య సహాయనిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. 306 మంది సభ్యులను ఒకేసారి మినిమం ఫీజు తీసుకుని అందరికి లైఫ్ మెంబర్ షిప్ ఇస్తామని పేర్కొన్నారు. కొత్త నిర్మాతలకు ప్రోత్సహం, సింగిల్ విండో ద్వారా నిర్మాతలకు హెల్ప్ డెస్క్, కంటెంట్ ఫెసిలిటేషన్ వంటి సదుపాయాలను నిర్మాతలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. మహిళా సభ్యుల భద్రత కోసం కౌన్సిల్ నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఆన్ లైన్ టికెటింగ్, అధికంగా వసులు చేస్తున్న కన్వీయన్స్ ఫీజులు, మల్టి ప్లెక్స్ థియేటర్లలో సామాన్యుడికి భారంగా మారిన ఆహార పానీయాల ధరలపై ప్రభుత్వ శాఖలతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.మన ప్యానల్ నుంచి పోటీ చేస్తున్న కొందరు నిర్మాతలను చీడ పురుగులు అని వ్యాఖ్యానించడం సరైంది కాదని, ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. కనీసం సభ్యుల లిస్టు కూడా ఇవ్వలేదని, ఇలాంటి పరిస్థితుల్లోనే తాను కోర్టుకు వెల్లాసి వచ్చిందని నటుడు అశోక్ చెప్పారు. ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ఆర్‌కె , ముత్యాల రామాంజనేయులు, మైత్రి రవి, రవీంద్ర గోపాల మాట్లాడారు.

# పత్రికా స్వేచ్ఛపై పాశవిక దాడి

### మహిళా జర్నలిస్టులకు సిపిఐ సంఘీభావం
### దాడిపై స్వతంత్రసమగ్ర దర్యాప్తుకు డిమాండ్

**న్యూఢిల్లీ:** మోదీ పాలనలో పత్రికా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులు హరిచిపోతున్నట్లు షసిపిఐ విమర్శించింది. ప్రజాస్వామ్య విలువలను నీరుగారుస్తుండటాన్ని తప్పుపట్టింది. న్యూఢిల్లీలోని సాకేత్ పోలీస్ స్టేషన్‌లో మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌పై దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది ఇద్దరు జర్నలిస్టులపై జరిగిన దాడి మాత్రమే కాదని...పత్రికా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా సీపీఐ విమర్శించింది. ఇద్దరు జర్నలిస్టులకు మద్దతు ప్రకటించింది. షాహీన్ ఖాన్ ముస్లిమని పోలీసులకు తెలిసిన తర్వాత ఈ దాడి తీవ్రత మరింత పెరిగిందన్న ఆరోపణలు ఆందోళనకరమని పేర్కొంది. మహిళా జర్నలిస్టులపై భౌతిక దాడి, వారి మతపరమైన గుర్తింపును లక్ష్యంగా చేసుకుని అవమానించడం, పోలీస్ స్టేషన్‌లోనే దురాగతాలకు పాల్పడటం హేయమంటూ దుయ్యబట్టింది. ఈ దాడిపై స్వతంత్ర, నిష్పాక్షిక, కాలపరిమితితో కూడిన సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేసింది. బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిని చట్టపరంగా శిక్షించాలని కోరింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్వర్యంలో ఢిల్లీ పోలీసుల వ్యవహారశైలి చట్టపరమైన పరిమితులు, పోలీసు నిబంధనలు, రాజ్యాంగపరమైన జవాబుదారీతనాన్ని పట్టించుకోని స్థాయికి దిగజారిందని సిపిఐ విమర్శించింది. విద్యార్థుల ఉద్యమంపై జులై 20న జరిగిన పోలీసు చర్యలు, పెల్లెట్ గన్స్ వినియోగం, మతత్వవాద సంస్థల కార్యకర్తలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడం వంటి పరిణామాలను గుర్తుచేసింది. విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ... రాజకీయ అనుబంధమున్న వ్యక్తుల విషయంలో ఉదాసీనత వైఖరి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సిపిఐ పేర్కొంది. ఢిల్లీ పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేసింది. ఇదే క్రమంలో సిపిఐ కార్యదర్శులు అనీరాజా, రామకృష్ణ పాండాతో పాటు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగ రాజ్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో షాహీన్ ఖాన్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.



# నిరసనలో ఖైదీలా?

### అమిత్‌షా సమాధానమేమిటి: డి.రాజా

**న్యూఢిల్లీ:** ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా జరిగిన విద్యార్థుల నిరసనను నేరపూరితంగా చిత్రీకరించేందుకు దిల్లీ పోలీసుల ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) వ్యవస్థను దుర్వినియోగం చేశారా అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఎక్స్ మాధ్యమంగా ప్రశ్నించారు. ముఖ గుర్తింపు డేటాపై ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశీలన ఈ వ్యవహారంపై అనుమానాలకు తావిచ్చినట్లు పేర్కొన్నారు. 'హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలలో నిందితులుగా ఉన్న వారిని నిరసనల్లో గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలా గుర్తించిన కనీసం 25 మంది జైల్లో ఉన్నట్లు జైలు, పోలీసు, కోర్టు రికార్డులు వెల్లడిస్తున్నాయి. జైలులో ఉన్న వ్యక్తులు జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలో ఎలా కనిపించారు? ఇది ఎలా సాధ్యం? వారిని అక్కడికి ఎవరు తీసుకొచ్చారు? అధికారిక అనుమతితోనే వాళ్లను బయటకు తెచ్చారా? పోలీసులే తరలించారా? ఈ వ్యక్తుల పేర్లు నిరసనలో ఉన్నవారిగా ఎలా నమోదయ్యాయి?' అని డి.రాజా వరుస ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలు దిల్లీ పోలీసుల విశ్వసనీయతను నిలదీస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇది సాధారణ సాంకేతిక తప్పిదమా లేక విద్యార్థుల ఉద్యమంపై నేర ముద్రకు వ్యూహాత్మక కథనమా అని సూటిగా ప్రశ్నించారు. హింస, హత్య లేదా లైంగిక దాడి వంటి నేరాల్లో నిందితులుగా ఉన్న వారని చెప్పడం వెనుక ఆ నేరాల నిందను విద్యార్థులపైకి నెట్టే ప్రయత్నం జరిగిందా అంటూ డి.రాజా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెపాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని తన పోస్టులో పేర్కొన్నారు. ముఖ గుర్తింపు సాంకేతికత ఒక వ్యక్తిని నేరస్తుడిగా 'గుర్తించింది' అని చెబితే సరిపోదని... దానిని ధృవీకరించడానికి ఆధారాలు కావాలని సూచించారు. సంబంధిత ఫుటేజీ ఎప్పటిది? ఏ సందర్భంలో తీసినది? గుర్తించిన వ్యక్తుల కదలికలను జైలు రికార్డులతో ఎందుకు సరిపోల్చలేదు? ఖైదీలు నిరసన స్థలంలో ఉన్నట్లు పోలీసు డేటా ఎలా చూపించింది? వంటి ప్రశ్నలకు పారదర్శకమైన సమాధానాలు, వివరణను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవ్వాలని డి.రాజా డిమాండ్ చేశారు. దిల్లీ పోలీసులపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని, విద్యార్థి ఉద్యమాన్ని నేరపూరితంగా చూపించేందుకు అధికారిక వ్యవస్థలను దుర్వినియోగించడం నిజమైతే... ప్రజాస్వామ్యబద్ధ నిరసన హక్కుపై అత్యంత తీవ్రమైన దాడి చేయడమే అవుతుందని డి.రాజా వ్యాఖ్యానించారు. నిజాన్ని ఎంతో కాలం కప్పిపుచ్చలేరని, ఏదో ఒక రోజు నిజం తప్పకుండా బయటకు వస్తుందని ఆయన స్పష్టంచేశారు.

# చర్యలేవి?

(మొదటి పేజీ తరువాయి)

ఇది హత్యాయత్నమని, సంబంధిత సెక్షన్‌ను చేర్చాలని మేము పోలీసులపై ఒత్తిడి తెస్తూనే ఉన్నాము. వారు దళిత కుటుంబానికి చెందినవారు అయినందున ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశాము. ఈ వ్యవహారంలో కులపరమైన కోణం కూడా ఉంది. కానీ పోలీసులు అటువంటి చర్యలేవీ తీసుకోలేదు. మేము ఒత్తిడి తెచ్చినప్పుడు కోర్టును ఆశ్రయించి ఉత్తర్వు తెచ్చుకోమని వారు మాకు చెప్పారు' అని ఆయన అన్నారు. భరద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని సిజెపి ఆరోపించింది. సంజయ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. నిరసనకారులు ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వతంత్ర భరద్వాజ్‌ను 72 గంటల్లోగా అరెస్టు చేస్తామని ఢిల్లీ పోలీసులు హామీ ఇచ్చినట్లు 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. అయితే సంజయ్ తల పగిలిందన్న వాదనలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఘర్షణ సమయంలో ఆయనకు స్వల్ప గాయం మాత్రమే అయిందని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వారు పేర్కొన్నారు. కాగా జంతర్ మంతర్ నిరసనలో తమ మద్దతుదారుడికి గాయాలయిన ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేయాలని కోరుతూ సిజెపి కార్యకర్తలు గుమిగూడటంతో పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్ బయట పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్, సిజెపి నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాకు మద్దతు తెలిపేందుకు పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. సిజెపి నాయకురాలు నిషు ఆజాద్, ఆమె తండ్రి సంజయ్‌కు న్యాయం చేయాలని కోరుతూ ఆయన వారితో గళం కలిపారు. అశుతోష్ రాంకా విలేకరులతో మాట్లాడుతూ 'జంతర్ మంతర్ వద్ద మేము చేపట్టిన నిరసనలో మా మద్దతుదారులలో ఒకరైన నిషు ఆజాద్ తండ్రి సంజయ్ జీపై దాడి జరిగింది. దీనివల్ల ఆయన తలకు గాయాలయ్యాయి. నిందితులను అరెస్టు చేసి, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సౌరవ్, మా బందం అనేక సార్లు డిమాండ్ చేసినప్పటికీ, ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తామే సంజయ్ జీపై దాడి చేశామని, ఆయన్ని చంపడానికి ప్రయత్నించామని ఆ ఘటనలో పాల్గొన్న వ్యక్తులు బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. అయినప్పటికీ కపిల్ మిశ్రా, బిజెపి కార్యకర్తల ప్రభావంతో ఢిల్లీ పోలీసులు వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇది దేశానికి, మన ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటైన రోజు. మొదటి నుంచీ మా బందం మొత్తం సంజయ్ జీకి అండగా నిలిచింది. ఘటనలో తమ ప్రమేయం ఉందని స్వయంగా చెప్పుకున్న వారిని ఢిల్లీ పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, తగిన సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని తెలిపారు. జంతర్ మంతర్ నిరసనలో దాడికి గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యకర్త తండ్రి సంజయ్ మాట్లాడుతూ 'మేము అన్యాయంపై పోరాడుతున్నప్పుడు, ప్రభుత్వంపై గళం విప్పుతున్నప్పుడు 'జై భీమ్' అని నినదిస్తాము. కొందరికి 'జై భీమ్' అనే నినాదం పట్ల సమస్య ఉంది. వారు అభ్యంతరం వ్యక్తం చేస్తారని మాకు తెలుసు. అందుకే అక్కడ 'జై భీమ్' నినాదాలు కూడా చేశాము. నిరసన సమయంలో నాపై దాడి జరిగింది. నేను ఫిర్యాదు చేశాను. కానీ గూండాలను, నేరస్థులను కాపాడి, బాధితుడిని బలహీనపరచడమే పోలీసుల పనిగా కనిపిస్తోంది' అని అన్నారు. శుక్రవారం నాటి సిజెపి నిరసనలో స్వతంత్ర ఎంపీ పప్పుయాదవ్ పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అక్షయ్ లక్రా మాట్లాడుతూ ఈ కేసులో సెక్షన్ 307 (హత్యాయత్నం) చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో మేము ఈ రోజు పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాము. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఇప్పటికే కేసు నమోదు చేశామని పోలీసులు ధ్రువీకరించారు. దీనితో పాటు స్వతంత్ర భరద్వాజ్‌పై సెక్షన్ 307ను కూడా నమోదు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని తెలిపారు.

# పోలవరం ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

రాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన మంత్రి.. తెలంగాణలో సంభవించే ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి పోలవరం ప్రభావంపై వివరించి, ప్రాజెక్టును పునఃపరిశీలించాలని కోరుతామని తెలిపారు.

**ముక్కోటి నాటికి ఉత్తర ద్వార పనులు పూర్తి చేయాలి**

భద్రాచలం శ్రీ సీతారామయచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ముక్కోటి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు పూర్తి చేయాలని శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో కలిసి ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటికి ఐటీడీఏ పీఓ రాహుల్, ఆలయ ఈవో దామోదర్, తహశీల్దార్ రవి కుమార్, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ముక్కోటి ఉత్సవాల నాటికి ఉత్తర ద్వార అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది శ్రీరామనవమి ఉత్సవాల నాటికి మిగిలిన ఆలయ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 2027లో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభం నాటికి గోదావరి ఘాట్లు, పరివాహక ప్రాంత అభివృద్ధి పనులు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా, దశాబ్దాలపాటు పటిష్టంగా ఉండేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కల్పించాల్సిందే


(మొదటి పేజీ తరువాయి)

తొగుట, రాంపూర్ ప్రాంతాలకు చెందిన రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ఈ తీర్పు ఇచ్చారు. జీవో 214లో పునరావాస వ్యయాన్ని భూ పరిహారం నుంచి వేరు చేసినందున రెండూ వేర్వేరు ప్రయోజనాలని పేర్కొంది. 2017 చట్ట సవరణకు 2014 జూన్ 2 నుంచి పూర్వప్రభావం ఉన్నందున అర్హులైన రైతులకు పునరావాస హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ప్రతి పిటిషనర్ అర్హతను అధికారులు విడిగా పరిశీలించి, వాదనలు విన్న అనంతరం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఇప్పటికే పొందిన ఇళ్లు, ఇతర ప్రయోజనాలను లెక్కలోకి తీసుకుని మిగిలిన ప్రయోజనాల్లో సర్దుబాటు చేయాలని, ఒకే ప్రయోజనం రెండు సార్లు ఇవ్వొద్దని పేర్కొంది. దరఖాస్తు తిరస్కరిస్తే కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలని, ఉత్తర్వుల ప్రతులు అందిన ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేసి అర్హులకు ప్రయోజనాలు కల్పించాలని ఆదేశించింది. జీవో 123, 214ల చట్టబద్ధతపై ఈ తీర్పులో అభిప్రాయం చెప్పడం లేదని, ఆ అంశం డివిజన్ బెంచ్ పరిధిలో ఉందని తెలిపింది.

# కాంగ్రెస్ మహా ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మహా ధర్నాలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ధర్నా ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి రెండు జిల్లాల డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మహా ధర్నాను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com